బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...

# కర్మ సిద్ధాంతం

తటవర్తి వీరరాఘవరావు





బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో....

# కర్మ సిద్ధాంతం



రచన & ప్రచురణ : **తటవర్తి వీరరాఘవరావు**


| | | | |
|---|---|---|---|
| ప్రథమ ముద్రణ | : డిశంబరు, 2015 | నాల్గవ ముద్రణ | : జూలై, 2022 |
| ప్రతులు | : 3,000 | ప్రతులు | : 1,000 |
| ద్వితీయ ముద్రణ | : అక్టోబరు, 2018 | ఐదవ ముద్రణ | : ఏప్రిల్, 2024 |
| ప్రతులు | : 1,000 | ప్రతులు | : 1,000 |
| తృతీయ ముద్రణ | : జనవరి, 2021 | ఆరవ ముద్రణ | : ఆగస్ట్, 2025 |
| ప్రతులు | : 1,000 | ప్రతులు | : 1,000 |

వెల : రూ.80/-లు



పుస్తకముల కొరకు:

**తటవర్తి వీర రాఘవరావు**

తటవర్తివారి వీధి, భీమవరం - 534 201. ప॥గో॥జిల్లా.

ఫోన్ : 9490171853, సెల్ : 9440309812

email : balajipyramid.bvrm@gmail.com



▲ పక్షి బ్రతికి వున్నప్పుడు చీమలను తింటుంది. కానీ పక్షి చనిపోయినపుడు ఆ పక్షిని చీమలు తింటాయి.

కాలం, పరిస్థితులు ఎప్పుడైనా మారవచ్చు. ఎవరినీ తక్కువగా చూడకు. ఎవరినీ గాయపరచకు. నీ కంటే సమయం ఎంతో శక్తివంతమైనదని గుర్తుంచుకో.


ఒక చెట్టు 10 లక్షలు అగ్గిపుల్లలను చెయ్యగలదు. కానీ ఒక అగ్గిపుల్ల 10 లక్షల చెట్లను తగులబెట్టగలదు.

అందుచేత మంచిగా వుండు మంచి చెయ్యి.

▲ ఏ వ్యక్తి పవిత్రమైన ఆలోచనలతో మాట్లాడినా, లేక పని చేసినా ఆనందం ఎప్పటికీ అతనిని విడువని నీడలా అతని వెన్నంటే వుంటుంది.

**– గౌతమ బుద్ధుడు**

# "ది గ్రేట్ లా ఆఫ్ కర్మ"



లా అంటే **సిద్ధాంతం** ... మూలసృష్టి రహస్యానికి సంబంధించిన సిద్ధాంతం. మూలసృష్టిలోని కార్యకలాపాలకు సంబంధించిన ధర్మ విశేషం. గ్రేట్ అంటే **గొప్ప.**

"సృష్టిశాస్త్రం" అన్నది కొన్ని అద్భుత ధర్మసూత్రాల అవగాహన మీద ఆధారపడి వుంది. ఎంచేతంటే సృష్టి అన్నది మౌలికంగా ఆయా ధర్మ సూత్రాలకు ఆధారంగా రచించబడి వున్నది కనుక. అన్నింటికన్నా గొప్ప సృష్టి రహస్యం – "యద్భావం తద్భవతి" అన్న సూత్రం. దీనినే ఇంగ్లీషులో "ది గ్రేట్ లా ఆఫ్ కర్మ" అని అన్నారు.

కర్మ సిద్ధాంతం "కారణ కార్య సంబంధాన్ని" బట్టబయలు చేస్తుంది. కారణం లేకుండా ఏ కార్యమూ వుండదు. కారణం 'భావం'; కార్యం 'భవం'. కారణం కార్యంగా మారడానికి అవసరమైన ధాతువులే దేశకాల పరిస్థితులు

+ పురుష ప్రయత్నం + ధ్యేయం.

దేశ కాల పరిస్థితులే “జగత్తు”; జగత్తు అన్నది మూల చైతన్య కారణం యొక్క, “ప్రథమ ఇచ్ఛ” యొక్క, తక్షణ రూపాంతరం.

విస్తృత సృష్టి రచనలో ఏ విశేషాలు వున్నాయో, “మానవ సృష్టి”లో కూడా అవే విశేషాలు వున్నాయి. మానవ కార్య కలాపాలలో ఏ విశేషాలు వున్నాయో బ్రహ్మాండమైన సృష్టి విశేషాలలో కూడా అవే వున్నాయి. ఇదే మరొక “గ్రేట్ లా”. అంటే – “ఇక్కడ ఎలా వుందో అక్కడ అలానే వుంది” – అన్న సిద్ధాంతం. ‘ఇక్కడ’ వున్నదాని విశేషాలను గమనిస్తే ‘అక్కడ’ వున్న విశేషాలను గమనించకనే గమనించవచ్చు.

మానవ జీవితం మానవ మనోసృష్టి. దేశ కాల పరిస్థితులు జగత్ సృష్టి. అంటే ‘విరాట్’ పురుషుని సృష్టి. విరాట్ పురుషుని విరాట్ అంశే మానవుడు. మానవుని శక్తి కూడా అనంతం, అనల్పం. జగత్ సృష్టి మానవ సృష్టికోసం నిర్దేశించబడి వుంది. మానవ సృష్టి యొక్క రంగస్థలమే జగత్‌సృష్టి. మానవుని సృష్టి స్వంత మస్తిష్కంలోంచి ఏ క్షణానికి ఆ క్షణం ఉబుకుతుంది. బట్టబయలు అవుతుంది. ఏది భావిస్తే, దేనికి ప్రయత్నిస్తే, అది ‘భవం’ అవుతుంది; అనుభవానికి వస్తుంది. ప్రతి అనుభవం క్రొత్త భావానికి సహజంగానే దారి చూపిస్తుంది. ప్రతి క్రొత్త భావానికీ ‘యత్నం’ను జోడిస్తే, ‘ఎన్నిక’ను జోడిస్తే తత్ సంబంధమైన అనుభవాన్ని మళ్ళీ ప్రసాదిస్తుంది. ఇదే **“ది గ్రేట్ లా ఆఫ్ కర్మ”.**

ఈ విశేషాన్ని, ఈ సూత్రాన్ని అర్థం చేసుకున్న వారు ముక్త పురుషులు, బంధరహితులు, ఆనందసాగరంలో మునిగి వున్నవారు. తమ ‘తలా తోకా’ తెలిసినవారు. తమ ‘తలే’ తమ ‘తోక’ అని తెలిసినవారు. తమ ‘భావమే’ తమ ‘భవం’ అని తెలిసినవారు.

ఈ కర్మ విశేషమూ, కర్మ సూత్రమూ, తెలియనివారు – ముక్తి రహితులు, బంధజీవులు. దుఃఖసాగరంలో మునిగి వున్నారు.

**– బ్రహ్మర్షి పత్రీజీ**

# కర్మ సిద్ధాంతం

ఈ సృష్టి కొన్ని సిద్ధాంతాలతో, నియమాలతో నడపబడుతుంది. ఈ సృష్టిలో జీవిస్తున్న ప్రతి జీవి, మానవునితో సహా ఈ సృష్టి సిద్ధాంతాలకు, నియమాలకు అంటే ధర్మాలకు బద్ధులు. ప్రతి ఒక్కరూ సృష్టి సిద్ధాంతాలకు అనుగుణంగా జీవించాలి. అలాగే సృష్టి ధర్మాలను పాటించాలి.

ఎవరైతే వీటికి విరుద్ధంగా ప్రవర్తిస్తారో సృష్టి విరుద్ధమైన పనులు చేస్తారో వారు శిక్షింపబడతారు అంటే కష్టాల పాలవుతారు. ఈ విషయమే పురాణాల ద్వారా తెలియ చేయబడింది. రామాయణం కానీ, భాగవతం కానీ, భారతం కానీ మనకు ఈ విషయమే బోధిస్తున్నాయి. వాల్మీకి మహర్షి వేదవ్యాస బ్రహ్మర్షుల వారు ఈ పురాణాల ద్వారా ఈ విషయాలను లోకానికి తెలియ చెయ్యడం జరిగింది.

వీటి ద్వారా అసలు మానవ జీవితమంటే ఏమిటి? ఈ జీవితం ఎందుకు? ఈ పుట్టడమేమిటి? చావడమేమిటి? మానవుడు ఎక్కడ నుంచి వస్తున్నాడు? ఎక్కడికి పోతున్నాడు? చనిపోయిన తరువాత ఏమవుతుంది? అసలు మానవులు ఏమి చెయ్యాలి? ఎలా జీవించాలి? ఎలాంటి పనులు చెయ్యాలి? ఎలాంటి పనులు చెయ్యకూడదు? చేస్తే ఏమవుతుంది? అన్న విషయాలు పురాణాల ద్వారా చాలా చక్కగా తెలియజేయడం జరిగింది. అంతటి యోగీశ్వరులైనటువంటి ఋషులు అందించిన ఈ గ్రంథాలను అధ్యయనం చేసి ఎవరైతే ఆచరణలో పెడతారో వారు ఆనందంగా జీవించగలుగుతారు. ఎవరైతే పెడచెవిన పెడతారో వారు కష్టాలు పాలు కాక తప్పదు.

పై వారే కాదు ఎంతో మంది ఇచ్చిన సందేశాల ద్వారా ఈ సృష్టి సిద్ధాంతాల గురించి మనం తెలుసుకోవచ్చు. వారు తెలియపరచిన అన్ని సిద్ధాంతాలు గొప్పవే. వాటిలో ఒక ముఖ్య సిద్ధాంత సారాన్ని ఇప్పుడు మనం తెలుసుకుందాం. ఆ సిద్ధాంతమే **"కర్మ సిద్ధాంతం".**

ఈ **'కర్మ సిద్ధాంతం'** ప్రతి ఒక్కరి జీవితానికి ముడిపడి వుంది. కారణం కర్మలు చేయకుండా ఎవరూ వుండరు, వుండలేరు కూడా. కానీ లోకంలో ఈ "కర్మ సిద్ధాంతం" మీద అవగాహన లేకుండా కర్మలు చేస్తున్నారు, కష్టాలు తెచ్చుకుంటున్నారు. గమనిస్తే 'కర్మ సిద్ధాంతానికి' ఎవరూ ప్రాముఖ్యం ఇవ్వటం లేదు. పట్టించుకోవడం లేదు, అసలు ఈ 'కర్మ సిద్ధాంతం' అనేది ఉందని ఎంతమందికి అవగాహన వుంది?

ప్రతిరోజు ఉదయం లేచినప్పటి నుండి పడుకునే వరకు ఎన్నో కర్మలు చేస్తున్నారే? చేసే కర్మల గురించి ఎవరైనా ఆలోచిస్తున్నారా? ఏ పనైనా, ఆలోచించి చేస్తున్నారా? ఏ మాటైనా ఆలోచించి మాట్లాడుతున్నారా? ఎంతసేపూ తమకు నచ్చినట్టుగా ప్రవర్తిస్తున్నారు, నచ్చిన పనులు చేస్తున్నారు. ఎంతసేపూ తమ ఇష్టం చూసుకుంటున్నారు కానీ ఆ పని తనకు నష్టమా? కాదా? అని ఎవరూ ఆలోచించడం లేదు. ఎలా పడితే అలా మాట్లాడేస్తున్నారు. మాటలు కూడా కర్మలే అన్న విషయం తెలియటం లేదు. నోరు వుంది కదా అని ఇష్టం వచ్చినట్లు అలా మాట్లాడేస్తున్నారు.

తాను చేసిన పనుల ఫలితాలే తాను అనుభవించవలసి వస్తుందన్న "కర్మ సిద్ధాంతం" గురించి ఏ మాత్రం ఆలోచన లేకుండా జీవిస్తున్నారు.

అసలు ఈ సృష్టిలో జీవిస్తున్నామన్న అవగాహన కూడా లేదు. సృష్టి సిద్ధాంతాల మీద కూడా అవగాహన లేదు. సృష్టిలోని "కర్మ సిద్ధాంతం" మీద అసలే అవగాహన లేదు. ప్రతి కర్మకు ఫలితం ఉంటుందన్న విషయం కూడా తెలియదు. అలా ఏ మాత్రం అవగాహన లేకుండా జీవిస్తున్నారు. అలా అవగాహన లేకుండా జీవిస్తూ, కర్మలు చేస్తూ, కష్టాలు వస్తే మటుకు బాధపడుతూ వుంటారు. అందుచేత "కర్మ సిద్ధాంతం" గురించి తెలుసుకుందాం.

"కర్మ సిద్ధాంతం" అంటే మనం చేసిన కర్మ ఫలితాలే మనం అనుభవించవలసి వుంటుంది. అది మంచి అయినా! చెడు అయినా సరే! జీవితంలో మంచి కర్మలు చేస్తే మంచి ఫలితాలు, చెడు కర్మలు చేస్తే చెడు ఫలితాలు, ఎలాంటి కర్మలు చేస్తే అలాంటి ఫలితాలు అనుభవించవలసి

వుంటుంది. ఒక రకంగా మన జీవితం మనం చేసిన కర్మలను బట్టే వుంటుంది. అంటే ప్రస్తుత మన జీవితం ఇలా వుందంటే గతంలో మనం చేసిన కర్మలే కారణం.

చాలామంది తమ జీవితం ఇలా వుండటానికి వేరెవరో కారణమని అనుకుంటారు. అలా కొంతమంది పిల్లలు... తమ జీవితం బాగోకపోతే దానికి తల్లిదండ్రులే కారణమనుకుంటారు. అలాగే కొంతమంది భార్యలు తమ జీవితం బాగోకపోవడానికి భర్తే కారణమనుకుంటారు. అదే భర్తలవుతే భార్యే కారణమనుకుంటారు. ఇంకా కొంతమంది వేరొకరు కారణమను కుంటారు. ఇలా ఒక్కొక్కరూ ఒక్కొక్క రకంగా వూహించుకుంటారు. కానీ ఎవరి జీవితానికి ఎవరూ కారణం కాదు, ఎవరి జీవితానికి వారే కారణం అన్నది తెలుసుకోవాలి.

అందుచేత మన జీవితం ఎవరి చేతుల్లోనూ లేదు. మన జీవితం మన చేతుల్లోనే వుందని తెలుసుకోవాలి. మన చేతుల్లో అంటే అరచేతుల్లో కాదు. ఈ చేతులు చేసే చేతల్లో అంటే కర్మల్లో వుంది. అందుచేత ఎవరి జీవితానికి వారే కారకులు. కారణం అలాంటి జీవితాన్ని తయారు చేసుకున్నది వారే అంటే గతంలో వారు చేసిన పనులే.

ఇప్పుడు కష్టాలు, నష్టాలు వస్తున్నాయి అంటే గతంలో తాను ఆలోచించకుండా చేసిన కర్మల వల్లనే అన్నది తెలుసుకోవాలి. ఇప్పుడు భోగాలు, సుఖాలు వున్నాయి అంటే గతంలో తాను ఆలోచించి చేసిన కర్మల వల్లనే అని కూడా తెలుసుకోవాలి.

ఇంకా చాలా మంది తమ జీవితం తాము చేసే భజనలు, పూజలను బట్టి వుంటుందనుకుంటారు. కొంతమంది తాము చేసే ప్రార్థనలను బట్టి వుంటుందనుకుంటారు. కొంతమంది తాము చేసే నమాజును బట్టి మరికొందరు తాము చేసే ఆరాధనలు బట్టి వుంటుందని నమ్ముతారు. అందుచేత ఎవరి నమ్మకాన్ని బట్టి వారు ఆరాధనలు చేస్తూ వుంటారు. కానీ ఎవరి జీవితమైనా వారు చేసే ఆరాధనలను బట్టి వుండదు, వారి యొక్క ఆచరణను బట్టి వుంటుంది. అంటే పనులను బట్టి మాత్రమే

వుంటుంది.

ఆరాధనలను బట్టే జీవితం ఉండేటట్టయితే అందరి జీవితాలు బాగానే వుండేవి. కారణం అందరూ ఏదో ఒక దైవాన్ని తాము నమ్మిన రీతిలో ఆరాధించేవారే. కానీ ఎవరి జీవితం బాగుంది? ప్రతి ఒక్కరికి ఏదో ఒక సమస్య వుంది; కష్టం వుంది. ఎప్పుడో ఒకప్పుడు రోగం వస్తుంది, బాధలు వుంటాయి, కష్టాలు వుంటాయి, అశాంతి వుంటుంది. ఒకవేళ కష్టాలు పోయినట్టు కనిపించినా మరల వస్తుంటాయి. చూస్తే ఎవరి జీవితం బాగోలేదనే చెప్పాలి. అందుచేత ఆరాధనలను బట్టి జీవితం వుండదని తెలుస్తుంది.

అంతేకాదు బాగా పూజలు చేసే వారిని, ప్రార్థనలు చేసేవారిని నీవు చిన్నప్పటి నుండి పూజలు చేస్తున్నావు కదా? ప్రార్థనలు చేస్తున్నావు కదా? మరి నీకెందుకు ఈ కష్టాలు వచ్చాయి? అంటే వెంటనే వారేమంటారంటే "ఆ! చేసిన కర్మలు ఎక్కడికి పోతాయి? చేసినవి అనుభవించాలి కదా?" అంటారు. అంటే చేసిన కర్మలని బట్టి జీవితం ఇలా వుందని అంగీకరిస్తున్నట్టే కదా? అందుచేత ఎవరి జీవితం ఇంకొకరి చేతుల్లో లేదు, తాము చేసే కర్మలలోనే వుందని తెలుసుకోవాలి.

చాలా మంది దేవుడు దయ తలచలేదు, అనుగ్రహించలేదు కాబట్టి నా జీవితం ఇలా వుంది అనుకుంటారు. కొంతమంది దేవుడు అనుగ్రహించాడు కాబట్టే నేను ఇలా వున్నాను. అంతా దేవుని దయ అంటారు. అంటే దేవుణ్ణి బట్టే జీవితముంది అనుకుంటారు. కానీ దేవుణ్ణి బట్టి, దేవుని అనుగ్రహాన్ని బట్టి వుంటే అందరి జీవితాలు బాగానే వుండేవి. కారణం ఆయన కొంతమందినే అనుగ్రహించడు, అనుగ్రహిస్తే అందరినీ అనుగ్రహిస్తాడు. ఆయనకు అందరూ సమానమే. అందుచేత ఎవరి జీవితమైనా తాము చేసే పనులను బట్టే వుంటుందని తెలుసుకోవాలి. సృష్టిలో "కర్మ సిద్ధాంతం" అనేది వుందని తెలుసుకోవాలి.

అందుకే వశిష్ఠ మహర్షి యోగ వాశిష్ఠంలో ఈ విధంగా చెప్పారు. "తాను చేసిన కర్మ కంటే వేరుగా దైవం కానీ, ప్రారబ్ధం కానీ ఏదీ లేదు"

అన్నారు.

పూర్వ కాలంలోని జానపద సినిమాలు చూసినట్లయితే మాంత్రికుడి ప్రాణం ఎక్కడో వున్న చిలుకలో వుంటుంది. అంటే ఆ చిలుక బాగుంటే మాంత్రికుడి జీవితం బాగుంటుంది. ఆ చిలుక బాగోపోతే మాంత్రికుని జీవితం ఇబ్బందుల్లో పడుతుంది. చిలుక చనిపోతే మాంత్రికుడు చనిపోతాడు. అలా మాంత్రికుని జీవిత రహస్యం చిలుకలో వున్నట్టు. మానవుని జీవిత రహస్యం వారు చేసే చేతల్లో అంటే కర్మల్లో వుంది.

కర్మలు బాగుంటే మానవుని జీవితం బాగుంటుంది. కర్మలు బాగోపోతే మానవుని జీవితం బాగోదు. అందుచేత ఎవరి జీవితమైనా వారు అనుకున్నట్టు వుండదు, వారు చేసే పనులను బట్టే వుంటుంది. అందుకే మానవుని జీవితంలో ఎప్పుడూ అనుకున్నట్టు జరుగదు కారణం జీవితం బాగుండాలని అనుకుంటారు. కానీ పనులు మాత్రం విరుద్ధంగా చేస్తారు. అందుచేత అనుకునేది ఒకటి, జరిగేది ఇంకొకటి.

అందుకే "తానొకటి తలిస్తే దైవమొకటి చేస్తాడు" అని అంటారు. మరి దైవం తాను తలచిందే ఎందుకు చెయ్యడు? అంటే భగవంతుని సృష్టిలో తలంచిందాన్ని బట్టి పొందే ఏర్పాటు లేదు. వారు చేసిందాన్ని బట్టి పొందే ఏర్పాటు మాత్రమే వుంది. దానినే 'కర్మ సిద్ధాంతం' అంటారు. ఇది తెలియక "తానొకటి తలిస్తే దైవమొకటి చేస్తాడు" అంటారు. అందుచేత "తాను ఏది చేస్తే దైవం అదే ఇస్తాడు" అని తెలుసుకోవాలి. "ఏ విత్తనం నాటితే, ఆ పంటే కోసుకుంటున్నాం కదా?".

అందుకే శాస్త్రాలలో "చేసుకున్న వాడికి చేసుకున్నంత మహాదేవ!" అని వుంది. అంతేకాని "కోరుకున్నవాడికి కోరుకున్నంత మహాదేవ!" అని ఎక్కడా లేదు. ఇది అర్థం కాక చాలా మంది చేసుకోవడం మానేసి కోరుకుంటున్నారు, సంకల్పాలు పెట్టుకుంటున్నారు. కారణం "చెయ్యడం కష్టం – కోరుకోవడం తేలిక" మానవుడు ఎంతసేపూ తేలికైన మార్గాలే వెతుకుతూ వుంటాడు. కష్టపడకుండా అన్నీ రావాలంటాడు. కానీ సృష్టిలో కష్టపడకుండా వచ్చే ఏర్పాట్లు ఏమీ లేవు. ఏదైనా కష్టపడితేనే వస్తుంది,

లభిస్తుంది.

కష్టపడి ఎలాంటి పని చేస్తే అలాంటి ఫలితమే లభిస్తుంది. కష్టపడకపోతే ఏదీ రాదు. అందుకే "కష్టే ఫలి" అన్నారు. "కృషితో నాస్తి దుర్భిక్షం" అన్నారు. అంటే కృషి వల్లే దుఃఖం పోతుంది. కష్టాలు పోతాయి, దుర్భర పరిస్థితులు పోతాయి. అదే ఈ సృష్టిలో వున్న ఏర్పాటు. దానినే పెద్దలు శాస్త్రాలలో చెప్పడం జరిగింది.

అందుచేత కర్మ సిద్ధాంతం వుందని తెలుసుకోండి. అంటే "పని చేస్తేనే ఫలితం" ఏ పని చేస్తే అలాంటి ఫలితం. ఏ పని చెయ్యకపోతే ఏ ఫలితం వుండదు. అంటే ఏ కర్మ చెయ్యకపోతే ఏ ఫలితం రాదు.

అందుచేత మన జీవితం మన చేతుల్లోనే అంటే కర్మల్లోనే వుంది అని తెలుసుకోవాలి. గతంలో చేసిన కర్మలను బట్టే ప్రస్తుత మన జీవితం నడుస్తుంది. అంతే తప్ప ప్రస్తుత జీవితానికి, జీవితంలో కష్టాలకు వేరే ఏదీ కారణం కాదు. సృష్టిలో వున్న కర్మ సిద్ధాంతాన్ని బట్టే ఎవరి జీవితమైనా నడుస్తుంది అని తెలుసుకోవాలి.

ఇది తెలియక చాలా మంది జీవితం బాగోకపోతే జాతకంలో తేడా వుందనుకుని జాతకాలు చూపించుకుంటారు. వాస్తులో లోపం అనుకుని వాస్తు సరి చేసుకోవటానికి ప్రయత్నిస్తారు. కుజ, శని గ్రహ దోషాలు అంటూ పూజలు చేస్తారు. ముహూర్తాలు పెట్టించుకుంటారు. శకునాలు చూస్తారు. వీటివల్లే జీవితముందనుకుంటారు.

ఆలోచించండి! మంచి ముహూర్తాలకే వివాహాలు జరుగుతున్నాయి కదా? ఎన్ని వివాహాలు విజయవంతమయ్యాయి? ఎన్ని కాపురాలు, సంతోషంగా, సజావుగా సాగుతున్నాయి? ఎన్ని సంసారాలు సుఖ సంతోషాలతో వున్నాయి? ఎంతమంది భార్యాభర్తలు అన్యోన్యంగా ఆనందంగా అర్థం చేసుకుని జీవిస్తున్నారు? ఆలోచించండి చేసుకొచ్చిన కర్మలు ఒక రకంగా వుంటే ఈ ముహూర్తాలు ఏం చేస్తాయి? చెప్పండి.

అలాగే ఈ కర్మ సిద్ధాంతం అర్థం కాక, కర్మ సిద్ధాంతం తెలియక, చేసిన కర్మలు మరచిపోయి జీవితం బాగోలేదని రుద్రాక్షలు ధరిస్తే మార్పు

వస్తుందా? ఉంగరాలు, తాయెత్తులు, రక్షాకవచాలు ధరిస్తే జీవితం మారిపోతుందా? కష్టాలు పోతాయా? ధనలక్ష్మి, కుబేర యంత్రాలు ధరిస్తే ధనవంతులు, కుబేరులు అయిపోతారా? పేర్లు మార్చుకుంటే! పేర్లలో అక్షరాలు మార్చుకుంటే జీవితం మారిపోతుందా?

ఇన్ని మార్చుకుంటున్నారు కానీ ప్రవర్తన మార్చుకోరే? పనులు మార్చుకోరే? తాను చేసే పనులు సరిగ్గా వుండాలని ఆలోచించరే? సృష్టిలోని కర్మ సిద్ధాంతాన్ని అర్థం చేసుకోరే? సృష్టి నియమాలు, ధర్మాలు పాటించాలని తెలుసుకోరే? నీతిగా ప్రవర్తించాలి, ధర్మంగా జీవించాలని తెలుసుకోరే? సత్యాన్ని తెలుసుకోరే? ఇవన్నీ ఆలోచించడం మానేసి ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రయోజనం ఏమిటి? ముందు ప్రవర్తన మారాలి, పనులు మారాలి. తాను చేసే పనులు సృష్టికి అనుగుణంగా వుండాలి. అంటే "సత్యాన్ని పలకాలి – ధర్మాన్ని ఆచరించాలి".

ఇదే వేదాలలోని సందేశం.

**"సత్యం వద – ధర్మం చర"**

ఈ వాక్యాన్ని ఎంతమంది అర్థం చేసుకుంటున్నారు. 'సత్యం' గురించి ఎంతమందికి తెలుసు. సత్యమంటే ఏమిటి? దేనిని సత్యమంటారు? సత్యాన్నే ఎందుకు పలకాలి? అసలు సత్యం యొక్క గొప్పతనమేమిటి? సత్యం తెలియకపోతే వచ్చే నష్టమేమిటి? ఇది తెలుసుకోవటానికి ఎవరు ప్రయత్నం చేస్తున్నారు? అసలు తాను సత్యంలో జీవిస్తున్నాడా? అసత్యంలో జీవిస్తున్నాడా? తాను సత్యాన్ని ఆశ్రయించాడా? అసత్యాన్ని ఆశ్రయించాడా? తెలుసుకోవాలి కదా?

అందుకే "సత్యమేవ జయతే" అని చెప్పబడింది. అంటే సత్యమే జయిస్తుంది అని అర్థం. అంటే జీవితంలో జయం కలగాలంటే సత్యాన్ని ఆశ్రయించవలసిందే. సత్యంలో జీవించవలసిందే. సత్యయుతమైన పనులు, కర్మలు చెయ్యవలసిందే. అపుడే జయం. ఇంక వేటి వల్ల జయం కలుగదు. అందుచేత ముందుగా సత్యం గురించి తెలుసుకోండి. మీ కర్మలు సత్యయుతంగా వుండేటట్లు చూసుకోండి.

అలాగే ధర్మం గురించి ఎంతమందికి తెలుసు? ధర్మాన్ని ఎంతమంది ఆచరిస్తున్నారు? అసలు ధర్మమంటే ఏమిటి? దేనిని ధర్మమంటారు? ధర్మాన్ని ఎందుకు ఆచరించాలి? ధర్మాన్ని ఆచరించాలంటే ఏం చెయ్యాలి? అసలు ధర్మం యొక్క గొప్పతనమేమిటి? ధర్మాన్ని ఆచరించకపోతే ఏమవుతుంది?

"ధర్మోరక్షతి రక్షితః" అన్నారు కదా? రక్షింపబడిన ధర్మమే నిన్ను రక్షిస్తుంది. అంటే ధర్మాన్ని రక్షిస్తే నీవు రక్షింపబడతావు అని స్పష్టంగా శాస్త్రాలలో చెప్పబడింది కదా?

ఎంతసేపూ రక్షించు, రక్షించు అని ప్రార్థిస్తున్నారు కానీ ధర్మాన్ని రక్షించటానికి ఎందుకు ప్రయత్నించరు? కాపాడు కాపాడు అని ఆర్తనాదాలు చేస్తున్నారు కానీ ధర్మాన్ని కాపాడాలని ఎందుకు తెలుసుకోరు? ఎందుకు ప్రయత్నించరు?

ఏమీ తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లు జీవిస్తే, ప్రవర్తిస్తే, పనులు చేస్తే, కర్మలు చేస్తే కష్టాలు రావా? తప్పకుండా వస్తాయి.

అందుచేత "కర్మ సిద్ధాంతాన్ని" తెలుసుకోవాలి. ధర్మయుక్తమైన పనులు చెయ్యాలి.

ఆ ఋషులు, మహర్షులు, బ్రహ్మర్షులు ఊరికే బోధించారా? అవన్నీ వదిలేసి ఏవేవో చేస్తారేమిటి? వారంతా బోధించిన "ధర్మ మార్గాన్ని" వదిలేసి సంకల్పాలు పెట్టుకుంటే! కోరుకుంటే! కష్టాలు పోతాయా? ఎలా పోతాయి? మహర్షులు బోధించిన ధర్మమార్గాన్ని అనుసరిస్తే అసలు కష్టాలే రావు కదా? వారు చెప్పినట్టుగా జీవిస్తే, కర్మలు చేస్తే కష్టాలు ఎందుకు వస్తాయి? అందుచేత కనీసం ఇప్పటి నుంచైనా 'కర్మ సిద్ధాంతం' గురించి తెలుసుకోండి. సరైన కర్మలు చెయ్యండి. జీవితాన్ని సరి చేసుకోండి.

అందుచేత 'కర్మ సిద్ధాంతం' గురించి మనం దేవుళ్ళు అనుకునేవారు, దైవ దూతలు అనుకునే వారు, మహర్షులు, మహాత్ములు, మహానుభావులు ఏమి చెప్పారో తెలుసుకుందాం.



# కర్మ సిద్ధాంతం గురించి

## శ్రీ కృష్ణుడు

"ఎవరు ఏ కర్మ చేసుకుంటే వారు ఆ కర్మ ఫలాన్నే అనుభవిస్తారు".



## గౌతమబుద్ధుడు


"పాపం చేసేటపుడు ఎవరికైనా సుఖ భ్రాంతి వుంటుంది, కాని ఆ పాప ఫలితం అనుభవించేటపుడు మాత్రం జీవితం కడు దుర్భరంగా వుంటుంది".



## జీసస్ క్రైస్ట్

"ఏది విత్తుతావో ఆ పంటే కోసుకుంటావు".

(అంటే ఎలాంటి కర్మలు చేస్తావో అలాంటి ఫలితం అనుభవిస్తావు అని చెప్పడం జరిగింది.)




## మహమ్మద్ ప్రవక్త

"రేపటి కోసం (వచ్చే జన్మ) నేడు పంట పండించే పొలమే ఈ లోకం" అన్నారు.



## బ్రహ్మర్షి వశిష్ఠులు

"ఎవడెలా చేసుకుంటాడో! అతడు దాని ఫలితాన్ని అలాగే అనుభవిస్తాడు". అందుచేత చేసుకున్న కర్మకంటే వేరుగా దైవం కాని, ప్రారబ్దం కానీ ఏదీలేదు.



## శ్రీ రామకృష్ణ పరమహంస

"మనం ఏ కర్మ చేస్తే ఆ ఫలితం అనుభవించి తీరాలి'' అని అంటూ... కారం తింటే నోరు మండుతుంది. పంచదార తింటే నోరు మధురంగా వుంటుంది కదా? అని చెప్పారు.



## గురునానక్

"ఎంత చేశానో అంతే అనుభవించాను. మరొకర్ని ఏమో అనుకుని ప్రయోజనం లేదు"



## రాధా స్వామి

"ఏ ఏ కర్మలు చేస్తావో ఆయా అనుభవాలు పొందవలసి వుంటుంది".



## కబీర్

"ఎవరు చేసిన కర్మలు వారే అనుభవిస్తారు". అని అంటూ "ఏ చేయి కర్మలనాచరిస్తుందో, ఆ చేయే ఫలితాలననుభవిస్తుంది." అని చెప్పారు.

## గురు సాహెబ్



1)"కర్మ సిద్ధాంతం ప్రకృతి యొక్క మారని శాశ్వత చట్టం. ఇది వ్యక్తి గత మరియు ఆధ్యాత్మిక జీవితానికి పునాది".


2) "రాత్రింబవళ్ళు మానవుడు చేసేదంతా వాని నోసట వ్రాయబడుతుంది".

## కన్ఫ్యూషియిజం

"పరులు నీకు ఏం చేయకూడదనుకుంటావో! నువ్వు వారి విషయంలో అలాగే వుండాలి".

## మహాజ్ఞాని సహజోబాయి

"పశు, పక్షి, నర, సుర, అసుర, జలచర, కీటకాదులన్నీ చేసుకున్న కర్మలు అనుభవిస్తున్నవే".




## భాయి గురుదాస్‌జీ

"మంచి చేస్తే చెడు లభించదు, చెడు చేస్తే మంచి లభించదు".




## గురు రవిదాస్

"తాను చేసిన కర్మలకు ఎపుడో ఒకప్పుడు ఫలితాలు అనుభవించక తప్పదనే విషయాన్ని మానవుడు ఎప్పుడూ మరువకూడదు"



## తులసీదాసు

"ఈ ప్రపంచంలో కర్మ సిద్ధాంతానికే రాచరికం" అన్నారు.



## బ్రహ్మర్షి పత్రీజీ

ప్రస్తుతం బ్రహ్మర్షి పత్రీజీ కూడా ఈ "కర్మ సిద్ధాంతం" గురించి చాలా గట్టిగా చెబుతున్నారు. ఆయన ఏమి చెప్పారంటే "మనం చేసే ఏ రకమైన కర్మకైనా సమయ సందర్భానుసారంగా ఆ కర్మకు తగిన ప్రతిఫలానికి కచ్చితంగా దారితీస్తుంది".

అలాగే "విత్తుబట్టి చెట్టు వుంటుంది ... కర్మ బట్టి ఫలితముంటుంది..." అని కర్మసిద్ధాంతం గురించి సందేశం ఇచ్చారు.

అలాగే "పెద్ద పెద్ద పాపాలు చేస్తే, పెద్ద పెద్ద రోగాలు, చిన్న చిన్న పాపాలు చేస్తే, చిన్న చిన్న రోగాలు, రక రకాల పాపాలు చేస్తే, రక రకాల రోగాలు" అని కూడా చెప్పడం జరిగింది.

ఆయన ఏమన్నారంటే "జంతువధ అన్నదే మానవాళి యొక్క మహాపాపకర్మ".

అంతేకాదు ఆయన "మాంసాహారం పాపాహారం, అదే అన్ని అనర్ధాలకు మూలం అందుచేత మాంసాహారం మానండి, శాకాహారం తీసుకోండి" అని చాలా గట్టిగా చెపుతున్నారు.

అలా పత్రీజీ అనేక సందర్భాలలో 'కర్మ సిద్ధాంతం' గురించి 'కర్మల' గురించి ప్రస్తావించారు. అందుచేత కర్మ సిద్ధాంతం లేదని అనుకోకండి.

ఈ కర్మ సిద్ధాంతం గురించి పై వారంతా ఎన్నో రకాలుగా తమదైన శైలిలో వివరించారు. ఎవరు ఏమి చెప్పినా సృష్టిలోని ఒకే 'కర్మ సిద్ధాంతం' గురించి అనేక కోణాలలో వివరించారు. మన కర్మలు ఎలా వుండాలి? ఎలాంటి కర్మలు చేస్తే ఎలాంటి ఫలితాలు పొందుతాం? ఇలాంటి జీవితం ఎందుకు వచ్చింది? అన్న విషయాలు మనకు వివరంగా తెలియజేయడం జరిగింది.

వారందరూ చెప్పిన విషయాలు కనుక మనం అర్థం చేసుకుంటే! మనం ఎలా జీవించాలి? ఎలా ప్రవర్తించాలి? ఎలాంటి పనులు చెయ్యాలి? అన్నది బాగా అర్థమవుతుంది. సరిగ్గా జీవించే అవకాశం వుంటుంది. అందుచేత వారందరూ చెప్పిన సందేశాలు ఉదాహరణలతో వివరంగా తెలుసుకుందాం.

# శ్రీ కృష్ణుడు



**"ఎవరు ఏ కర్మ చేసుకుంటే వారు ఆ కర్మ ఫలాన్నే అనుభవిస్తారు".**

శ్రీ కృష్ణ భగవానుల వారి సందేశాన్ని బట్టి జీవితంలో మనం మంచి చేసుకుంటే మంచి ఫలితం పొందుతామని, చెడు చేసుకుంటే చెడు ఫలితం అనుభవిస్తామని తెలుసుకోవాలి.

అంటే అందరికీ ఆనందం కలిగిస్తే జీవితంలో ఆనందం పొందుతాం. హింసిస్తే జీవితంలో హింస అనుభవిస్తాం. అలాగే అవమానిస్తే అవమానించబడతాం. మోసగిస్తే-మోసగించబడతాం, నష్టపరిస్తే- నష్టపోతాం, కష్టపెడితే-కష్టాల పాలవుతాం. ఏది ఇస్తే అదే పొందుతాం. ఏది చేస్తే అదే అనుభవిస్తాం.

శ్రీ కృష్ణుల వారు చెప్పిన సందేశాన్ని అర్థం చేసుకుంటే మనం ఎలా కావాలంటే అలా జీవించవచ్చు, ఏది కావాలంటే అది పొందవచ్చు. ఒక రకంగా మన జీవితాన్ని మనం అనుకున్నట్టు తయారు చేసుకోవచ్చు. జీవించవచ్చు. కారణం మన జీవితం మన చేతుల్లోనే వుంది. అంటే మన చేతల్లోనే వుంది. మన చేతల్ని బట్టే మన జీవితం అంటే మన కర్మల్ని బట్టే మన జీవితం వుంది కాబట్టి.

అందుచేత మనం **"ఏది కావాలనుకుంటే అది ఇవ్వాలి. అలాగే ఏది వద్దనుకుంటే అది ఇవ్వకూడదు".**

అందుచేత ధనం కావాలనుకుంటే ధనాన్ని ఇవ్వాలి. అంటే దానం చెయ్యాలి. అప్పుడు ధనాన్ని పొందే అర్హత సంపాదిస్తాం, అలాగే జ్ఞానాన్ని కావాలనుకుంటే జ్ఞానాన్ని ఇవ్వాలి. అంటే అందరినీ జ్ఞానవంతుల్ని చేయడానికి ప్రయత్నించాలి.

అలాగే హింస అంటే రోగాలు వద్దనుకుంటే ఎవరినీ హింసించ కూడదు, జంతువుల్ని కూడా హింసించకూడదు. మాంసం తిని వాటి హింసకు కారణం కాకూడదు.

అలాగే ఆనందంగా జీవించాలనుకుంటే అందరినీ ఆనందింప చేయటానికి ప్రయత్నించాలి. ఎవరిని నష్టపెట్టకూడదు, కష్టపెట్టకూడదు. బాధించకూడదు. ఇంటిలో వున్న వారినే కాదు, బయట వారిని కూడా. అలా ఎవరైతే జీవిస్తారో వారు అనుకున్నట్టుగా వారి జీవితం వుంటుంది. అంతేకాదు సేవలు చెయ్యాలి. సేవా కార్యక్రమాలలో పాల్గొనాలి. కారణం సేవ అన్నది ఇతరులను ఆనందింప చేసే పని కాబట్టి. అందుచేత సేవలు బాగా చేసేవారు జీవితంలో ఆనందంగా జీవించగలుగుతారు.

మనందరి జీవితాలు బాగుండాలనే శ్రీ కృష్ణుల వారు పై సందేశాన్ని ఇవ్వడం జరిగింది.



# గౌతమ బుద్ధుడు

**"పాపం చేసేటపుడు ఎవరికైనా సుఖభ్రాంతి వుంటుంది. కానీ ఆ పాప ఫలితం అనుభవించేటపుడు మాత్రం జీవితం కడు దుర్భరంగా వుంటుంది".**


బుద్ధభగవానుడు కూడా పై సందేశం ద్వారా కర్మ సిద్ధాంతం గురించి చెప్పడం జరిగింది. ఆయన సందేశం ద్వారా మనం తెలుసుకోవలిసిందే మిటంటే పాపం చేసిన వెంటనే ఫలితం రాదు, అంటే కష్టం రాదు. కానీ ఆ పాపం పండిన వెంటనే ఫలితం వస్తుంది, అంటే కష్టం వస్తుంది.

సహజంగా పాపాలు ఎందుకు చేస్తారంటే చేసిన వెంటనే ఏమీ జరగదు, ఏమీ అవ్వదు. అందుచేత ఏమనుకుంటారంటే ఏం జరిగింది? ఏం అయ్యింది? ఏమీ అవ్వలేదు కదా? అనుకుంటారు. తాము చేసింది కరెక్టే అనుకుంటారు. అనుకోవడమే కాదు. అదే పాపాన్ని మరల, మరల చేస్తూంటారు, పెద్దలు చెప్పినా వినరు.

కానీ అదే తప్పుకి, అంటే పాపానికి వెంటనే ఫలితం కనబడితే ఆ తప్పు, ఆ పాపం మరల చెయ్యరు. కారణం అలాంటి పాపం చేస్తే ఫలితం అంటే శిక్ష ఎంత తీవ్రంగా వుంటుందో అన్నది తెలిస్తే మరల ఆ తప్పు చేస్తారా? అంటే ఖచ్చితంగా చెయ్యరు. ఉదాహరణకు నిప్పు చూడని చిన్నపిల్లవాడిని నిప్పు ముట్టుకోవద్దు అంటే వినడు. ముట్టుకోడానికే ప్రయత్నిస్తాడు. కానీ ఒక్కసారి వాడిని నిప్పు ముట్టుకోనివ్వండి. వెంటనే చెయ్యి కాలుతుంది. విపరీతంగా బాధ కలుగుతుంది. ఇప్పుడు చూడండి ఆ నిప్పు ముట్టుకోమన్నా ముట్టుకోడు. కారణం ఫలితం వెంటనే కనపడింది కాబట్టి.

అలాగే A అనే వ్యక్తి ఒకరి కాలు నరికినపుడు వెంటనే వాడికి శిక్ష పడి వాడి కాలు తీసినా లేక ఏ యాక్సిడెంటో జరిగి A కాలు పోయినా వెంటనే ఫలితం కనబడితే ఆ తప్పు, ఆ పాపం మరల చెయ్యమన్నా చెయ్యడు.

కానీ ఈ సృష్టిలోని సిద్ధాంతం ఏమిటంటే పాపం చేసిన వెంటనే ఫలితం రాదు. ఆ పాపం పండినపుడు మాత్రమే కష్టం వస్తుంది. అందుచేతే అందరూ పాపాలు చేస్తున్నారు.



ఈ విషయాన్నే పెద్దలు మన పురాణాల ద్వారా చెప్పడం జరిగింది. శిశుపాలుని వధ చూడండి. శిశుపాలుడు 10 తప్పులు చేసినా ఏమీ జరగలేదు. 50 తప్పులు చేసినా ఏమీ జరుగలేదు. పైగా విర్రవీగేవాడు శ్రీ కృష్ణ భగవానుడిని దూషించాడు. అలా 99 తప్పులు

చేసినా ఏమీ జరగలేదు. కారణం అతని పాపం పండలేదు కాబట్టి. కానీ వందో తప్పు చెయ్యగానే అతని తల ఎగిరి పోయింది. కారణం 100వ తప్పుతో అతని పాపం పండింది.

దీనిని బట్టి మనం పాపం చేసినా ఏమీ జరగలేదంటే అర్థం ఇంకా మన పాపం పండలేదనే లెఖ్ఖ. అందుచేత పాపాలు చెయ్యటానికి ఒక కారణం ఫలితం వెంటనే కనబడకపోవడం. రెండవది సుఖభ్రాంతి. సుఖభ్రాంతి తోటే అంటే సుఖపడాలనే ఉద్దేశ్యంతోటే ఎవరైనా పాపాలు చేస్తారు.

చూడండి ఆహారం తీసుకోవడం మనం అనుభవించే సుఖాలలో ఒకటి. అందుకే మానవులు తినడానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారు. రకరకాల ఆహారాలు, రకరకాల రుచులతో తయారు చేసుకుని తింటూ వుంటారు. అలా రోజులో మూడు సార్లు ఇంకా ఎక్కువ సార్లు తినేవారు కూడా వున్నారు. కారణం తినడం అంత సుఖం కనుక. అందుకే రుచికరమైన ఆహారాలు చూస్తే ఎవరైనా లొట్టలు వేస్తారు. అంతేకాదు ఎంత సంపాదించినా ఏం ప్రయోజనం? తినకపోతే? అని కూడా అంటారు. సంపాదించి తినడానికి కక్కుర్తి పడతావేంటిరా? ఉన్నప్పుడు తినకపోతే ఎప్పుడు తింటావు? ఇలా రకరకాలుగా అంటూంటారు. కారణం తినడంలో అంత సుఖం వుంది కనుక.

ఈ సుఖ భ్రాంతి తోటే చాలా మంది మాంసాహారం తింటూ వుంటారు. అలా మాంసం తింటూ పరోక్షంగా జీవహింసకు కారకులవుతు న్నారు. అంటే జంతువులు, పక్షుల, జల చరాల హింసకు కారకులవు తున్నారు. హింస పాపం కనుక, పాపం చేసిన వారవుతున్నారు. మరి ఈ పాపం ఎందుకు చేస్తున్నారు? సుఖమనే, సుఖపడాలనే, సుఖభ్రాంతితోటే.

కానీ అలా తినగా, తినగా కొన్ని నెలలకో, సంవత్సరాలకో ఆ పాపం పండి దాని ఫలితం భవిష్యత్తులో రోగాల రూపంలో అనుభవించే టపుడు మాత్రం చూడండి ఎంత నరకం అనుభవిస్తారో! ఎంత బాధ పడతారో! ఆ బాధ భరించలేక ఎంత విలవిల లాడతారో! కొంతమంది

ఇలా బతికే కంటే చచ్చిపోవడం మేలు అనుకుంటారు. బాధ భరించలేక ఆత్మహత్యలు చేసుకునేవారు కూడా వున్నారు. అయ్యో! నాకే ఇంత బాధ రావాలా? ఈ బాధ ఎలా పోతుంది? ఈ బాధను పోగొట్టేవారెవరు? అంటూ దేవుళ్ళ చుట్టూ, గురువుల చుట్టూ, స్వామీజీల చుట్టూ, డాక్టర్ల చుట్టూ, ప్రార్థనా మందిరాల చుట్టూ తిరుగుతూంటారు. ఆ బాధ తొలగిస్తామని ఎవరైనా చెబితే వారు ఏమి చెయ్యమంటే అదే చేసేస్తారు. ఆ బాధ తొలగించుకోవటానికి ఎంత ఖర్చు పెట్టడానికైనా వెనుకాడరు. ఇదంతా దేనికంటే బాధ భరించలేక.

ఒక ప్రక్క రోగ బాధ, మరొక ప్రక్క ధనం విపరీతంగా ఖర్చయి ఆర్థిక బాధ. అలా సంపాదించినదంతా ఖర్చు పెడతారు. చాలకపోతే అప్పు చేస్తారు. లేకపోతే ఆస్తులు అమ్ముతారు. తనతో పాటు సంసారంలో అందరికీ ఇబ్బంది కలిగిస్తారు ఎవరికీ శాంతి వుండదు. అలా రోగాల వల్ల జీవితం కడు దుర్భరమవుతుంది. ఈ రోగాలన్నీ చేసిన పాప ఫలితమే.

అందుకే బుద్ధభగవానుడు స్పష్టంగా "పాపం చేసేటపుడు సుఖభ్రాంతి వుంటుంది కానీ ఆ పాప ఫలితం అనుభవించేటపుడు జీవితం కడు దుర్భరంగా వుంటుంది" అన్నారు.

ఇది అర్థం చేసుకుంటే సుఖపడటం కోసం పాపాలు చెయ్యరు. చేతులారా జీవితాన్ని నరక ప్రాయం చేసుకోరు.

అలాగే ధన సంపాదన కూడా సుఖం కోసమే కదా? ధనం బాగా వుంటే పెద్ద ఇంటిని నిర్మించుకోవచ్చు. అందంగా అలంకరించుకోవచ్చు. ఎ.సి.లు, టి.వి.లు, ఫ్రిజ్‌లు లాంటివి అమర్చుకోవచ్చు. కార్లు, బైక్‌లు కొనుక్కోవచ్చు. విలాసవంతంగా జీవించవచ్చు. వినోదయాత్రలు చేయవచ్చు. ఇటువంటి సుఖాలు కావాలంటే ధనం కావాలి. అందుకే ఆ ధనం సంపాదించటం కోసం అంతా ప్రయత్నిస్తున్నారు. సుఖం కోసం సంపాదించడం తప్పుకాదు, కానీ ఆ డబ్బు సంపాదించడానికి ఎన్నో పాపాలు చేస్తున్నారు. అంటే అబద్ధాలు చెబుతున్నారు, మోసాలు చేస్తున్నారు, దౌర్జన్యాలు చేస్తున్నారు, అక్రమాలకు పాల్పడుతున్నారు. అలా ఎన్నో పాపాలు

చేస్తున్నారు.

కానీ ఆ పాపాలు చేసినపుడు డబ్బు సంపాదించినపుడు ఆ డబ్బుతో సుఖం అనుభవిస్తున్నప్పుడు బాగానే వుంటుంది. కానీ ఆ పాపం పండినపుడు, నష్టాలు వచ్చినా, విపరీతమైన ఆర్థిక ఇబ్బందులు వచ్చినా, ఆర్థిక సమస్యలు వచ్చినా ఆ కష్టాలు భరించలేరు. ఆ ఒత్తిడులు తట్టుకోలేరు. ఆ బాధ వర్ణనాతీతం. ఆ జీవితం కడు దుర్భరంగా వుంటుంది. అలాంటి పరిస్థితులలో ఆత్మహత్యలు చేసుకునే వారు కూడా వున్నారు. ఇదంతా సుఖభ్రాంతితో చేసే పాపాల వల్లే!

ధర్మంగా సంపాదించు, నీతిగా ప్రవర్తించు అని చెబితే ఎవరైనా వింటారా? సంపాదించేటపుడు ధర్మం గురించి ఆలోచించరు. ఎంత సంపాదించానా? అని చూస్తున్నారు కానీ ఎలా సంపాదించాను? అన్నది చూడట్లేదు. అందుకే బుద్ధ భగవానుడు ఈ సందేశం ఇవ్వడం జరిగింది.

అందుచేత ఏదైనా పాపం చేసేటపుడు, దాని ఫలితం ఎలా వుండబోతుంది? అన్నది ముందే వూహించ గలిగినపుడు ఆ పాపం చెయ్యనే చెయ్యరు.

ఉదాహరణకు ఎవరినైనా హత్య చెయ్యాలనుకున్నప్పుడు హత్య చేసిన తరువాత జరగబోయేది వూహించగలిగితే అంటే పట్టుబడటం, జైలు శిక్ష అనుభవించడం, జైలు జీవితంలోని కష్టాలు, ఆ తిండి, నాలుగు గోడల మధ్య జీవితాంతం మగ్గిపోవడం, జైలులో ఇతరులతో వచ్చే సమస్యలు, సరదాలన్నీ వదలుకోవడం, సంసారానికి దూరం కావడం, ఒంటరివాడవడం లాంటివన్నీ గుర్తుకు వస్తే హత్య చేస్తాడా? పాపం చేస్తాడా? చచ్చినా చెయ్యడు? వాడి పాపానికి వాడినే వదిలేస్తాడు.

ఒక అమ్మాయి తన కోరిక కాదందని ఆమె మీద యాసిడ్ పోయాలనుకున్నాడు. కానీ తరువాత పరిణామం ఆలోచించాడు. నలుగురు పట్టుకుంటారు, చితకబాదుతారు, ఒళ్ళు హూనం చేస్తారు, అందరూ తిడతారు, నేరగాడిలా చూస్తారు. ఎంతో అవమానం భరించవలసి వస్తుంది. అందరిలో తప్పు చేసిన వాడిగా ముద్రపడిపోతుంది. పోలీసులు

పట్టుకుంటారు. కఠిన శిక్ష పడుతుంది. ఏ కోరిక కోసం ఆ పని చేసాడో ఆ కోరికకు పూర్తిగా దూరం కావలసి వస్తుంది. ఇవన్నీ గుర్తుకు చేసుకుంటే ఆ తప్పు, ఆ పాపం చెయ్యడు.

అందుకే బుద్ధ భగవానుడు ఆ సందేశం ఇవ్వడం జరిగింది.

అలాగే ఒక మంత్రి వున్నాడు, కోట్లు సంపాదిద్దామనుకున్నాడు. సంపాదన బాగానే వుంటుంది. కానీ అక్రమాలు చెయ్యాలి. అంటే పాపం చెయ్యాలి. కానీ ఆలోచించాడు. ఒక వేళ తన అక్రమం బయట పడితే పదవి పోతుంది, అందరిలో పరువు పోతుంది. శిక్ష పడవచ్చు. జైలు జీవితం అనుభవించవలసి రావచ్చు. ఇప్పుడున్న హోదా, భోగం, పేరు, ప్రఖ్యాతి అన్నీ సర్వనాశనమైపోతాయి. ఆ అవమానం భరించడం చాలా దుర్భరంగా వుంటుంది. పైకి అందరూ మామూలుగా ప్రవర్తించినా లోపల అనుకుంటూనే వుంటారు, తిట్టుకుంటారు, సమాజంలో చులకనైపోతాడు. ప్రజలు ఆదరించరు, ఎంతో అవమానం, భరించలేని జీవితం, ఇవన్నీ ముందుగా ఆలోచిస్తే ఆ తప్పు చెయ్యడు, ఆ పాపం చెయ్యడు.

కానీ ఇవన్నీ ఆలోచించకపోతే అవినీతికి పాల్పడతాడు. 'కర్మ కాలి' అంటే వాడి 'పాపం పండి' దొరికితే! చేసింది బయటపడితే! శిక్షపడితే! అవన్నీ అనుభవిస్తూ అనుకుంటాడు, అలాంటి పని చేసి వుండకపోతే బాగుండును, ఉన్నది చాలదా? చేతులారా చేసుకున్నానే? అని ఎంత బాధపడినా ప్రయోజనం ఉండదు, దుఃఖపడినా లాభం లేదు. కారణం ముందే ఇవన్నీ ఆలోచించుకోవాలి.

అందుకే బుద్ధ భగవానుడు పై సందేశం ఇవ్వడం జరిగింది. అందుచేత కర్మ సిద్ధాంతం మర్చిపోవద్దు. ఇలాంటి సన్నివేశాలు మనం సినిమాలలో ఎక్కువగా చూస్తూ వుంటాం.


ఆ పని చేసినపుడు జరగబోయేది వూహించుకున్నపుడు చేసే పని చెయ్యడం మానేస్తారు. ఇటువంటివి హాస్యం కోసం సినిమాలలో చూపిస్తూ వుంటారు.

ఒక విలన్ దగ్గర పని చేస్తున్నవాడు తప్పించుకోవాలని ప్రయత్ని

స్తుంటే ప్రక్కన వున్న సహచరుడు అక్కడ కాలు లేని వాడిని, కన్ను లేని వాడిని చూపించి తప్పించుకోవాలని ప్రయత్నిస్తే అలా కాలు తీసేస్తారు అని చెప్పగానే వాడు తనకాలు తీసేస్తే తన పరిస్థితి ఎలా వుంటుందో! వూహించుకుంటాడు వెంటనే ఆ ప్రయత్నం విరమించు కుంటాడు.

అలాగే ఇంకో సన్నివేశంలో నువ్వు ఆ తప్పు చేస్తే నీ గుండు గీసి గాడిద మీద వూరేగిస్తారు అనగానే అలా గాడిద మీద వూరేగడం వూహించుకున్నవాడు అమ్మో! అంటూ ఆ తప్పు చెయ్యడం మానేస్తాడు.

అలా సినిమాలలో ఎన్నో సన్నివేశాలు మనకు కనిపిస్తాయి. అందుచేత బుద్ధ భగవానుడు చెప్పినట్టు పాపం చెయ్యకముందే ఆ పాప ఫలితాన్ని వూహించుకోగలిగితే ఆ పాపాన్ని చెయ్యనే చెయ్యరు.



# జీసస్ క్రైస్ట్

**'ఏది విత్తుతావో ఆ పంటే కోసు కుంటావు'.**

అంటే ఎలాంటి కర్మలు చేస్తే అలాంటి ఫలితాలు పొందుతావు అని చెప్పడం జరిగింది.


ఈ భూమి మీద మనం ఏ విత్తనం నాటితే ఆ పండే పండుతుంది. అలా మామిడి విత్తనం నాటితే మామిడి పండే కాస్తుంది. వేప విత్తనం నాటితే వేప పండే కాస్తుంది. అలాగే వరి విత్తనం నాటితే వరి పంటే పండుతుంది. గడ్డి విత్తనం నాటితే గడ్డే పండుతుంది. ఇది ఈ సృష్టిలో వున్న ఏర్పాటు. అంతేకానీ వేప విత్తనం నాటితే మామిడి పండు కోసుకోలేము. గడ్డి విత్తనాలు నాటితే వరిపంట కోయలేము.

అలాగే ఈ సృష్టిలో ఏ కర్మ చేస్తే అలాంటి ఫలితమే అనుభవించాలి. జీవితంలో ఆనందం అనే విత్తనం నాటితే ఆనందమనే పంట అంటే ఆనందం అనుభవిస్తారు. హింస చేస్తే అంటే హింస అనే విత్తనం నాటితే హింస అనే పంటనే కోసుకుంటారు. అంటే రోగాలతో హింస అనుభవిస్తారు అని జీసస్ సందేశం ఇవ్వడం జరిగింది.

అందుచేత మనకు ఎలాంటి పంట కావాలంటే అలాంటి విత్తనం ఎలా నాటుకుంటామో! జీవితంలో ఎలాంటి ఫలితం కోరుకుంటే అలాంటి కర్మ చెయ్యాలి. అంతే కానీ ఒక రకం కర్మ చేసి ఇంకొక రకం ఫలితం కోరుకుంటే రాదు, ప్రార్థించినా ప్రయోజనం లేదు. అందుచేత కర్మలు చేసేటపుడే ఆలోచించి చెయ్యాలి. మన భవిష్యత్తు ఎలా వుండాలను కుంటామో అలాంటి కర్మలు చెయ్యాలి.

కానీ లోకంలో చేసేది ఒకటి, కోరుకునేది ఇంకొకటి. హింస చేస్తారు. ఆనందం కోరుకుంటారు. కోరుకుంటే మాత్రం ఆనందం ఎలా లభిస్తుంది? నాటింది హింసే కదా? అందుచేత విత్తనం నాటేటపుడే ఆలోచించి నాటుకోవాలి. అంటే కర్మలు చేసేటపుడే ఆలోచించి చెయ్యాలి. అదే జీసస్ సందేశం.

# మహమ్మద్ ప్రవక్త



**"రేపటి కోసం అంటే భవిష్యత్తు కోసం నేడు పంట పండించే పొలమే ఈ లోకం".**

మహ్మద్ ప్రవక్త ఈ లోకాన్ని పంట పండించే పొలంతో పోల్చారు. మనం పొలంలో పంట వేసుకుంటాం. దేనికి? అంటే భవిష్యత్ అవసరాలకు. ఎవరైనా భవిష్యత్ అవసరాలు దృష్టిలో వుంచుకునే ప్రస్తుతం పంట వేస్తారు. అలా పొలం మన భవిష్యత్ అవసరాలు తీరుస్తుంది. అంతేకాదు ఆ పొలంలో మనం ఎలాంటి పంట కావాలంటే అలాంటి విత్తనాలు వేసుకుంటాం. అలాంటి పంటే పండిస్తాం. అంతేకాదు పొలంలో ఎలాంటి విత్తనాన్నైనా వేసుకోవచ్చు. పొలం అలాంటి పంటనే ఇస్తుంది. పొలం వల్ల ఏ పంట కావాలంటే ఆ పంట పొందే అవకాశం వుంది.

అలాగే ఈ లోకంలో కూడా మనం ఏది కావాలంటే అది

పొందవచ్చు. ఆనందం కావాలంటే ఆనందం పొందవచ్చు. శాంతి కావాలంటే శాంతి పొందవచ్చు. ప్రేమ కావాలంటే ప్రేమ పొందవచ్చు. గౌరవం కావాలంటే గౌరవం పొందవచ్చు. ధనం కావాలంటే ధనం పొందవచ్చు. భోగాలు కావాలంటే భోగాలు పొందవచ్చు. అటువంటి అవకాశం ఈ లోకంలో వుంది. పొలం ద్వారా ఎలాంటి పంటనైనా ఎలా పొందవచ్చో ఈ లోకంలో ఎలాంటి జీవితం కావాలంటే అలాంటి జీవితం పొందవచ్చు. పొలంలో అయితే నాటుకోవాలి. కానీ ఈ లోకంలో అయితే చేసుకోవాలి.

ఈ లోకంలో ఏది చేసుకుంటే అదే పొందుతాం. మంచి చేస్తే మంచి, చెడు చేస్తే చెడు. ఆనందం ఇస్తే ఆనందం. శాంతినిస్తే శాంతి, పొందుతాం. అలాగే అందరినీ ప్రేమిస్తే ప్రేమించబడతాం. గౌరవంగా చూస్తే గౌరవింపబడతాం. అలాగే అవమానిస్తే అవమానించబడతాం. విమర్శిస్తే విమర్శించబడతాం. నష్ట పరిస్తే నష్టపోతాం. అదే ఈ లోకంలో వున్న ఏర్పాటు. అందుకే "చేసుకున్నవాడికి చేసుకున్నంత మహాదేవ" అన్నారు.

అందుచేత ఈ లోకంలో నాకు ఇది రాలేదు, అది పొందలేదు అనుకోకండి. ఈ లోకంలో ఏదైనా పొందవచ్చు. పొలం నుంచి ఏ పంట అయినా ఎలా పొందవచ్చో ఈ లోకం నుంచి మానవులు ఏదైనా పొందవచ్చు. మన భవిష్యత్తు కోసం పొలాన్ని ఎలా వినియోగించు కుంటామో? అలాగే రేపటి కోసం అంటే మన భవిష్యత్తు కోసం ఈ లోకాన్ని ఉపయోగించవచ్చు.

ఇదే మహ్మద్ ప్రవక్త సందేశం.

▲ ప్రతీకారం నీ శక్తిని, సమయాన్ని వృధా చేస్తాయి.
కానీ నీవు చేసే దాని కంటే మెరుగ్గా కర్మ చేస్తుంది. ▲

# వశిష్ఠ మహర్షి



**"ఎవడెలా చేసుకుంటాడో వాడు దాని ఫలాన్ని అలాగే అనుభవిస్తాడు". అందుచేత వాడు చేసుకున్న కర్మ కంటే వేరుగా దైవం కానీ, ప్రారబ్ధం కానీ ఏదీ లేదు.**

వశిష్ఠ మహర్షి కూడా కర్మ సిద్ధాంతం గురించి చెప్పడం జరిగింది. సహజంగా ఎవరైనా తన జీవితంలో ఏమి జరిగినా దానికి దేవుడే కారణమనుకుంటారు. అలా ఏదైనా మంచి జరిగినా, లాభం కలిగినా, కలిసి వచ్చినా వెంటనే దేవుడి దయ వల్ల అంటారు. ఎలా వున్నావు? అంటే దేవుడి దయ వల్ల ఇలా వున్నాను అంటారు. అలాగే కలిసి రాకపోయినా, లాభం కలగకపోయినా, మంచి జరగకపోయినా వెంటనే దేవుడి దయ కలగలేదు అంటారు. తన జీవితంలో ఏమి జరిగినా దానికి దేవుడే కారణమనుకుంటారు. అందుకే లోకంలో దేవుళ్ళను ఆరాధించడం, ప్రార్థించడం, నమాజు చెయ్యడం చేస్తున్నారు.


కానీ వశిష్ఠుల వారు నువ్వు చేసుకున్న కర్మల ఫలితమే నువ్వు అనుభవిస్తున్నావు. నీకు మంచి జరిగినా, లాభం కలిగినా, కలిసి వచ్చినా గతంలో నువ్వు చేసుకున్న మంచి కర్మ ఫలితమే తప్ప అక్కడ దైవం యొక్క ప్రమేయం ఏమీ లేదు. అందుచేత నీ కర్మే నీకు దైవం అని చెప్పడం జరిగింది.

అలాగే చాలా మంది తమ జీవితంలో కష్టాలు వస్తూంటే, పరిస్థితిలో మార్పు రాకపోతే నా 'ప్రారబ్ధం' ఇలా వుంది. ఏం చెయ్యమంటావు?

అంటారు. అంటే ప్రారబ్దం వల్లే తన జీవితం అలా వుందనుకుంటారు. కానీ వశిష్ఠుల వారు నువ్వు చేసిన కర్మలలో అనుభవించటానికి నువ్వు తెచ్చుకున్న కర్మలే నీకు ప్రారబ్దమవుతుంది. అందుకే నీ కర్మ కంటే వేరే ప్రారబ్దమంటూ ఏమీ లేదు అని చెప్పడం జరిగింది.

అందుచేత ఎవడెలా చేసుకుంటే వాడు దాని ఫలాన్ని అలాగే అనుభవిస్తాడు అని చెప్తూ కర్మ సిద్ధాంతం గురించి చెప్పడం జరిగింది.

# శ్రీరామకృష్ణ పరమహంస



**"మనం ఏ కర్మ చేస్తే ఆ ఫలితం అనుభవించి తీరాలి"** అని అంటూ **"కారం తింటే నోరు మండుతుంది, పంచదార తింటే నోరు మధురంగా వుంటుంది కదా?"** అని చెప్పారు.

చేసిన కర్మకు ఫలితం తప్పకుండా వుంటుంది. అంతేకాదు చేసిన కర్మ ఫలం తప్పకుండా అనుభవించి తీరాలి, తప్పదు అని కర్మ సిద్ధాంతం గురించి శ్రీరామకృష్ణ పరమహంస కచ్చితంగా చెప్పడం జరిగింది. దానికి ఉదాహరణగా కారం తింటే నోరు మండుతుంది, పంచ దార తింటే నోరు మధురంగా వుంటుంది కదా? అంటూ చేసిన పనికి ఫలితం కనిపిస్తుంది కదా? అని ఉదాహరణ కూడా చెప్పడం జరిగింది.


దీనిని బట్టి చెడు చేస్తే దుఃఖం కలుగుతుంది. మంచి చేస్తే భోగం కలుగుతుందని తెలుసుకోవాలి.

# గురునానక్

**"ఎంత చేసానో అంతే అనుభవించాను. మరొకరిని ఏమో అనుకుని ప్రయోజనం లేదు"** అన్నారు.

గురు నానక్ కూడా కర్మ సిద్ధాంతాన్ని మరో కోణంలో వివరించడం జరిగింది.

సహజంగా ఎవరి జీవితమైనా బాగోకపోతే ఎవరో ఒకర్ని నిందిస్తూ



వుంటారు. నా జీవితం ఇలా వుండటానికి కారణం నువ్వే అని నిందిస్తారు. అలా కొంతమంది పిల్లలు తమ తల్లిదండ్రులను నిందిస్తూ వుంటారు. నీకు పుట్టడం వల్లే నా పరిస్థితి ఇలా వుంది. నువ్వు ఏమీ సంపాదించలేదు. నాకు ఏమీ ఇవ్వలేదు. నన్ను సరిగా చదివించలేదు. నాచేత వ్యాపారం పెట్టించలేదు. వాళ్ళ నాన్న చూడు ఎంత సంపాదించి ఇచ్చాడో! ఎలాంటి వ్యాపారం పెట్టించాడో! వాడిని ఎలా చదివించాడో! చూడు అని తల్లిదండ్రులను ఆడిపోసుకుంటారు.

కానీ పిల్లల జీవితం అలా వుండటానికి కారణం గతంలో వారు చేసుకున్న కర్మలే. ఆ కర్మలు అనుభవించాలి కాబట్టే అలాంటి తల్లిదండ్రులకు పుట్టారు. లేకపోతే ధనం వున్న తల్లిదండ్రులకు పుట్టేవారు.

అలాగే కొంతమంది భార్యలు భర్తల్ని నిందిస్తూ వుంటారు. నిన్ను చేసుకున్నందు వల్లే నా జీవితం ఇలా వుంది. వాడిని చేసుకున్నా బావుణ్ణు వాడు చూడు తన భార్యను కారులో తిప్పుతున్నాడు, మంచి బిల్డింగు కట్టాడు, ఎన్ని నగలు కొన్నాడో నువ్వేం చేసావు? నీ వల్లే నా జీవితం ఇలా తయారైంది అని ఆడిపోసుకుంటారు.

అలాగే కొంతమంది భర్తలు, భార్యలను నిందిస్తూ వుంటారు. నిన్ను కట్టుకున్నందువల్లనే నా పరిస్థితి ఇలా వుంది. ఆవిడని చేసుకుంటే ఎంత కట్నం వచ్చేదో? ఎంత ఆస్తి కలిసేదో? అంటూ రకరకాలుగా భార్యల్ని నిందిస్తారు.

అలాగే ఆమె చేసుకున్న కర్మలను బట్టే అలాంటి భర్త లభించాడు. లేకపోతే వేరొక భర్త లభించేవాడు. అలాగే చేసుకున్న కర్మలను బట్టే అలాంటి భార్య లభించింది. లేకపోతే వేరొక భార్య లభించి వుండేది. అందుచేత మరొకరిని నిందించి ప్రయోజనం లేదని గురునానక్ అన్నారు.

అలా చాలా మంది తమ జీవితం బాగోకపోతే వేరొకరిని నిందిస్తూ వుంటారు. కానీ గురునానక్ ఏమంటారంటే నువ్వు చేసుకున్న కర్మల

ఫలితమే నువ్వు అనుభవిస్తున్నావు, దానికి వేరొకరిని ఎందుకు నిందిస్తావు? దాని వల్ల ఏం ప్రయోజనం వుండదు అంటారు.

ఇది తెలియక చాలామంది తల్లిదండ్రులను నిందిస్తారు. అలా ఇప్పుడు నిందిస్తున్నారు కానీ, గత జన్మలో ఎందుకు ఇవ్వలేదు? అపుడు ఇతరులకు ఇవ్వాలంటే కష్టం. మరి ఇవ్వటానికి ఇష్టపడకపోతే ఇష్టమైనది ఎలా వస్తుంది? రాలేదని ఆ తల్లిదండ్రులను నిందిస్తే వారేమి చేస్తారు. తాను చేసుకున్న దాన్ని బట్టే జన్మ లభించింది. దానికి తగ్గ తల్లిదండ్రులు లభించారు. అపుడు నాటలేదు. ఈ జన్మలో పంట ఎలా వస్తుంది? రాలేదని, ఏమీ లేదని తల్లిదండ్రులను నిందిస్తే నీ పాపం ఇంకా పెరుగుతంది తప్ప ప్రయోజనం లేదు. అందుకే మహ్మద్ ప్రవక్త అన్నారు. రేపటి కోసం అంటే వచ్చే జన్మ కోసం పంట పండించే పొలమే ఈ లోకం అన్నారు.

అందుచేత కనీసం ఇపుడైనా నాటుకోండి అంటే ఏది కావాలంటే అది ఇవ్వండి. ధనవంతులు అవ్వాలనుకునేవారు ధనం పంచవలసిందే! దానం చెయ్య వలసిందే! తెలుసుకోండి మీ జీవితానికి వేరొకర్ని నిందించి ప్రయోజనం లేదు. ఇదే నానక్ సందేశం.

అందుచేత మీ భవిష్యత్తు ఎలా వుండాలని అనుకుంటారో దానికి తగ్గ కర్మలు ఇప్పుడే చేసుకోండి. మీరు భవిష్యత్తులో ధనవంతులు కావాలనుకుంటే మీకు వున్న దాంట్లో కొంత ధనాన్ని పంచండి. మీరు ప్రేమించబడాలనుకుంటే మీ భార్యను, భర్తను ప్రేమగా చూసుకోండి.




## "రాధాస్వామి"

**"ఏఏ కర్మలు చేస్తావో ఆయా అనుభవాలు పొందవలసి వుంటుంది".**

రాధాస్వామి కర్మ సిద్ధాంతం గురించి మరొక కోణంలో వివరించారు. ఆయన ఏమంటారంటే ఎవరు ఎలాంటి కర్మలు చేస్తే అలాంటి అనుభవాలు పొందవలసి వుంటుంది.

నువ్వు ఇతరులకు, ఇతర జీవులకు ఎలాంటి హింస చేస్తే అలాంటి అనుభవం పొందవలసి వుంటుంది. ఎలాంటి నరకం చూపిస్తే అలాంటి అనుభవం పొందవలసి వుంటుంది. ఎలాంటి బాధ కలిగిస్తే అలాంటి అనుభవం పొందవలసి వుంటుంది. అంటే అలాంటి బాధ అనుభవించవలసి వుంటుంది. ఇదే ఈ సృష్టిలో వున్న సిద్ధాంతం అని చెప్పడం జరిగింది.

ఉదాహరణకు ఒకరికి బాగా ధనం వుంది. ఆకలితో ఒక బిచ్చగాడు ఏదైనా పెట్టమన్నాడు. కానీ ఈ ధనవంతుడు పో! పొమ్మన్నాడు. కారణం వాడి ఆకలి బాధ ఎలా వుంటుందో ధనవంతుడికి తెలియదు కనుక. అటువంటి వారు మరుజన్మలో బిచ్చగాడిగా జన్మించ వలసి వస్తుంది. ఆ జన్మంతా ఆకలితో అలమటిస్తూ వుంటాడు. అపుడు అతనికి ఆకలి బాధ ఎంత దుర్భరంగా వుంటుందో అనుభవంలోకి వస్తుంది. ఆ అనుభవం వల్ల ఆ మరుజన్మలో ఎవరైనా ఆకలి అని అడిగితే వెంటనే ఏదో ఒకటి ఇస్తారు. లేకపోతే పెడతారు.

మరి అంతకు ముందు పొమ్మన్నాడు కారణం అనుభవం కాలేదు కనుక. కానీ ఇప్పుడు ఇస్తున్నాడు కారణం అనుభవమైంది కనుక. అందుకే రాధాస్వామి ఏ ఏ కర్మలు చేస్తావో అలాంటి అనుభవాలు పొందవలసి వుంటుంది అన్నారు.

అలాగే కక్షగట్టో! కోపంతోనో! ఒకరి చేయి నరికినట్లయితే చేయి లేని అనుభవం పొందవలసి వుంటుంది. కళ్ళు తీస్తే కళ్ళు లేని అనుభవాన్ని పొందవలసి వుంటుంది. నష్టం కలిగిస్తే నష్టం పొందే అనుభవం పొంద వలసి వుంటుంది. భార్యను హింసిస్తే భార్యగా అలాంటి అనుభవం పొందవలసి వుంటుంది.

సృష్టిలో ఈ విధంగా తప్పులు, పాపాలు చేసేవారు. అనుభవాల ద్వారా ఆ తప్పులు, పాపాలు సరి చేసుకోవలసి వుంటుంది. మరల అటువంటివి చేయకుండా వుండటానికే, ఎవరికీ హాని కలిగించకుండా వుండటానికే అనుభవం పొందాలి. అనుభవం పొందకపోతే మార్పు రాదు. తప్పులు చెయ్యడం మానరు. అలా ప్రతీ జన్మలో అనుభవాల ద్వారా కొన్ని

పాఠాలు నేర్చుకుంటారు. అదే సృష్టిలోని 'కర్మ సిద్ధాంతం' యొక్క ఉద్దేశ్యం. కర్మ సిద్ధాంతంలోని ఈ ఉద్దేశ్యాన్నే రాధాస్వామి గారు వివరించడం జరిగింది.

రాధాస్వామి వారు ఇచ్చిన సందేశాన్ని బట్టి మనం ఎన్నో తెలుసుకోవలసి వుంటుంది. ఆలోచించవలసి వుంటుంది. జీవితంలో ఎంతో నేర్చుకోవలసి వుంటుంది.

## కర్మసిద్ధాంతం మానవుల వరకేనా? జంతువుల విషయంలో చేసినా వర్తిస్తుందా?

సహజంగా కర్మలు అంటే తప్పులు, పాపాలు మానవుల విషయంలో చేస్తేనే అనుభవించవలసి వస్తుంది, జంతువుల విషయంలో అది వర్తించదు. జంతువులను ఏమి చేసినా ఫరవాలేదు అనేటటువంటి భావం చాలా మందిలో వుంది. అంటే జంతువులను, పక్షులను బాధించినా, హింసించినా, చంపినా ఆఖరుకు తిన్నా ఫరవాలేదనే భావిస్తారు. అది పాపం కాదనే భావిస్తారు.

కానీ సృష్టిలో అన్ని జీవులు సమానమే. అంటే జీవం వున్న ప్రతి ప్రాణి ఒక్కటే. కారణం ప్రతి ప్రాణి జీవించడానికి, జీవితం సాగించడానికి భగవంతుడు అంటే చైతన్యశక్తే కారణం. ఈ చైతన్య శక్తితోటే అన్ని ప్రాణులు సృష్టించబడ్డాయి. మనుగడ సాగిస్తున్నాయి. అందుచేత అన్నీ దైవ స్వరూపాలే. అందుచేత 'కర్మ సిద్ధాంతం'. ఏ జీవి విషయంలో చేసినా వర్తిస్తుంది. ఆఖరికి చీమలు, దోమలు విషయంలో కూడా వర్తిస్తుంది. కానీ చిన్న జీవుల విషయంలో పాప తీవ్రత తక్కువగా వుంటుంది. పెద్ద పెద్ద జంతువుల విషయంలో పాప తీవ్రత ఎక్కువగా వుంటుంది. మానవుల విషయంలో మరీ ఎక్కువగా వుంటుంది.

కారణం జంతువులు సామూహిక ఆత్మలు, మానవులు మాత్రం ఏకాత్మలు. అంతేకాదు మానవ శరీరం పంచభూత తత్వం కలిగి వుంది. అలాగే వృక్షాలు ఏక భూతతత్వం కలిగి వున్నాయి. క్రిములు, కీటకాలు ద్విభూత తత్వం కలిగి వున్నాయి. పక్షులు త్రిభూత తత్వం కలిగి వున్నాయి.

జంతువులు నాలుగు భూతతత్వాలు కలిగి వున్నాయి. సృష్టి పరిణామ క్రమంలో ప్రాణుల పురోగతి, ఎదుగుదల ఈ క్రమంలోనే జరుగుతూ చివరకు మానవుని స్థాయికి వస్తాయి. అందుచేత అన్ని జీవుల కంటే మానవుడు విశిష్టమైనవాడు. అంతే తప్ప అన్నీ ఒక్కటే అన్నీ దైవ స్వరూపాలే అన్నది మర్చిపోకూడదు.

ఒక రకంగా "మానవుడు అంటే సృష్టిలో ఎదిగిన జంతువులు. అలాగే జంతువులు అంటే ఎదగబోయే మానవుడు" అని అర్థం. అంటే ఒకప్పటి జంతువులే ఇప్పటి మానవులు. జంతువులంటే వేరే ఏమీ కాదు. కాబోయే మానవులనే అర్థం. అందుచేత అంతా ఒక్కటే. అన్నీ ఒక్కటే, అందుచేత 'కర్మ సిద్ధాంతం' అన్ని జీవులకు వర్తిస్తుందని తెలుసుకోవాలి. ఏ జీవి విషయంలో ఎవరు హింస చేసినా, పాపం చేసినా అనుభవించవలసిందే. అనుభవం పొందవలసిందే.

సమాజంలో మనం గమనిస్తే చాలా మంది చాలా రకాలుగా బాధలు పడుతూ వుంటారు. కష్టాలు అనుభవిస్తూ వుంటారు, నరకం అనుభవిస్తూ వుంటారు. గమనిస్తే చాలా మందికి రకరకాల ఫైర్ ఏక్సిడెంట్లలో శరీర భాగాలు కాలిపోతూ వుంటాయి. శరీరం కూడా కాలిపోతుంది. అలా కాలిపోయిన గాయాలతో చనిపోయే వారు కూడా వున్నారు. అలా దీపావళికి మందులు కాలుస్తూ ఒళ్ళు కాల్చుకునే వారు వున్నారు, వంట చేస్తూ గ్యాస్ యాక్సిడెంట్ వల్ల ఒళ్ళు కాలిన వారు వున్నారు. అత్తవారి ఇళ్ళలో శరీరం కాలిన వారు, కిరసనాయిలుతో కాల్చి చంపబడిన వారు వున్నారు. యాసిడ్ దాడుల వల్ల ఒళ్ళు కాలిన వారు వున్నారు. కరెంటు షార్టు సర్క్యూట్ వల్ల ఇళ్ళు కాలి ఆ మంటలలో కాలి చనిపోయిన వారు వున్నారు. బస్సులు కాలడం వల్ల, రైలు భోగీలు తగలబడటం వల్ల, విమానాలు కూలి తగలబడటం వల్ల కాలి చనిపోయిన వారు వున్నారు. యుద్ధాలలో బాంబులు వేయడం వల్ల ఊళ్ళకు ఊళ్ళే తగలబడిపోతూ ఎంతమంది కాలట్లేదు, చనిపోవట్లేదు. ప్రపంచ వ్యాప్తంగా ఎన్ని పూరిళ్ళు తగలబడటం లేదు, ఎంతమంది ఒళ్ళు కాలి చనిపోవడం లేదు. ఇలా ఆలోచిస్తే ఒళ్ళు కాలిన

వారు ఎన్నో వేలు, లక్షల మంది మనకు ప్రపంచంలో కనిపిస్తారు. అలా వీరందరు కాలి నరకం అనుభవిస్తూంటే! వారికి జరిగిన ఘోరం వల్ల వారి కుటుంబీకులు పరోక్షంగా ఎంత బాధ అనుభవిస్తున్నారు? మరి ఎందుకు ఇలా జరుగుతుంది?

ఆలోచించండి? అసలు ఏం చేసారు వీరంతా? అలాంటి బాధ ఎందుకు అనుభవించాలి? ఏ తప్పు చేయని దానికి ఇంత శిక్షా?

న్యాయ స్థానాలలో "అపరాధికి శిక్ష పడకపోయినా! నిరపరాధికి మాత్రం శిక్ష పడకూడదంటారే!" మరి దయగల భగవంతుడు ఇంత దారుణమైన శిక్ష ఎందుకు విధిస్తున్నాడు? నమ్ముకున్న దేవుడే నరకం చూపిస్తున్నాడే? దయగల దేవుడు దయ ఎందుకు చూపటం లేదు? దేవుడు అంత క్రూరంగా వుంటాడా? ఆలోచిస్తే ఇదంతా అయోమయంగా వుంటుంది. అర్థం కాదు. అసలు ఎందుకు ఇలా జరుగుతుంది? అసలు మానవుల దోషం ఏమీ లేదంటారా? మానవులు ఏ తప్పులు, పాపాలు చెయ్యట్లేదంటారా? మానవుడు అమాయకుడా? ఏమీ ఎరగడా? దేవుడు వూరికే కష్టాలు పెడుతున్నాడా? దేవుడికి దయ లేదా? ఆలోచించండి.

ఆహారం కోసం ఒక ప్రక్క ప్రపంచ వ్యాప్తంగా నిత్యం ఎన్నో పక్షులు, జంతువులు హింసించబడుతున్నాయి కదా? కాల్చబడుతున్నాయి కదా? చంప బడుతున్నాయి కదా? వాటి ఫలితమే ఇలా జరుగుతుందేమోనని ఎందుకు ఆలోచించరు? ఇది కారణం కాకపోతే మరే కారణమై వుంటుంది? ఏమీ లేకుండా వూరికే జరుగదు కదా? జంతువులను పక్షులను కాల్చడం తప్పు కానప్పుడు, కాలిన వారు ఏమి చేసి వుంటారు? యధాలాపంగా వూరికే ఇలా జరుగుతుందా? ఆలోచించాలి కదా?

రాధాస్వామి లాంటి గొప్పవారు, జ్ఞానులు, దైవస్వరూపులు వూరికే చెప్పరు కదా? అటువంటి వారు చెప్పిన దాంట్లో ఏ సత్యం లేదా? వారు చెప్పిన దాని గురించి ఆలోచించనక్కరలేదా? వారి సందేశంలోని అర్థం తెలుసుకోనవసరం లేదా? అందుచేత పెద్దలు చెప్పిన సందేశాల సారం తెలుసుకోవాలి.

చూడండి ప్రపంచ వ్యాప్తంగా బొంబాయి, ఢిల్లీ, కలకత్తా లాంటి మహా నగరాల్లో వుండేటటువంటి రెడ్‌లైట్ ఏరియాలలో ఎన్ని లక్షల మంది స్త్రీల చేత వ్యభిచారం చేయిస్తున్నారు? విటుల ఆనందం కోసం, ధనార్జనే లక్ష్యంగా వున్న వ్యాపారుల సంపాదన కోసం, ఆనందం కోసం, ఈ స్త్రీలందరినీ ఇరుకైన గదులలో గాలి, వెలుతురు సరిగా లేని గదులలో జీవితమంతా బందిస్తున్నారే! కొంత మంది ఆనందం కోసం ఈ స్త్రీలు జీవితమంతా స్వేచ్ఛను కోల్పోతున్నారే. బయట ప్రపంచం తెలియకుండా బ్రతుకుతున్నారే! బంధించిన నిర్వాహకులు సంతలో పశువులను కొన్నట్టు వీరిని కొంటున్నారే! సరదా కోసం పక్షులను పంజరాలలో వుంచినట్టు, కుక్కలను చిన్న చిన్న గూళ్ళలో కట్టినట్టు, చేపలను చిన్న చిన్న తొట్టెలలో వుంచినట్టు ఈ స్త్రీలను ఇరుకు గదులలో బంధిస్తున్నారే, గమనించండి ఆ జంతువులు యజమాని ఏది పెడితే అది తినాలి. ఎప్పుడు పెడితే అప్పుడు తినాలి. ఏం చెయ్యమంటే అదే చెయ్యాలి. ఒక రకంగా మానవులైన ఈ స్త్రీలంతా అలాగే నిర్వాహకుల చేత చూడబడుతున్నారే! వారి జీవితమంతా ఇతరులను ఆనందపరుస్తూ స్వేచ్ఛ లేకుండా జీవించవలసి వస్తుంది కదా? అసలు అటువంటి జీవితం వారికి ఎందుకు వచ్చింది? ఎందుకు బానిస బతుకు? ఎందుకు ఈ నరకం? ఆలోచిస్తే అర్థం కాదు.

అంతే కాదు గమనిస్తే ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది స్త్రీలు ఘోషా పేరుతో ఇంటి నుంచి బయటకు రాకుండా ఇళ్ళలోనే జీవిస్తున్నారు కదా? అంతేకాదు చాలా మంది పురుషులు స్త్రీలను తమ ఆనందం కోసమే అన్నట్టుగా చూడటం లేదా? అసలు ఎంతమంది స్త్రీలకు పూర్తి స్వేచ్ఛ వుంది? ఆలోచించండి? బాహ్య ప్రపంచం తెలియని స్త్రీలు ఎంతమంది లేరు? అసలు ఎందుకు వారికి అలాంటి జీవితం వచ్చింది? ఆలోచించండి.


ఇంకా గమనించండి. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది కొజ్జాలుగా పుడుతున్నారు. ఎడ్లకు, పందులకు ఇంకా కొన్ని రకాల జంతువులకు వృషణాలు కోయబడినట్లే కొంతమంది బలవంతంగా వృషణాలు కోయబడి కొజ్జాలుగా మార్చబడుతున్నారు కదా?

ఇంకా చూడండి. ఒక ప్రక్క పిల్లగా మారవలసిన అండాన్ని గుడ్డు దశలోనే ఎంతమంది ఇష్టంగా తినడం లేదు? ఇంకొక ప్రక్క గర్భం రాక, గర్భం నిలవక పిల్లలు లేక గొడ్రాలిగా ఎంత మంది బాధపడట్లేదు?

ఇలా మనం గమనించ గలిగితే ఒక ప్రక్క చేసేవారు కనిపిస్తున్నారు. ఇంకొక ప్రక్క అలాంటి బాధే అనుభవించేవారు కూడా కనిపిస్తున్నారు. ఎందుకు ప్రపంచం ఇలా వుంది? ఒకడు తప్పు చేసేవాడు, ఇంకొకడు అనుభవించేవాడు కనిపిస్తున్నారు. అలా ఒకరు తప్పు చేస్తుంటే ఇంకొకరు అనుభవించడమేమిటి? మనమే అంటాం కదా? తప్పు చేసిన వాడే శిక్ష అనుభవించాలి? అని.

మరి ఈ విషయం భగవంతునికి తెలియదా? భగవంతుని సృష్టిలో న్యాయం, ధర్మం లేదా? అంత దయ లేనివాడా భగవంతుడు? బాగా లోతుగా ఆలోచిస్తే ఇదంతా అర్థమవుతుంది. "భగవంతుని సృష్టిలో అంతా న్యాయమే జరుగుతుంది. అన్యాయం అనేది లేనే లేదు" అని తెలుస్తుంది. భగవంతుని నిర్ణయాలే! అంటే సృష్టిలో జరిగే దానిని, సృష్టి సిద్ధాంతాలని, సృష్టి ధర్మాలని భూమి మీదకు వచ్చిన దేవుళ్ళు, మహర్షులు మనకు చెబుతున్నారు.

అందుచేత పెద్దలు చెప్పింది అర్థం చేసుకుందాం. వారి సందేశాలు ఆచరణలో పెడదాం. సృష్టి సిద్ధాంతమైన 'కర్మ సిద్ధాంతాన్ని' ఆచరణలో పెడదాం. మన జీవితాలను మన కర్మల ద్వారా సరి చేసుకుందాం. అందరినీ ఆనందంగా జీవించనిద్దాం. మనం కూడా ఆనందంగా జీవిద్దాం.



"జీవించు - జీవించనివ్వు" అన్న మహావీరుని సందేశం ఆచరణలో పెడదాం.

లోకం ఎలా వుందంటే? ఎవడి ఇష్టం వాడిది? ఎవరి కష్టాలు వారివి? ఎవరి ఇష్టాలను ఎవరు కాదనగలరు? ఎవరి కష్టాలను ఎవరు తీర్చగలరు? ఎవరికి ఎవరు

ఏమి చెప్పగలరు? ఏదైనా అనుభవమే చెప్పాలి. అదే రాధాస్వామి వారి సందేశం.



# కబీరు

**"ఎవరు చేసిన కర్మలు వారే అనుభవిస్తారు" అని అంటూ "ఏ చేయి కర్మలను ఆచరిస్తుందో, ఆ చేయే ఫలితాలను అనుభవిస్తుంది".**

ఈ సృష్టిలో ఎవరు చేసిన కర్మలు వారే అనుభవించవలసి వుంటుంది. అంతేకానీ ఒకరు చేసిన కర్మలు ఇంకొకరు అనుభవించడం వుండదు. అంతేకాదు ఒకరి కోసం ఇంకొకరు చేసినా దాని ఫలితం చేసిన వారికే చెందుతుంది. కానీ ఎవరి నిమిత్తం చేసారో వారికి ఆ ఫలితం చెందదు, సంక్రమించదు. ఇదే కబీరు సందేశంలోని అర్థం.

సహజంగా లోకంలో ఎవరైనా చనిపోయినా, అంటే పిల్లలు కానీ, తల్లిదండ్రులు కానీ, భార్య కానీ, భర్త కానీ చనిపోయినపుడు వారి జ్ఞాపకార్థం కొన్ని దానాలు, సేవా కార్యక్రమాలు చేస్తూ వుంటారు. అలా చెయ్యడం వల్ల ఆ ఫలితం వారికి చెందుతుందని భావిస్తారు.

అలాగే చనిపోయినపుడు కర్మకాండలు చేస్తారు. ఆ సందర్భంగా వారి శక్తి మేరకు రకరకాల దానాలు చేస్తారు. అలా చేయడం వల్ల ఆ దాన ఫలితం చనిపోయిన వారికి మేలు చేస్తుందని, లాభం కలిగిస్తుందని, ఉన్నత లోకాలు చేరుస్తుందని భావిస్తారు.

కానీ కబీరు సందేశమేమిటంటే ఏ కర్మ అయినా, అది మంచి అయినా, చెడు అయినా, పుణ్యమయినా, పాపమయినా చేసిన వారే అనుభవించవలసి వుంటుంది. కానీ ఎవరి కోసం చేస్తామో వారు అనుభవించరు. ఆ కర్మ ఫలితం చేసిన వారికి చెందుతుంది. కానీ ఎవరి కోసం చేసామో వారికి చెందదు. అని కబీర్ చెప్పడం జరిగింది.

ఈ విషయమే మనకు పురాణాలలో కూడా చెప్పబడింది. వాల్మీకి దారి దోపిడీలు చేస్తూ, హత్యలు చేస్తూ వుండేవాడు. ఒకసారి నారద మహర్షి వాల్మీకికి ఎదురు పడి నువ్వు ఎందుకు ఈ హత్యలు, పాపాలు చేస్తున్నావు? అని అడిగాడు. అపుడు వాల్మీకి నా భార్యను పోషించడానికి, నా భార్య కోసం చేస్తున్నాను అన్నాడు. అపుడు నారదుల వారు మరి నీ భార్య కోసం ఈ పాపాలన్నీ చేస్తున్నావు కదా? ?నువ్వు సంపాదించింది, నీ భార్య పంచుకుంటుంది, అనుభవిస్తుంది. నువ్వు చేసే పాపం ఆమె ఏమైనా పంచుకుంటుందేమో అడుగు' అన్నారు.

వెంటనే వాల్మీకి భార్య దగ్గరకు వెళ్ళి ఈ విషయమై అడిగాడు. అపుడు ఆమె నీ పాపంతో నాకు సంబంధం ఏమిటి? ఏదో నీవు తెస్తున్నావు? నేను అనుభవిస్తున్నాను. నేనేమైనా నిన్ను పాపాలు చెయ్యమన్నానా? అని అంది. వాల్మీకికి బుర్ర తిరిగింది వెంటనే నారదుని దగ్గరకు వెళ్ళి ఆయన కాళ్ళ మీద పడి ఇపుడు నేనేమి చెయ్యాలో బోధించండి అని నారదుని అడిగాడు.

అలా నారదుని బోధతో కిరాతకుడుగా వున్న వాల్మీకి మహర్షి అయ్యాడు. రామాయణాన్ని రచించాడు.

దీన్ని బట్టి ఎవరు చేసిన కర్మ ఫలితం వారికే చెందుతుంది, ఇంకొకరి కోసం చేసినా వారికి చెందదు అని అర్థమవుతుంది. ఇదే కబీర్ సందేశం.

అందుచేత సంసారం పోషించాలని పాపాలు చేస్తూ, అధర్మంగా సంపాదిస్తే ఆ సంపాదనతో సంసారంలో అందరూ సుఖిస్తారు కానీ చేసిన పాపాలు మాత్రంచేసిన వాడే అనుభవించాలి. ఆ పాప ఫలితం జన్మ జన్మలు అతడిని వెంటాడుతూ వుంటుంది. దీనిని బట్టి సంపాదించడం కోసం

**సర్వం ఒక చోట కనబడాలి అంటే అది తపస్సు (ధ్యానం) వల్లనే వస్తుంది. మాటలలో రాదు. తల్లి దండ్రులు, భార్యాపిల్లలూ, మీ పాపాలను పంచుకోరు. అందువల్ల మీరు వాళ్ళ కోసం పాపాలు చెయ్యడం ఎందుకు?**

**– శ్రీ బాలయోగి**



పాపాలు చెయ్యకూడదని అర్థం చేసుకోవాలి.

అలాగే కొంతమంది నా తండ్రికి అన్యాయం చేసాడు. నా తండ్రిని చంపాడు, నా తండ్రి కాలు నరికాడు, నా తండ్రికి ఘోరంగా అన్యాయం చేసాడు అని, అన్యాయం చేసిన వాడిని చంపడం, హింసించడం, చేసిన దానికి ప్రతిగా ఏదో ఒకటి చెయ్యడం, చేస్తే ఆ పాప ఫలితం తానే అనుభవించవలసి వుంటుంది. సహజంగా నా భార్యకు అన్యాయం చేసాడని, నా కుమార్తెకు అన్యాయం చేసాడని ప్రతిగా కక్ష కట్టి ఏదో ఒకటి చెయ్యడం సమాజంలో చూస్తూనే వున్నాం. కానీ సృష్టిలోని కర్మ సిద్ధాంతం ప్రకారం ఎవరికోసం చేసినా చేసిన వాడే అనుభవించవలసి వస్తుందని తెలుసుకోవాలి.

అలాగే చాలా మంది వారసుల కోసం ఆస్తులు కూడబెట్టి, కూడబెట్టి వారసులకు ఇస్తారు. తాము ఏ మంచి కార్యాలు, పుణ్యకార్యాలు చెయ్యకుండా చనిపోతారు. ఆ సంపద వారసులకు చెందుతుంది. ఆ వారసులు ఆ సంపదనే పుణ్య కార్యాలకు వినియోగిస్తే కనుక ఇక్కడ కష్టపడి, గడ్డితిని సంపాదించిన వాడికి ఏ ఫలితం రాదు. కానీ దానం చేసిన వారసుడికే పుణ్యం వస్తుంది.

అందుచేత ఎవరైనా సరే తాను వున్నప్పుడు, తనది అనుకున్న దాంట్లోంచి ఎంతో కొంత పుణ్య కార్యాలకు, లోక కళ్యాణకరమైన పనులకు వెచ్చిస్తే, ఆ ఫలితమే అతనికి సంక్రమిస్తుంది. అంతేకానీ ఎంత సంపాదించినా, కూడబెట్టి ఎంత సంపద వారసులకు ఇచ్చినా ఏ మాత్రం ఫలితం వారికి రాదని తెలుసుకోవాలి. అందుచేత మీకున్న దానిని, మీదనుకున్న దాంట్లోంచి కొంత లోకానికి ఖర్చు పెట్టండి. ఇవ్వండి.

సృష్టిలోని ఈ కర్మ సిద్ధాంతాన్నే కబీర్ చెప్పడం జరిగింది.

▲ ప్రతీకారం కోసం నీ శక్తిని, సమయాన్ని వృథా చెయ్యకు.
ఎవరైతే నిన్ను బాధించారో వారు చేసిన
కర్మల ఫలం తప్పనిసరిగా అనుభవిస్తారు.



# గురు సాహెబ్

**1) "కర్మ సిద్ధాంతం ప్రకృతి యొక్క మారని శాశ్వత చట్టం ఇది వ్యక్తిగత మరియు ఆధ్యాత్మిక జీవితానికి పునాది".**

**2) "రాత్రింబవళ్ళు మానవుడు చేసేదంతా వాని నొసట వ్రాయబడుతుంది".**

ఒక దేశం, కొన్ని చట్టాలతో ఎలా నడపబడుతుందో! ఆ దేశంలోని ప్రజలు ఆ చట్టానికి ఎలా బద్ధులో! అలాగే భగవంతుని సృష్టి కూడా కొన్ని సిద్ధాంతాలతో అంటే చట్టాలతో నడపబడుతుంది.

ఈ సృష్టిలో వున్న ప్రతి జీవి ఆ నియమాలకు, చట్టానికి బద్ధులే. అలాంటి ప్రకృతి చట్టాలలో 'కర్మసిద్ధాంతం' అన్నది మారని, శాశ్వత చట్టమని గురుసాహెబ్ చెబుతున్నారు.

అందుచేత ఈ సృష్టిలో జీవిస్తున్న మానవులమైన మనం "కర్మ సిద్ధాంతం" అనే చట్టాన్ని అనుసరించి జీవించాలి. 'కర్మసిద్ధాంతం' అనే చట్టాన్ని నిర్లక్ష్యం చేయకూడదు, తేలికగా తీసుకోకూడదు. అంటే ఇష్టం వచ్చినట్టు కర్మలు చేయకూడదు. అంటే ఎలా పడితే అలా ప్రవర్తించకూడదు. అలా ప్రవర్తిస్తూ, కర్మలు చేస్తే సృష్టిలోని 'కర్మ సిద్ధాంతం' అనుసరించి ఫలితం అనుభవించవలసి వుంటుంది.

ఒక రకంగా ఒక దేశం... కనిపించే ప్రభుత్వంచే రాజ్యాంగం ప్రకారం ఎలా నడపబడుతుందో? ఈ సృష్టి కూడా కనిపించని శక్తి (భగవంతుని)చే కొన్ని నియమాలు, సిద్ధాంతాలను అనుసరించి నడపబడుతుంది. ఒకదేశ చట్ట ప్రకారం తప్పు చేసిన వాడు ఎలా శిక్షింపబడతాడో అలాగే ఈ ప్రకృతి చట్టం ప్రకారం పాపం చేసిన వాడు కూడా శిక్షింపబడతాడు. అంటే కష్టాల పాలవుతాడు.

ఒకదేశ చట్టాలు మారవచ్చునేమో కానీ ప్రకృతి చట్టం మటుకు మారదని గురుసాహెబ్ చెబుతున్నారు.

ఆయన ఇంకా ఏమన్నారంటే కర్మ సిద్ధాంతం ప్రకారం ఎవరు ఏ కర్మ చేసినా అది వారి నొసట వ్రాయబడుతుందని అన్నారు. చాలా మంది ఉద్దేశ్యమేమిటంటే మన రాతలు దేవుడు అంటే బ్రహ్మవ్రాస్తాడు అనుకుంటారు. బ్రహ్మ మన నుదుటన వ్రాసిన వ్రాత ప్రకారమే జీవితం వుంటుందని భావిస్తారు. అందుకే నా రాత ఇలా వుందని నుదురు చూపిస్తారు. కానీ గురు సాహెబ్ ఏమంటారంటే మన కర్మలే మన నుదుటన వ్రాయబడతాయని చెబుతున్నారు.

దాని అర్థం మనం చేసే ప్రతి కర్మ ఈ సృష్టిలో రికార్డు చేయబడుతుంది. అంటే మనం చేసే ప్రతీ పని, ప్రతీ మాట అనుక్షణం పగలే కాదు రాత్రి కూడా రికార్డు చేయబడుతుంది. మీరు ఒక్కరే వున్నా, గుహలోవున్నా, ఎవరూ చూడకుండా గది తలుపులు వేసుకున్నా మీరు చేసే పనులు, మాటలు, కర్మలు రికార్డు చేయబడుతూనే వుంటాయి. అంటే ప్రకృతి ఎంత శక్తివంతమైనదో తెలుసుకోవచ్చు. అందుచేత ప్రకృతి శక్తిని తక్కువగా అంచనా వేయవద్దు. మనం చేసిన పనులే కొన్ని రోజులలో మనం మరచిపోతామేమో మరి ఇన్ని కోట్లు జీవుల కర్మలు రికార్డు కావడం అంటే ప్రకృతి యొక్క శక్తి మనం వూహించుకోవచ్చు. రికార్డు చేయబడటమే కాదు. సమయం సందర్భాన్ని అనుసరించి దాని ఆ ఫలితం కూడా ఇవ్వబడుతుంది. ఈ సందర్భంగా మనం తెలుసుకోవలసిందేమిటంటే మన రాతలు, మనం చేసే కర్మల ద్వారా మనమే రాసుకుంటున్నాము. మన రాత వేరెవరూ వ్రాయటం లేదని తెలుసుకోవాలి.

అంటే మన జీవితం మన చేతుల్లోనే వుందని తెలుసుకోవాలి. అంటే మన చేతులు చేసే చేతల్లోనే వుందని తెలుసుకోవాలి. అదే గురుసాహెబ్ గారి సందేశం అందుచేత మన జీవితం ఇలా వుందని ఎవరిని నిందించవద్దు. కనీసం ఇప్పటి నుంచైనా మన చేతలు సరి చేసుకోవాలి. ప్రవర్తన మార్చుకోవాలి. మన భవిష్యత్ ఎలా

వుండాలనుకుంటామో దానికి తగ్గట్టుగా కర్మలు చెయ్యాలి.

# మహాజ్ఞాని సహజోబాయి

**"పశు, పక్ష, నర, సుర, అసుర, జలచర, కీటకాదులన్నీ చేసుకున్న కర్మలు అనుభవిస్తున్నవే".**

పై సందేశాన్ని బట్టి ఈ సృష్టిలోని ప్రతి జీవికి 'కర్మ సిద్ధాంతం' వర్తిస్తుందని తెలుసుకోవాలి. కర్మ సిద్ధాంతాన్ని ఏ జీవి, ఏ ప్రాణి తప్పించుకోలేదు. ప్రతీ జీవి చేసుకున్న కర్మలు అనుభవిస్తున్నాయి.

మహాజ్ఞాని సహజోభాయి సందేశాన్ని బట్టి మన జీవితమైనా మనం అంతకు ముందు చేసుకున్న కర్మలను బట్టే ఉందని అర్థం చేసుకోవాలి. అందుచేత కర్మలు చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా చెయ్యాలి. ఆలోచించి చెయ్యాలి. నష్టం కలిగించే కర్మలు చెయ్యకూడదు. లాభం కలిగించే కర్మలే చెయ్యాలి.

# "కన్ఫ్యూషియిజం"

"కన్ఫ్యూషియిజం" ఏమి చెబుతుందంటే **"పరులు నీకు ఏమి చేయకూడదనుకుంటావో! నువ్వు వారి విషయంలో అలాగే వుండాలి".**

పరులు నిన్ను అవమానించకూడదనుకుంటే నువ్వు ఎవరినీ అవమానించకు, పరులు నిన్ను విమర్శించకూడదనుకుంటే నువ్వు ఎవ్వరినీ విమర్శించకు. పరులు నిన్ను నష్టపెట్టకూడదని భావిస్తే నువ్వు ఎవ్వరినీ నష్టపెట్టకు. పరులు నిన్ను హేళన చెయ్యకూడదనుకుంటే నువ్వు ఎవ్వరినీ హేళన చెయ్యకు. పరులు నీ సొత్తు అపహరించకూడదనుకుంటే నీవు ఎవరి సొత్తూ అపహరించకు.

అలాగే పరులు నిన్ను గౌరవించాలనుకుంటే నువ్వు అందరినీ గౌరవించు. పరులు నిన్ను ప్రేమించాలనుకుంటే నువ్వు అందరినీ, అన్నిటినీ ప్రేమించు. పరులు నిన్ను అభిమానించాలనుకుంటే నువ్వు అందరినీ అభిమానించు.

ఇదే కన్ఫ్యూషియిజం యొక్క సందేశం. అంటే మనం ఇచ్చే దాన్ని

బట్టే మనకు వచ్చేది వుంటుందని తెలుసుకోవాలి. అందుచేత ఏది ఇస్తామో అదే పొందుతాం. ఎంత ఇస్తామో అంతే పొందుతామని తెలుసుకోవాలి. ఇదే కర్మ సిద్ధాంతం యొక్క అర్ధం.

# "భాయి గురుదాస్‌జీ"

**"మంచి చేస్తే చెడు లభిం చదు. చెడు చేస్తే మంచి లభించదు".**




భాయి గురుదాస్‌జీ కూడా అదే చెబుతున్నారు. మనం ఇతరులకు ఏమి చేస్తామో మనకు అదే లభిస్తుంది. వేరొకటి లభించదు. అంటే మంచి చేస్తే మంచే లభిస్తుంది. చెడు చేస్తే చెడే లభిస్తుంది. అంటే చేసిన కర్మకు విరుద్ధమైన ఫలితం రాదనే చెబుతున్నారు.

కానీ లోకంలో చెడు చేనస్తున్నారు. మంచి కోరుకుంటున్నారు. ఎంత కోరుకున్నా అనుకున్నట్టు జరగట్లేదు. కోరుకున్నట్టు జీవితం వుండటం లేదు. కారణం సృష్టిలోని "కర్మ సిద్ధాంతం". అందుచేత కోరికలు కోరేవారు ఈ విషయం అర్థం చేసుకోవాలి.

"మంచి చేసిన వారికి కోరకపోయినా మంచే జరుగుతుంది. చెడు చేసిన వారికి కోరినా మంచి జరగదు" అంటే ఇక్కడ జీవితం అన్నది చేసుకున్న దాన్ని బట్టి వుంటుంది కానీ పూజలు చేసి, ప్రార్థనలు చేసి, నమాజు చేసి, సంకల్పాలు పెట్టుకుని కోరుకున్న దాన్ని బట్టి వుండదని తెలుసుకోవాలి.

అందుకే 'చేసుకున్నవాడికి చేసుకున్నంత మహదేవ' అన్నారు.

| |
|---|
| ▲ కర్మ అన్నది కార్యాకారణ సంబంధమైనది. దాని నుంచి నువ్వు తప్పించుకోలేవు. – ఎలోలిమస్ |



# "తులసీదాసు"

**ఈ ప్రపంచంలో 'కర్మ సిద్ధాంతానిదే రాజరికం' అన్నారు.**

పై విషయాలను బట్టి ఈ ప్రపంచంలో కర్మ సిద్ధాంతం అన్నది చాలా ముఖ్యమైనదని అర్థమవుతుంది. ప్రతి మానవుడి జీవితం కర్మ సిద్ధాంతంపై ఆధారపడి వుందని తెలుస్తుంది. అందరి కంటే రాజు ఎలా గొప్పవాడో అలాగే అన్నింటి కంటే గొప్పదైనది ఈ కర్మ సిద్ధాంతం.

అందుకే తులసీదాస్ గారు కర్మ సిద్ధాంతానిదే రాజరికం అన్నారు.

# "రవి గురుదాస్"



**"తాను చేసిన కర్మలకు ఎప్పుడో ఒకప్పుడు ఫలితాలు అనుభవించక తప్పదనే విషయాన్ని మానవుడు మరువకూడదు".**


సహజంగా లోకంలో జనం ఈ కర్మ సిద్ధాంతాన్ని పెద్దగా పట్టించుకోకపోవడానికి, ప్రాముఖ్యం ఇవ్వకపోవడానికి కారణం కర్మ చేసిన వెంటనే ఏ ఫలితం కనిపించక పోవడమే. అది పాపమైనా, పుణ్యమైనా ఫలితం వెంటనే కనబడదు కాబట్టి పాపాలు చేసేవారు పాపాలు చేస్తూనే వుంటారు. అలాగే పుణ్యం చేసిన వారికి ఫలితం కనబడదు. కాబట్టి చేసి ప్రయోజనమేమిటి? దానికి ఖర్చు పెట్టే డబ్బుతో ఇంచక్కా ఎంజాయ్ చేయవచ్చు కదా? అనుకుంటూ విలాసాలకి ఖర్చు పెడుతూ వుంటారు.

మానవులు అలా ప్రవర్తించడానికి కారణం చేసిన కర్మకు వెంటనే ఫలితం కనిపించకపోవడమే. కానీ రవి గురుదాస్ ఏమంటారంటే చేసింది వృధా కాదు. అది ఎప్పుడో ఒకప్పుడు అంటే ఈ జన్మలోనైనా కావచ్చు లేదా భవిష్యత్ జన్మలలోనైనా కావచ్చు. తప్పనిసరిగా ఫలితం వచ్చి

తీరుతుంది. చేసిన కర్మకు ఫలితం అనుభవించక తప్పదు అని చెపుతున్నారు.

అందుచేత తప్పులు, పాపాలు చేసేవారు ఆలోచించాలి. పాపాలు మానేయాలి. ముఖ్యంగా హింసాత్మక పనులు మానేయాలి. అంటే జీవ హింస చెయ్యకూడదు. అలాగే విలాసాలకు పెట్టే ఖర్చు పుణ్య కార్యాలకు ఖర్చు పెట్టాలి.

# బ్రహ్మర్షి పత్రీజీ



పత్రీజీ ఏమంటారంటే **"మనం చేసే ఏ రకం కర్మకైనా సమయ సందర్భాను సారంగా ఆ కర్మకు తగిన ప్రతిఫలానికి ఖచ్చితంగా దారి తీస్తుంది".**

విత్తనం నాటిన వెంటనే పండు ఎలా రాదో చేసిన కర్మకు కూడా ఫలితం వెంటనే రాదని తెలుసుకోవాలి.

అలాగే ఆయన విత్తు బట్టి చెట్టు వున్నట్టు గానే మనం చేసిన కర్మను బట్టే ఫలితం వుంటుంది అని చెప్పారు.

ఆయన ఇంకా పెద్ద పెద్ద పాపాలు చేస్తే పెద్ద పెద్ద రోగాలు, చిన్న, చిన్న పాపాలు చేస్తే చిన్న చిన్న రోగాలు, రకరకాల పాపాలు చేస్తే రకరకాల రోగాలు వస్తాయని కర్మ సిద్ధాంతం గురించి చెప్పడం జరిగింది.

అంటే మనం చేసే పాపం యొక్క తీవ్రతను బట్టి మనం అనుభవించే కష్టం వుంటుందని తెలుసుకోవాలి. ఆయన ఏమి చెప్పారంటే **"జంతువధ అన్నదే మానవాళి యొక్క మహా పాప కర్మ"** అని అన్నారు. అందుచేత జంతు వధ చేయకూడదు. జంతు వధకు కారణమైన 'మాంసాహారం' తినకూడదని తెలుసుకోవాలి.

కర్మ సిద్ధాతం లేదని అనుకోకూడదు. కర్మ సిద్ధాంతం కచ్చితంగా వుంది. అదే యోగులంతా చెప్పింది. కర్మల విషయంలో జాగ్రత్తగా వుండాలి.

లేకపోతే తరువాత బాధపడవలసింది మనమే, నరకం అనుభవించవలసింది మనమే. పాపాలు చేసేవారు ఎంత సంపాదించినా, ఎన్ని సంపదలు వున్నా వ్యర్థమేనని తెలుసుకోవాలి.

కర్మ సిద్ధాంతం గురించిపై వారందరూ ఇచ్చిన సందేశాన్ని బట్టి మనం కొన్ని విషయాలు తెలుసుకోవచ్చు.

## కర్మలు ఎప్పుడు అనుభవిస్తాం?

**ముఖ్యంగా గతంలో చేసిన కర్మల ఫలితం ప్రస్తుతం అనుభవిస్తూ వుంటాం. అలాగే ప్రస్తుతం చేసే కర్మల ఫలితం భవిష్యత్తులో అనుభవించ వలసి వుంటుంది.**

ఇక్కడ గతం అంటే ఈ జన్మలో అప్పటి దాకా గడిచిన జీవితం అవ్వవచ్చు, గత జన్మ కావచ్చు, గత జన్మలు కూడా వారి గతం క్రిందకే వస్తుంది. అంటే గత జన్మలోనివే కాదు అంతకు ముందు జన్మలలో చేసిన కర్మలు కూడా ప్రస్తుతం అనుభవిస్తూ వుండవచ్చు, అనుభవించే అవకాశం వుంది.

చాలా మంది అభిప్రాయమేమిటంటే గత జన్మని బట్టే ఈ జన్మ వుంటుంది అనుకుంటారు. కానీ గత జన్మే కాదు. అంతకు ముందు జన్మలను బట్టి కూడా ఈ జన్మ ఆధారపడి వుండవచ్చు. అంతేకాదు గతం అంటే ఈ జన్మలో చేసిన కర్మలు కూడా ఈ జన్మలోనే అనుభవించే అవకాశం వుంది. కానీ ఎప్పుడు ఏది అనుభవించాలో! ఏది అనుభవిస్తున్నామో! అంతా సృష్టి నిర్ణయం ప్రకారం ఆధారపడి వుంది. ఏది ఏమైనా గతంలోనివే ప్రస్తుతం అనుభవిస్తాం.

అలాగే భవిష్యత్తు అంటే ఈ జన్మలో మిగిలి వున్న జీవితం కావచ్చు, రాబోయే జన్మ కావచ్చు, లేకపోతే రాబోయే జన్మలు కావచ్చు. ఇదంతా వారి భవిష్యత్తే. అందుచేత ప్రస్తుతం చేసే కర్మల ఫలితం భవిష్యత్తులో అనుభవించడమంటే! రాబోయే జన్మలో కాని, అలాగే వచ్చే జన్మలలో కానీ అలాగే ఈ జన్మలో కూడా అనుభవించే అవకాశం వుంది.

చూడండి కొన్ని మొక్కలు, పాదులు కొన్ని రోజులలోనే కాపుకు వస్తాయి, ఫలసాయం ఇస్తాయి (బీర, బెండ లాంటివి), కొన్ని మొక్కలు, కొన్ని నెలల్లో ఫలసాయం ఇస్తాయి. (వరి, గోధుమ లాంటివి) కొన్ని వృక్షాలు ఫలసాయం ఇవ్వడానికి కొన్ని సంవత్సరాలు కూడా పడతాయి. (కొబ్బరి, మామిడి లాంటివి). అలాగే మనం చేసే కర్మలు కూడా ఎప్పుడైనా అనుభవించే అవకాశం వుంది.

కానీ కొన్ని కర్మలకు చేసిన వెంటనే కూడా ఫలితం కనిపిస్తుంది. ఉదాహరణకు దారిని పోయే వాడిని కానీ, మీ ప్రక్కన వున్న వాడిని ఎవడినైనా కొట్టండి. వెంటనే వాడు తిరిగి మిమ్మల్ని కొడతాడు. తిట్టండి తిరిగి వాడు మిమ్మల్ని తిడతాడు. మెడలో గొలుసు కానీ, జేబులో పర్సు కానీ దొంగిలించండి. పట్టుకుని దేహశుద్ధి చేస్తారు. అంటే వెంటనే ఫలితం కనిపించింది కదా? అలాగే కొన్ని కర్మలు ఈ జన్మలోనే అనుభవించవచ్చు. లేక రాబోయే జన్మలలో కూడా అనుభవించవచ్చు. ఇక్కడ ఇదమిద్ధంగా ఎప్పుడు అన్నది మనం స్పష్టంగా చెప్పలేం.

అందుకే పత్రీజీ **"మనం చేసే ఏ రకమైన కర్మకైనా సమయ సందర్భానుసారంగా ఆ కర్మకు తగిన ప్రతి ఫలానికి కచ్చితంగా దారి తీస్తుంది"** అని చెప్పారు.

అంటే ఎప్పుడైనా అని అర్థం.

మరి ఎప్పుడు అనుభవిస్తాం అన్నది సృష్టి నిర్ణయం మీద ఆధారపడి వుంటుంది. అంటే చేసిన కర్మకు ఎవరు? ఎప్పుడు? ఎలా అనుభవించాలో నిర్ణయించేది సృష్టి. అంటే ప్రకృతి అంటే భగవంతుడు.

చాలా మందిలో వున్న అపోహ ఏమిటంటే "ఈ జన్మలో చేసుకున్నవి ఈ జన్మలో అనుభవించమేమో అనుకుంటారు. ఈ జన్మలో చేసుకున్న కర్మల ఫలితాలు వచ్చే జన్మలోనే అనుభవిస్తామని అనుకుంటారు".

అందుచేత తప్పులు, పాపాలు చేసే వారు, మాంసం తిని హింసకు కారకులయ్యే వారు ఏమని అంటారంటే అసలు జన్మలు వున్నాయో? లేదో? చనిపోయిన తరువాత మనం వుంటామో? వుండమో? ఎప్పుడో, ఏదో

జన్మలో అనుభవిస్తామని ఇప్పుడు సరదాలు వదులుకోవడమెందుకు? అనుభవించేది మానడమెందుకు? వున్నప్పుడే, అవకాశం వున్నప్పుడే అనుభవించాలి. సరదాలు తీర్చుకోవాలి. అంతేకానీ పాపం... పాపం... అంటూ అన్నీ త్యాగం చెయ్యడమెందుకు? ఏదైనా అయితే అప్పుడే చూసుకుందాం. ఇప్పుడు బాగానే వున్నాం కదా? ఇంకా జన్మలు వున్నాయని ఎవరు చెప్పగలరు? ఎలా చెప్పగలరు? అయినా అపుడు మనం వుండం కదా? దాని గురించి అనవసరంగా ఆలోచించడం ఎందుకు? వచ్చే జన్మలో అనుభవించే దాని గురించి ఇప్పుడే ఆలోచించడమెందుకు? హాయిగా వున్నప్పుడే అనుభవించేస్తే పోలా? అంటారు.

అంటే చేసిన కర్మలకు ఫలితం ఈ జన్మలో అనుభవించమనే వారి ఉద్దేశ్యం. **"కానీ తెలుసుకోవలసిందేమిటంటే గత జన్మలలోవే కాదు. చేసిన కర్మలు ఎక్కువ శాతం ఈ జన్మలోనే అనుభవించే అవకాశం వుంది".** అందుచేత ఈ జన్మలో చేసినవి వచ్చే జన్మలోనే అనుకోకండి. అలా అనుకుని పాపాలు చేస్తే ఈ జన్మలో మీ భవిష్యత్తు అంటే వార్ధక్య జీవితం అంటే ముసలితనం అంతా నరకప్రాయమవుతుంది.

అందుకే శాస్త్రాలలో "పాపి చిరాయువు" అని చెప్పబడింది.

అంటే పాపాలు చేసిన వారుఎక్కువ కాలం బ్రతుకుతారని అర్థం. కారణం యవ్వనంలో, యవ్వన గర్వంతో చేసిన లెక్కలేనన్ని పాపాలు అనుభవించాలంటే ఎక్కువ కాలం బతకాలి కదా? అందుచేత ఎంత ముసలివారైనా చావు రాదు. పైగా అన్నీ కష్టాలే, ఎన్నో రకాల రోగాలు, ఎన్నో సమస్యలు. ఎలాంటి పరిస్థితి అంటే తమ పని తాము చేసుకోలేరు, పిల్లల మీద ఆధారపడాలి. వారు సరిగ్గా చూస్తారా? అంటే అదీ కనిపించదు? అన్నీ చీత్కారాలే. ఒక ప్రక్క రోగ బాధ మరొక ప్రక్క ఎవ్వరూ పట్టించుకోవట్లేదనే బాధ, అలా నరకం అనుభవిస్తూ, మంచం మీద పడి తీసుకుని... తీసుకుని... అందరినీ పీడించి... పీడించి... ఎప్పటికో చస్తారు.

## వృద్ధాప్యంలోనే ఎక్కువ కష్టాలు ఎందుకు వస్తాయి?

గమనిస్తే ఎవరికైనా యవ్వనంలో కంటే వార్థక్యంలోనే ఎక్కువ



రకరకాల సమస్యలు వస్తాయి. సహజంగా అంతా వయస్సు పెరిగే కొద్దీ కష్టాలు, రోగాలు వస్తుంటే ఏమనుకుంటారంటే వయస్సు పెరుగుతుంది కదా? అందుకే రోగాలు వస్తున్నాయేమో అనుకుంటారు.

కానీ దీనంతటికీ కారణం ప్రకృతిలో వున్న ఏర్పాటే! అవి ఏమిటంటే

(1) "పాపం చేసిన వెంటనే శిక్ష పడదు అంటే కష్టం రాదు" కానీ ఆ పాపం పండినప్పుడు మాత్రమే శిక్ష పడుతుంది అంటే కష్టం వస్తుంది.

(2) ప్రారబ్ద కర్మలు అంటే ఈ జన్మలో అనుభవించటానికి తెచ్చుకున్న కర్మలు ఎక్కువగా వృద్ధాప్యంలో అనుభవించే ఏర్పాటు వుండటం వల్ల.

(1) చూడండి చెట్టుకు కాసిన కాయ వెంటనే రాలదు. అది చెట్టు నుండి రాలాలంటే కొంత సమయం పడుతుంది. ఆ కాయ బాగా తయారై బాగా పండాలి. అలా బాగా పండినప్పుడే అది చెట్టు నుండి రాలుతుంది. అలాగే మానవులు చేసిన పాపాలకు వెంటనే శిక్ష పడదు. అంటే కష్టం రాదు. కారణం పాపం పండలేదు కాబట్టి. పాపం పండటానికి కొంత సమయం పడుతుంది.

ఒక రకంగా యవ్వనంలో చేసిన పాపాలు పండటానికి వృద్ధాప్యం రావలసి వుంటుంది.

సృష్టిలో వున్న ఈ ఏర్పాటు అర్థం కాక యవ్వనంలో వున్నవారు తమ జీవితం ఎప్పుడూ ఇలాగే వుంటుందని భావిస్తూ, యవ్వన గర్వంతో, ఎవరు ఏమి చెప్పినా వినరు, లెఖ్ఖ చెయ్యరు. తమకు ఇష్టం వచ్చినట్టుగా, తమకు నచ్చినట్టుగా జీవిస్తారు. అంటే ఇష్టమైన పనులు చేస్తారు. నచ్చినట్టుగా ప్రవర్తిస్తారు. తాము చేసే పనులు భవిష్యత్తులో తమకు నష్టాన్ని కలిగిస్తాయా? కష్టాలు తెస్తాయా? అన్న విషయం ఆలోచించరు. అది

పాపమా? కాదా? అన్నది కూడా ఆలోచించరు. సుఖభ్రాంతితో చేయకూడని పనులు, పాపాలు చేసేస్తూంటారు.

ప్రకృతి నియమాలు, ధర్మాలు పట్టించుకోరు. ప్రకృతిలో ఇవ్వబడిన అవకాశాన్ని అర్థం చేసుకోరు. పాపాలు చేసి వృద్ధాప్యంలో బాధపడతారు.

ఈ ఏర్పాటులోని అంతరార్థం ఏమిటంటే తప్పు చేసిన వారికి అవకాశం ఇవ్వడమే! తమ తప్పు తెలుసుకుని, సరి చేసుకునే అవకాశమే ఇది. ఎంత అవకాశం ఇచ్చినా అర్థం చేసుకోకపోతే ఎదుట వారి బాధ అర్థం చేసుకోకపోతే శిక్ష ద్వారా అవతల వారి భాధ ఎలా వుంటుందో అనుభవం ద్వారా ప్రకృతి తెలియ పరుస్తుంది. ఆ అవకాశాన్నే పాపం పండటం అంటారు.

చూడండి మన పిల్లలు తప్పు చేస్తే మొదట వూరుకుంటాం. అదే తప్పు మరల చేస్తే హెచ్చరిస్తాం. మరల చేస్తే తిడతాం. ఎంత చెప్పినా వినకపోతే గట్టిగా దండిస్తాం, తెలిసేలా బుద్ధి చెబుతాం. అలాగే ప్రకృతి కూడా మనకు అవకాశం ఇస్తుంది. ఎన్ని రకాలుగా అవకాశం ఇచ్చినా పాపం చెయ్యడం మానకపోతే చివరకు శిక్ష వేస్తుంది. ఇది కూడా పాపం పండటమే అంటారు.

ప్రకృతిలో అలా అవకాశం ఇవ్వడమే కాదు యవ్వనంలో చేసే తప్పులు, పాపాలు తెలియ చెప్పటానికి కొన్ని ఏర్పాట్లు వున్నాయి. అలా పెద్దలు, పండితులు, వేదాంతుల ఉపన్యాసాల ద్వారా తెలియ చెప్పబడుతుంది. అలాగే గురువులు, మనమనుకునే దేవుళ్ళ బోధల ద్వారా తెలియ చేయబడుతుంది. అలా భగవద్గీత ద్వారా శ్రీ కృష్ణుల వారు, బైబిలు ద్వారా జీసస్, ఖుర్‌ఆన్ ద్వారా మహమ్మద్ ప్రవక్త, గురుగ్రంథ్ సాహెబ్ ద్వారా గురునానక్ అలా అనేక మంది తమ బోధల ద్వారా ఈ కర్మ సిద్ధాంతం గురించి చెప్పడమే కాకుండా ఎలా జీవించాలి? ఏ పనులు చెయ్యాలి? ఏ పనులు చెయ్యకూడదు? ఏవి పాపాలు? ఏవి పుణ్యాలు? అన్నవి కూడా చెప్పడం జరిగింది.

ఈ రకంగా కూడా సృష్టిలో మానవులు తమ తప్పులు, పాపాలు

సరి చేసుకునే అవకాశం ఇవ్వబడింది. అయినా మారకపోతే పాపాలు మానకపోతే శిక్షలు పడతాయి.

ప్రకృతిలో మరొక ఏర్పాటు కూడా వుంది. ఇంతమంది చెప్పినా అర్థం కాకపోతే ప్రత్యక్షంగా శిక్షలు అంటే కష్టాలు, రోగాలు అనుభవిస్తున్న పెద్దలు, వృద్ధులను చూసైనా తెలుసుకోవాలి. అరె వారికి అటువంటి కష్టాలు? అలాంటి రోగాలు? మాకు లేవు వారికి ఎందుకు వచ్చాయి? అసలు వారు ఏం చేశారు? ఏమీ చెయ్యకుండానే ఈ కష్టాలు వచ్చాయా? ఈ లోకంలో వయస్సు పెరిగితే వూరికే కష్టాలు వచ్చేస్తాయా? అంటే వయస్సు పెరగడమే పాపమా? లేక పాపాలు చెయ్యడమే కారణమా? అన్నది ఆలోచించాలి. సృష్టిలోని ధర్మ సూక్ష్మాలు తెలుసుకోవాలి. తాను చేసే తప్పులు, పాపాలు తెలుసుకోవాలి. వాటిని సరి చేసుకోవాలి.

సృష్టిలో మన తప్పులు, పాపాలు తెలుసుకోవటానికి ఇన్ని రకాల ఏర్పాట్లు వున్నాయి. అవకాశాలు ఇవ్వబడుతున్నాయి. ఇన్ని రకాల అవకాశాలు ఇవ్వబడినా తెలుసుకోలేకపోతే, లెక్క చేయకపోతే చివరకు ప్రకృతి శిక్ష వేస్తుంది. వెరశి వీటన్నిటిని కలిపి పాపం పండటం అంటారు.

అలా శిక్ష పడినా ప్రవర్తన మారకపోతే, పాపాలు కొనసాగిస్తే ఇంకా కఠినమైన శిక్ష పడుతుంది. ఏది ఏమైనా ప్రకృతి ప్రతి ఒక్కరి చేత ఆలోచింప చేస్తుంది. ఆలోచన ద్వారా కానీ, అనుభవం ద్వారా కానీ ప్రతి ఒక్కరిలో మార్పు తీసుకువస్తుంది. తనకు తాను మారేలా చేస్తుంది. పాపాలు మాన్పిస్తుంది.

ఎందుచేతనంటే తెచ్చుకున్న ప్రారబ్ద కర్మలు యవ్వనంలో కాకుండా వృద్ధాప్యంలోనే అనుభవించే ఏర్పాటు వుంది. మరీ పాపపంకిలమైన జీవితం అయితే తప్ప. అంటే గతంలో మరీ ఎక్కువగా పాపాలు చేసి వుంటే తప్ప, యవ్వనంలో ఎవరికి పెద్దగా కష్టాలు వుండవు. కారణం చేసిన కర్మలు చిన్ననాటి నుంచే అనుభవించవలసి వస్తే ఇక జీవితంలో మాధుర్యం ఏమి వుంటుంది? జీవితంపై ఆసక్తి ఏమి వుంటుంది? ఎన్ని వున్నా జీవితంలో అనుభవించేది ఏమి వుంటుంది? యవ్వనంలోనే కష్టాలు వస్తే జీవితమంటేనే

విరక్తి కలుగుతుంది. ఆసక్తి వుండదు. ఎందుకు ఈ జీవితం? అనుకుంటూ నిరాశగా, నిర్లిప్తంగా జీవిస్తారు. ఆత్మహత్యలు కూడా చేసుకునే అవకాశం వుంది.

అందుకే వయస్సు పెరుగుతున్న కొద్దీ కష్టాలు ప్రారంభమవుతాయి. చివరి దశలో మరీ ఎక్కువ అవుతాయి. జీవిత మాధుర్యం అనుభవించిన తరువాత చివరి దశలో కర్మలు అను భవించి వెళ్ళిపోతారు. అందుకే ప్రకృతిలో ఈ ఏర్పాటు, ఈ వెసులుబాటు వుంది.

కానీ మానవులు ఇవేమి గమనించట్లేదు. పట్టించుకోవట్లేదు. వినడం లేదు, విన్నా ఆచరించడం లేదు. తప్పులు, పాపాలు చేస్తూనే వున్నారు. గొప్పవారి సందేశాలు పెడచెవిన పెడుతున్నారు. మరి కష్టాలు రాక ఏమవుతాయి? ఎంతసేపూ కష్టాలు వస్తే పూజలు, ప్రార్థనలు చేస్తున్నారు కానీ, పాపాలు చెయ్యడం మానటం లేదు. అలా యవ్వనంలో, యవ్వన గర్వంతో చేసిన పాపాలే వార్ధక్యంలో కష్టాలకు, రోగాలకు కారణం.

అలా వార్ధక్యంలో చేసిన పాపాలకు నరకం అనుభవిస్తున్నప్పుడు వారు చేసిన పాపాలన్నీ గుర్తుకు వస్తాయి. అపుడు అనుకుంటారు చేసిన కర్మలు ఎక్కడికి పోతాయి? అనుభవించవలసిందేగా? ఇప్పుడేం చేస్తాం? అపుడు చెపితే వినలేదు. ఆలోచించలేదు అని బాధపడుతూ విలపించవలసిందే తప్ప ఇక అప్పుడు చేయగలిగింది ఏమీ లేదు. అందుకే "చేతులు కాలాక ఆకులు పట్టుకుని ఏం లాభం?" అంటారు.

అందుచేత చేతులు కాలక ముందే అంటే కష్టాలు రాకముందే ఏదైనా ఆలోచించాలి కర్మ సిద్ధాంతం తెలుసుకోవాలి.

పాపాలు అనుభవించేటపుడు ఏమీ చెయ్యలేరు. అనుభవించడం తప్ప. అందుచేత పాపాలు చేసే ముందే ఆలోచించండి. పెద్దల మాట వినండి. భూమి మీదకు వచ్చిన దేవుళ్ళ మాట వినండి, జాగ్రత్తగా ఆలోచించండి. ఈ జన్మలో చేసిన కర్మలు కూడా ఈ జన్మలో అనుభవించే అవకాశం వుందని తెలుసుకోండి. పాప కర్మలు చెయ్యకండి. హింస చెయ్యకండి.

అలాగే ఇంకా కొంతమంది ఈ జన్మలో చేసిన కర్మలకు ఈ జన్మలో ఫలితం రాదేమో అనుకుంటూ మంచి పనులు చెయ్యటానికి, సత్కర్మలు చేయడానికి, సేవలు చెయ్యటానికి, మంచి కార్యక్రమాలకు ధన సహాయం చెయ్యటానికి వెనుకాడతారు. ఎంత చేసినా ఇప్పుడు ఫలితం రాని దానికి ఎందుకు అలాంటి పనులు చెయ్యాలి? అలాంటి పనులు చేసే బదులు ఆ డబ్బు ఎంచక్కా సరదాలకు ఖర్చు పెట్టుకోవచ్చు కదా? అనుకుంటారు.

అంతేకాదు చాలా మంది నేను ఎన్నో మంచి పనులు చేసాను అయితే మటుకు ప్రయోజనమేమిటి? నాకేం కలిసి రావట్లేదు. నా జీవితం ఏం బాగోలేదు, పైగా అన్నీ కష్టాలే! ఇంకా ఆ ప్రక్కవాడు చేసేవన్నీ తప్పుడు పనులు, పాపాలు... కానీ వాడి జీవితమే బాగుంది. వాడికి అన్నీ కలిసి వస్తున్నాయి అని అనేవారు కొంతమంది. అలాగే వచ్చే జన్మలలో ఏదో వస్తుందని ఇప్పుడు రాని దానికి ఎందుకు చెయ్యాలి? ఆ జన్మ వుందో? లేదో? ఎవరికి తెలుసు? ఎందుకు దాని గురించి ఆలోచించడం? అని మంచి చెయ్యగలిగినా, చేసే అవకాశం వున్నా కొంతమంది చెయ్యడం మానేస్తారు, చెయ్యరు కూడా.

ఇలా ఈ జన్మలో ఫలితం రాదనుకుంటూ కొంతమంది పాపాలు చేస్తుంటే! మరి కొంతమంది పుణ్యకార్యాలు మానేస్తున్నారు. ఇదంతా ఈ జన్మలో చేసిందానికి ఈ జన్మలో ఫలితం ఉండదనే అపోహ. కానీ తెలుసుకోండి. మనం చేసిన కర్మలలో ఎక్కువ శాతం ఈ జన్మలోనే అనుభవించవలసి వుంటుంది. అనుభవిస్తాం కూడా. అందుచేత పాపాలు చెయ్యకండి. మంచి కర్మలు చెయ్యండి.

## కర్మలలో రకాలు

కర్మలు 3 రకాలు. (1) వర్తమాన కర్మలు, (2) సంచిత కర్మలు, (3) ప్రారబ్ధ కర్మలు.

మానవుని జీవితం మొదటగా కర్మలు లేకుండా ప్రారంభ మవుతుంది. అంటే మొదట జన్మ తీసుకున్నప్పుడు అంటే మొట్టమొదటి సారిగా మానవుడిగా జన్మించినపుడు ఏ కర్మలు లేకుండా పుడతాడు. అప్పటి

నుంచి అతని కర్మచక్రం ప్రారంభమవుతుంది. అంటే అతనికి "కర్మ సిద్ధాంతం" వర్తిస్తూ వుంటుంది.

అలా ప్రారంభమైన జీవితంలో కర్మలు చేస్తూ వుంటాడు. అలా చేస్తూన్న కర్మలనే "వర్తమాన కర్మలు" లేక "ఆగామి కర్మలు" అంటారు. అలా ఆ జీవితంలో ఎన్నో కర్మలు చేస్తాడు.

అలా చేసిన కర్మలలో అనుభవించినవి అనుభవించగా మిగిలిన కర్మలు చనిపోయిన తరువాత వాడి పేరుతో వున్న ఒక ఖాతాలో పడతాయి. వాటినే "సంచిత కర్మలు" అంటారు.

మరల జన్మ తీసుకునేటపుడు ఈ సంచిత కర్మల నుంచి కొన్ని కర్మలు తీసుకుని మరల జన్మ తీసుకుంటాడు. అలా తీసుకున్న కర్మలనే "ప్రారబ్ధ కర్మలు" అంటారు. ఈ 'ప్రారబ్ధ కర్మలు' ఆ జన్మలో అనుభవిస్తూ మరల కొత్తగా వర్తమాన కర్మలు చేస్తూ వుంటాడు. అలా చేస్తూ వాటిలో కొన్ని అనుభవిస్తూ, చనిపోయినపుడు మిగిలిన వర్తమాన కర్మలు అంతకు ముందు నిల్వ వున్న సంచితంలో కలుపబడతాయి.

దానినే హిందూ పురాణాలలో 'చిత్రగుప్తుని చిట్టా' అంటారు. దానినే ఆధ్యాత్మికంగా "ఆకాశిక్ రికార్డ్సు" అంటారు. ఏదవుతే ప్రతి ఒక్కరు చేసిన ప్రతి కర్మ రికార్డు అవుతూ వుంటుంది.

అలా జన్మలు జరుగుతూ వుంటాయి. అలా ఎంతకాలం? అంటే వారి ఖాతాలో కర్మలు ఉన్నంతకాలం. కానీ ఇక్కడ గమనిస్తే చేసే కర్మలు ఎక్కువ వుంటాయి. అనుభవించే కర్మలు తక్కువ వుంటాయి... అలా జన్మ, జన్మకు కర్మలు పెరుగుతూనే వుంటాయి. కానీ తగ్గవు. అంటే సంచితం పెరుగుతూనే వుంటుంది.

ఇక్కడ మరల ఒక సందేహం వస్తుంది. ఇలా అవుతే ఈ జీవితానికి అంతం ఎప్పుడు? చూస్తుంటే కర్మలు పెరుగుతూనే వున్నాయి. ఎన్ని అనుభవించినా తరగట్లేదు కదా? మరి ఈ జీవితానికి అంతం ఎప్పుడు? ఇలా జన్మలు తీసుకుంటూ బాధలు అనుభవించవలసిందేనా? వేరే మార్గం లేదా? అనిపిస్తుంది.

కానీ దీనికి పరిష్కారం కర్మలు లేకుండా ప్రారంభమైన మానవ జీవితం కర్మలు లేకుండా చేసుకున్నప్పుడే అంతమవుతుంది. అంటే ఎలా ప్రారంభమయ్యిందో అలాగే అంతమవ్వాలి. ఇదే సృష్టిలోని ఏర్పాటు.

ఒకరకంగా "పుట్టేటప్పుడు ఎలా పుడతాడో"? అలాగే పోయేటప్పుడు కూడా అలా వెళతాడు. అంటే పుట్టేటప్పుడు ఏమీ తెచ్చుకోడు. అలాగే వెళ్ళేటపుడు కూడా ఏమీ పట్టుకెళ్ళడు. కారణం ఎలా వస్తాడో అలాగే వెళ్ళాలి. ఇది సృష్టిలోని ఏర్పాటు. అలాగే ఏ కర్మలు లేకుండా ఎలా జన్మ ప్రారంభిస్తాడో అలాగే జన్మ లేకుండా చేసుకోవాలంటే కర్మలు లేకుండా చేసుకోవాలి. మరి కర్మలు లేకుండా ఎలా చేసుకోగలం? కర్మలు ఎలా పోతాయి?

దానికి శ్రీ కృష్ణభగవానుడు మార్గం చూపించారు. ఆయన ఏమి చెప్పారంటే "జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం" అన్నారు. అంటే జ్ఞానమనే అగ్నిలోనే కర్మలన్నీ దగ్ధమవుతాయని చెప్పడం జరిగింది.

అంటే ఎవరయితే జ్ఞానాన్ని విశేషంగా సంపాదించుకుంటారో! అంటే అగ్నిలా ప్రజ్వరిల్ల చేసుకుంటారో! ఆ జ్ఞానమనే అగ్నిలోనే ఈ కర్మలన్నీ భస్మీపటలం అవుతాయి, వారు మోక్షాన్ని పొందుతారు, అంటే జన్మ లేకుండా చేసుకుంటారు. అప్పుడు వారు కర్మ సిద్ధాంతం నుంచి బయటపడినట్లే.

## కర్మలు ఎన్ని రకాలుగా విభజించవచ్చు?

మూడు రకాలుగా విభజించవచ్చు. (1) పాపకర్మలు, (2) పుణ్య కర్మలు, (3) ముక్తికర్మలు. వీటినే ఆత్మకర్మలు అంటారు.

పాప కర్మలు చేసిన వారు నరక లోకాలకు (అధో లోకాలకు) పోయి మరల భూమి మీదకు వస్తారు. దుఃఖాన్ని అనుభవిస్తారు.

అలాగే పుణ్య కర్మలు చేసిన వారు స్వర్గ లోకాలకు (ఊర్ధ్వ లోకాలకు) పోయి మరల భూమి మీదకు వస్తారు. భోగాలు అనుభవిస్తారు.

అలాగే ముక్తి కర్మలు, అంటే ఆత్మకర్మలు అంటే ఆత్మ ఉన్నతికి సంబంధించిన కర్మలు ఆత్మజ్ఞానానికి సంబంధించిన కర్మలు అంటే (1)ధ్యానసాధన, (2) స్వాధ్యాయం, (3) జ్ఞానుల సాంగత్యం చేసిన వారు

జ్ఞానవంతులై కర్మలన్నీ దగ్ధం చేసుకుని ముక్తిని పొందుతారు.

## పుణ్యం చేస్తే పాపం పోతుందా?

చాలా మంది పుణ్యం చేస్తే పాపం పోతుందనుకుంటారు. అందుచేత పాపాలు పోవడానికి పుణ్యకర్మలు చేస్తూ వుంటారు. కానీ తెలుసుకోవలసింది ఏమిటంటే... పుణ్య కర్మలు చేసినంత మాత్రాన పాప కర్మలు పోవు. కారణం సృష్టిలో దేని ఫలితం దానిదే. పుణ్యం చేస్తే భోగం అంటే సుఖం అనుభవిస్తారు. అలాగే పాపం చేస్తే దుఃఖం అంటే కష్టాలు అనుభవిస్తారు. రెండూ చేస్తే సుఖంతో పాటు దుఃఖం కూడా అనుభవిస్తారు.

ఉదాహరణకు ఒకడు అన్నీ పుణ్య కర్మలే చేసాడని అనుకుందాం. అటువంటి వారికి జీవితంలో అంతా భోగమే వుంటుంది. సుఖ సంతోషాలతో జీవిస్తారు, ఎటువంటి కష్టాలు రావు.

అలాగే ఇంకొకడు పుణ్య కర్మలు, పాపకర్మలు రెండూ చేసాడు అనుకుందాం. పాప కర్మ ఫలితంగా యాక్సిడెంట్‌లో ఒళ్ళు కాలడం, చేతులు, కాళ్ళు విరగడం, కరెంటు షాకు వల్ల అవయవాలు కాలడం లాంటివి జరిగి వైద్యం కోసం హాస్పటల్‌లో చేరి వైద్యం పొందుతాడు. కానీ వాడు పుణ్యం కూడా చేయడం వల్ల ధనం బాగా వుటుంది. అందువల్ల సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌లో ఎ/సి రూములో వైద్యం చేయించుకుంటాడు. అంటే ఇక్కడ భోగంతో పాటు రోగం అనుభవిస్తాడు. కారణం పుణ్యం, పాపం రెండూ చేయడం వల్ల.

కానీ ఇంకొకడు పాప కర్మలే చేసాడు అనుకుందాం. వీడు కూడా ప్రమాదం జరిగి హాస్పటల్‌లో జాయిన్ అవుతాడు. కానీ వీడికి ధనం లేకపోవడం వల్ల జనరల్ హాస్పటల్‌లో వైద్యం చేయించుకుని జనరల్ వార్డులో కామన్ బెడ్ మీద వుండవలసి వస్తుంది. అంటే ఇక్కడ రోగం వుంది కానీ భోగం లేదు. కారణం పాపాలే చేసాడు, పుణ్యం చేయలేదు కాబట్టి.

మనకి లోకంలో రెండు రకాల వాళ్ళు కనిపిస్తారు. పుణ్యం, పాపం రెండూ చేసి భోగంతో రోగం అనుభవించేవారు, అలాగే పుణ్యం చెయ్య

కుండా పాపాలే చేయడం వల్ల భోగం లేకుండా రోగం మాత్రమే అనుభవిస్తున్న వారు.

అందుకే లోకంలో ధనవంతులు కూడా కష్టాలు అనుభవించడం చూస్తున్నాం. నిజంగా వారి పుణ్యంతో పాపాలే పోయి వుంటే ధనవంతులకు కష్టాలు ఎందుకు వస్తాయి? అందుచేత ఏ కర్మ ఫలితం దానిదే అని తెలుసుకోవాలి.

## మరి పాపాలు ఎలాపోతాయి?

పాపాలు పోయే మార్గం శ్రీ కృష్ణ భగవానుడు చెప్పడం జరిగింది. ఆయన ఏమన్నారంటే జ్ఞానాగ్నిలోనే పాప కర్మలన్నీ దగ్ధమవుతాయి అని చెప్పడం జరిగింది.

**శ్లో॥ అపి చేదసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః ।**
**సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సంతరిష్యసి ॥ (భ.గీ.4-36)**

తా:- నువ్వు పాపాత్ములందరి కంటే మహాపాపాత్ముడవైనా అంటే సముద్రమంతటి పాపాలు చేసినా ఆ పాప సముద్రాన్ని ఒక్క జ్ఞానమనే తెప్పతో దాటి వేయగలవు అన్నారు.

అందుచేత పాప కర్మలు పోవాలంటే పుణ్యకర్మలు చెయ్యడం కాదు జ్ఞానం సంపాదించుకోవాలి. ఈ విషయాన్నే పత్రీజీ కూడా చెప్పడం జరిగింది.

### గతం..అవగతం...విగతం

పత్రీజీ చెప్పిదేమిటంటే గతమన్నది అవగతమవుతే విగతమవుతుంది.

అంటే గతంలో చేసిన పాపాలు అవగతమవుతే అంటే అర్థమవుతే అవి విగతమవుతాయి, అంటే తొలగిపోతాయి, రద్దు అవుతాయని అర్థం.

ఇక్కడ మనం రాధాస్వామి వారు చెప్పిన సందేశాన్ని గుర్తు చేసుకోవాలి. ఆయన ఏమన్నారంటే "ఏ ఏ కర్మలు చేస్తావో ఆయా అనుభవాలు పొందవలసి వుంటుంది".

చూడండి హింస చేస్తాడు అంటే ఒకరి కాలు తీసాడు, చెయ్యి నరికాడు, ఏసిడ్ పోసాడు పేదవాడిని అవమానించాడు, తక్కువ కులమని చులకనగా చూసాడు, మోసగించాడు. నష్టపరిచాడు. దొంగిలించాడు. జీవులను, ప్రాణులను హింసించాడు. ఇవన్నీ ఎందుకు చేసాడు? వారి యొక్క, వాటి యొక్క బాధ ఎలా వుంటుందో? వారు ఎంత బాధపడతారో? తెలియదు కాబట్టే, ఆ తప్పు చేసాడు, ఆ పాపం చేసాడు.

అందుచేత భవిష్యత్తులో వీడికి అలాంటి పరిస్థితి ఏర్పడితే అంటే అదే కష్టం తాను అనుభవిస్తే ఆ బాధ ఎలా వుంటుందో స్వయంగా అనుభవ పూర్వకంగా తెలుసుకుంటాడు. అంటే అనుభవంలోకి వస్తుంది. అప్పుడు ఎదుటి వాడి బాధ ఎలాంటిదో అర్థమవుతుంది. అమ్మో! వాడిని అంత బాధపెట్టానా? వాడు ఎంత బాధపడ్డాడో? ఆ జీవి ఎంత బాధపడిందో? నా వల్ల వాటికి ఎంత కష్టం కలిగింది? ఎంత తప్పు చేసాను? ఇక నేను అలాంటి తప్పు చెయ్యకూడదు. అలాంటి పాపం ఇక చెయ్యను అని నిర్ణయించుకుంటాడు.

ఆ తప్పు, ఆ పాపం మరల చెయ్యడు, చెయ్యమన్నా చెయ్యడు. ఎన్ని ప్రలోభాలు పెట్టినా! ఎంత కోపం వచ్చినా! ఎటువంటి పరిస్థితులు ఎదురైనా! తనకు ఎంత నష్టం జరిగినా! కష్టం కలిగినా! మరల అలాంటి తప్పు చెయ్యడు. కారణం తన తప్పును అనుభవం ద్వారా తెలుసుకున్నాడు కాబట్టి. అంటే అవగతమైనది కాబట్టి. అంటే అర్థం చేసుకున్నాడు కాబట్టి.

ఇప్పుడు వాడికి ఈ అనుభవం వల్ల ఆ తప్పు చెయ్యకూడదన్న పాపం చెయ్యకూడదు అన్న జ్ఞానం కలిగింది. ఈ జ్ఞానం స్వయంగా అనుభవించడం ద్వారా పొందాడు. అందుకే పత్రీజీ “అనుభవమే జ్ఞానం” అంటారు. అటువంటి అనుభవ జ్ఞానమే ఆచరణలోకి వస్తుంది. ఇక ఆ తప్పు, ఆ పాపం భవిష్యత్తులో, భవిష్యత్తు జన్మలలో చెయ్యమన్నా చెయ్యడు. పైగా మిగిలిన వారికి ఆ తప్పు చెయ్యవద్దని కూడా చెపుతాడు.

అంతే కానీ వూరికే నోటితో చెపితే వింటారా? అంటే వినరు. తప్పులు మానేస్తారా? అంటే మానరు, అలా హింస చేస్తూనే వుంటారు.

కానీ ఏ ఏ అనుభవాలు పొందుతాడో అవి మటుకు మరల చెయ్యడు. అందుచేత అనుభవ జ్ఞానమే ఆచరణలోకి వస్తుందని తెలుసుకోవాలి.

ఈ సృష్టి అంటే ప్రకృతి అంటే భగవంతుడు అలా ప్రతి ఒక్కరికి అనుభవాల ద్వారా పాఠాలు నేర్పుతుంది. సరైన మార్గంలో, మంచి మార్గంలో పెడుతుంది. మెల్లిగా అందరిలోను మార్పు తీసుకు వస్తుంది. అలా ఒక్కొక్క జన్మలో కష్టాలు ద్వారా కొన్ని అనుభవాలు పొంది కొన్ని పాఠాలు నేర్చుకుంటాడు. తాను చేసే తప్పులు సరి చేసుకుంటాడు. అలా మొత్తం తప్పులు సరి చేసుకోవటానికి ప్రతి ఒక్కరూ సుమారు 400 నుంచి 500 జన్మలు తీసుకుంటారని పత్రీజీ చెపుతూ వుంటారు.

దీనిని బట్టి మనకు అర్థమయ్యేదేమిటంటే జీవితంలో కష్టాలన్నీ కూడా పాఠాలు నేర్చుకోవడానికే, చేస్తున్న తప్పులు సరి చేసుకోవటానికే, మార్పు చెందటానికే, మారటానికే, అని తెలుసుకోవాలి. మరి ఇలాంటి మార్పు రావాలంటే ప్రతి ఒక్కరు కర్మలు చేస్తూనే వుండాలి. అవి పాప కర్మలైనా సరే. అందుకే శ్రీ కృష్ణ భగవానుడు **"మాతే సంగోస్త్వకర్మణి" (భ.గీ.2-47)** అన్నారు. అంటే "కర్మలు చెయ్యటం మానవద్దు అన్నారు.

అందుచేత కష్టాలకు బాధపడకండి. ప్రతి కష్టం నుండి పాఠం నేర్చుకోవడానికి ప్రయత్నించండి. మరల ఆ తప్పు, ఆ పాపం చెయ్యకండి.

అలా ఎవరైతే అనుభవం ద్వారా పొందిన జ్ఞానంతో ఏ తప్పులు, పాపాలు అర్థం చేసుకుని అంటే అవగతం చేసుకుని ఆ పాప కర్మలు ఇక చెయ్యరో! వారు గతంలో చేసిన అలాంటి పాప కర్మలు ఏమైనా వుంటే అవన్నీ విగతమైపోతాయి. అంటే దగ్ధమైపోతాయి. అంటే రద్దు చేయబడతాయి. అంటే అటువంటి పాపకర్మలు ఇక అనుభవించ వలసిన అవసరం వుండదు.

అందుకే గీతలో "జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం" అంటే జ్ఞానమనే అగ్నిలోనే కర్మలన్నీ దగ్ధమవుతాయి అని చెప్పబడింది.

అంటే ఎటువంటి తప్పులు సరి చేసుకుంటామో, మరల చెయ్యమో అలాంటి కష్టాలు మనం ఇక అనుభవించవలసిన అవసరం వుండదు.

అంటే అటువంటి కష్టాలు ఇక రావని తెలుసుకోవాలి.

అందుకే పత్రీజీ "గతం అవగతమవుతే విగతమవుతుందని" చెప్పడం జరిగింది. ఒకవేళ మనం గతంలో చేసిన పాపాలు అవగతం చేసుకోకపోతే పాపాలు మరల, మరల చేస్తుంటే మనం అవగతం చేసుకోనట్టే. అటువంటి వారికి కష్టాలు అలా వస్తూనే వుంటాయి.

అందుచేత 'జ్ఞానం' సంపాదించుకుని పాప కర్మల నుండి బయటపడండి.

## మంచి పనులు చేస్తున్నా కష్టాలు ఎందుకు వస్తాయి?

చాలా మంది బాధపడుతూ వుంటారు. నేను ఇన్ని మంచి పనులు చేస్తున్నాను. ఇంత మంచిగా వుంటున్నాను. అయినా నాకు ఇన్ని కష్టాలేమిటి? భగవంతుడు నన్ను ఎందుకు కష్టాలు పెడుతున్నాడు? ప్రక్కవాడు ఎన్నో తప్పులు, పాపాలు చేస్తున్నాడు అయినా వాడి జీవితం చాలా బాగుంది, వాడికి అన్నీ లాభాలే, వాడికి అంతా మంచే జరుగుతుంది. అసలు దేవుడు వున్నాడా? వుంటే ఇలా ఎందుకు జరుగుతుంది? అని సందేహిస్తూ వుంటారు. ఇది వారికి అసలు అర్థం కాదు. అందుచేత చిన్ననాటి నుంచి ఎంతో ఇష్టంగా నమ్మిన దేవుడిని కూడా నిందిస్తూ వుంటారు. దేవుళ్ళను మతాలను మారుస్తూ వుంటారు.

దీనికి కారణం విత్తనం నాటిన వెంటనే పంట రాదు కదా? దానికి కొంత సమయం పడుతుంది. అలాగే గతంలో చేసుకున్న కర్మల ఫలితం ప్రస్తుతం అనుభవిస్తుంటారు. అలాగే ప్రస్తుతం చేసే కర్మల ఫలితాలు భవిష్యత్తులో అనుభవిస్తారు.

ఈ విషయాన్నే "మహమ్మద్ ప్రవక్త" చెప్పడం జరిగింది. ఆయన ఏమన్నారంటే "రేపటి కోసం (వచ్చే జన్మ) నేడు పంట పండించే పొలమే ఈ లోకం" అన్నారు.

భవిష్యత్తు అవసరాల కోసం ప్రస్తుతం పంట ఎలా వేసుకుంటామో, భవిష్యత్ కోసం అంటే తరువాతి జీవితం కోసం కర్మలు చేస్తూ వుంటాం.

అందుచేత గతంలో చేసుకున్న పాపాల ఫలితం ప్రస్తుతం

అనుభవిస్తూ వుండటం వల్ల ప్రస్తుతం మంచి పనులు చేస్తున్నా కష్టాలు వస్తున్నట్లుగా అనిపిస్తుంది. కానీ ప్రస్తుతం చేసే మంచి పనుల ఫలితం భవిష్యత్తులో తప్పనిసరిగా అనుభవిస్తారు.

అలాగే చెడు పనులు చేస్తున్న వాడికి మంచి జరుగుతుందంటే వారు గత జన్మలో చేసుకున్న పుణ్యమే కారణం కానీ వారు ప్రస్తుతం చేసే చెడు పనుల ఫలితం తప్పనిసరిగా భవిష్యత్తులో అనుభవించవలసిందే. సృష్టిలోని ఈ ఏర్పాటు అర్థం కాక చాలామంది అలా బాధపడుతూంటారు.

అందుకే శ్రీ రామకృష్ణ పరమహంస "మనం ఏ కర్మ చేస్తే ఆ ఫలితం అనుభవించి తీరాలి" అన్నారు.

## కర్మల విషయంలో భావానిదే ప్రముఖ పాత్ర

కర్మలు చేసేటపుడు ఈ విషయం కూడా గుర్తుంచుకోవాలి. కారణం చేసే కర్మ కంటే ఆ కర్మ చేయడానికి వారి భావమేమిటి? అంటే ఉద్దేశ్యమేమిటి? అన్నదే ఈ సృష్టిలో లెక్కించబడుతుంది.

ఉదాహరణకు పైకి వారు చేసేది మంచి పనిగానే కనిపిస్తుంది. కానీ లోపల ఉద్దేశ్యం మటుకు వేరుగా వుంటుంది, దురుద్దేశ్యంతో కూడుకుని వుంటుంది, స్వార్ధ పూరితంగా వుంటుంది, కల్మష భావంతో ఆ పని చేస్తారు.

పైకి వారి మంచి కోరుతున్నట్టుగా, వారికి మంచి చేస్తున్నట్టుగా కనిపిస్తారు. కానీ లోపల గోతులు తవ్వుతూ వుంటారు. వారికి చెడు జరగాలనే ఉద్దేశ్యంతోటే వారితో మంచిగా ప్రవర్తిస్తారు, మంచి చేస్తున్నట్టుగా కనిపిస్తారు. అటువంటి వారిని నమ్మి మోసపోయిన వారు వున్నారు, చాలా మంది నష్టపోయిన వారు వున్నారు, కష్టాల పాలయిన వారు కూడా వున్నారు.

లోకంలో ఒకరి భావం ఇంకొకరికి తెలియకపోవచ్చు. కానీ అందరిభావాలు లోకేశుడు అంటే సృష్టి కర్త అంటే భగవంతుడికి తెలుసు. ఆయన ఎవరు, ఏ భావంతో కర్మలు చేస్తున్నారో తెలుసుకోగలడు. తెలుసుకుంటున్నాడు కూడా. ఆయన "సర్వాంతర్యామి"అంటే సర్వజీవుల అంతరంలో వ్యాపించి వున్నాడని అర్థం. అలా అందరి అంతరాలలో వుంటూ అందరూ చేసే పనులను తెలుసుకుంటున్నాడు, దానితో పాటు

లోపల వున్న వారి మనస్సులలోని భావాలు కూడా తెలుసుకుంటున్నాడు. తెలుసుకోవడమే కాదు పనులు, పనులతో పాటు భావం కూడా రికార్డు చేసుకుంటున్నాడు. చేసుకోవడమే కాదు, భావాన్ని బట్టే ఫలితం ఇవ్వడం జరుగుతుంది. కారణం భావాన్ని బట్టే పనులు వుంటాయి కాబట్టి. అంటే మనస్సు ఎలా చెపితే శరీరం ఇంద్రియాలు అలా పని చేస్తాయి కాబట్టి కర్మల విషయంలో భావానిదే ప్రముఖ పాత్ర.

భగవంతుడు భావానికే ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తాడు. కాబట్టి భగవంతుణ్ణి "భావప్రియుడు" అంటారు. అందుచేత భగవంతుడు "బాహ్య ప్రియుడు" కాదు "భావ ప్రియుడు" అని చెపుతారు, అంటే ఆయన బాహ్య చేష్టలను పట్టించుకోడు. ఆ చేష్టల వెనుకాల వున్న వారి ఉద్దేశ్యం అంటే భావాన్నే లెక్కలోకి తీసుకుంటాడు.

అందుకే ఏదైనా నిష్కామంగా చెయ్యమంటారు. అంటే ఫలితం ఆశించకుండా ఏ పనైనా చెయ్యమంటారు. కారణం మనం ఏదైనా ఆశించినా ఆశించిన దాంట్లో దోషం వుంటే ఆ ఫలితం సిద్ధించకపోవచ్చు, చేసిన పని వృధా అయ్యే అవకాశం కూడా వుంది.

అంతేకాదు ఏమీ ఆశించకుండా చేసినా, చేసిన పనికి ఫలితం తప్పకుండా వచ్చి తీరుతుంది. చేసిన పనికి ఏది రావాలో అది వచ్చేటపుడు మరల ఇది కావాలి, అది రావాలి అని అడగడమెందుకు? అడిగినా అడిగింది రాదు కదా? చేసిందాన్ని బట్టే వస్తుంది. అయినా మనం ఎంత చేసామో? మనం చేసిన దానికి ఎంత రావాలో మనకి తెలియదు కదా? అందుచేత అడగడమెందుకు ? చెయ్యాలనుకున్నది చెయ్యడమే ముఖ్యం. ప్రతి ఫలం ఆశించకుండా నిష్కామంగా చెయ్యడమే ఉత్తమం.

## చేసిన కర్మలకు ఫలితం కోరవచ్చా?

అసలు మనకు నేను ఇది చేసాను, ఇది కావాలి? అది రావాలి? అని అడిగే హక్కు ఎక్కడిది? మనకు ఆ హక్కే లేదు. అందుకే గీతలో శ్రీ కృష్ణుల వారు ఈ విధంగా చెప్పడం జరిగింది.

**శ్లో॥ కర్మణ్యేవాధికార స్తే మా ఫలేషు కదాచన ।**
**మా కర్మఫలహేతుర్భూ ర్మా తే సంగోస్త్వకర్మణి ॥(భ.గీ.2-47)**

తా:- నీకు కర్మ చేయడానికే అధికారం వుంది. అంతేకానీ కర్మ ఫలం ఆశించటానికి అధికారం లేదు. కర్మ ఫలానికి నీవు కారణభూతుడవు కారాదు. అట్లని కర్మలు చేయటం కూడా మానకూడదు.


అంటే చేసిన పనికి ఫలితం ఆశించే హక్కు లేదన్నారు.

# కర్మ సిద్ధాంతం గురించి పురాణాలలో

ఈ కర్మ సిద్ధాంతం గురించి సామాన్యులకు అర్థమయ్యేటట్టు తెలియ చేయటానికే పూర్వం పండితులు, ఋషులు, పురాణాల ద్వారా, పురాణ కథల ద్వారా తెలియచేయడం జరిగింది. వాటిలో కొన్ని తెలుసుకుందాం.

# యమలోకం

యమలోకంలో యమధర్మరాజు సింహాసనం మీద ఆశీనుడై వుంటాడు. ఆయన ప్రక్కనే చిత్రగుప్తుడు వుంటాడు. చిత్రగుప్తుని ఎదురుగా ఒక పెద్ద పుస్తకం వుంటుంది. ఆ పుస్తకంలో మానవుల పాప, పుణ్యాలన్నీ



వ్రాయబడి వుంటాయి. అలాగే యమలోకంలో యమభటులు కూడా వుంటారు. వారు చనిపోయిన వారిని, అంటే ఆయుఃష్షు తీరిపోయిన వారిని యమలోకానికి తీసుకు వస్తూ వుంటారు. పాపం చేసిన వారికి యమలోకంలో శిక్షలు అమలు చేస్తూ వుంటారు. అలాగే పాపులు శిక్షలు అనుభవిస్తూ వుంటారు. క్లుప్తంగా చెప్పాలంటే పురాణాల ద్వారా పండితులు లోకానికి అందించిన యమలోకం యొక్క సారాంశం ఇదే! యమలోకం గురించి అందరికీ వున్న అవగాహన ఇదే!

కానీ మనం ఆలోచించవలసింది యమలోకం వుందా? లేదా?

అని కాదు. యముడు వున్నాడా? లేడా? అని కాదు. అసలు ఈ పురాణం ద్వారా మనం తెలుసుకోవలసిన సందేశం ఏమిటన్నదే ముఖ్యం. అంతేకాదు అసలు ఈ పురాణం ద్వారా ఆ పండితులు మానవ లోకానికి ఏ సందేశం అందించారు? అసలు ఆ సందేశం ఏమిటి? అన్నదే మనం తెలుసుకోవాలి. దానిని ఆచరణలో పెట్టాలి. అప్పుడే మన జీవితం ఆనందభరితమవుతుంది. అందుచేత ఈ పురాణం యొక్క అంతరార్థం, అందులోని సందేశం తెలుసుకుందాం!

చూడండి ఎవరైనా చనిపోయిన వెంటనే ముందు ఇద్దరు యమభటులు వస్తారు. వారు చనిపోయిన వారిని పట్టుకుని యమలోకానికి తీసుకువెళతారు. అక్కడ వారిని యముడి ముందు నిలబెడతారు. అప్పుడు యమధర్మరాజు ప్రక్కనే వున్న చిత్రగుప్తుణ్ణి వీడు చేసిన పాపాలేమిటో చెప్పమంటాడు. వెంటనే చిత్రగుప్తుడు తన ఎదురుగా వున్న పెద్ద పుస్తకాన్ని తెరచి అందులో పేజీలు తిప్పుతాడు. ఒక పేజీ తీస్తాడు. ఆ పేజీలో చనిపోయిన వాడి ఖాతా వుంటుంది. ఆ ఖాతా చూసి వాడు చేసిన పాపాలన్నీ చదువుతాడు. అది విని యమ ధర్మరాజు దానికి తగ్గ శిక్షలు వేస్తాడు. యమభటులు వారికి ఆ శిక్షలు అమలు చేస్తారు. ఇదే యమలోకంలో జరిగే కార్యక్రమం. కానీ  ఇక్కడ ప్రతీ విషయంలో కూడా సందేశం వుంది. అదేమిటో తెలుసుకుందాం.

**"చనిపోయిన వారిని తీసుకు వెళ్ళటానికి ఇద్దరు యమభటులు వస్తారు**". సహజంగా లోకంలో ఎవరైనా ఏమనుకుంటారంటే చనిపోయిన తరువాత ఇక జీవితం లేదని అనుకుంటారు. కానీ చనిపోయిన తరువాత కూడా మనం వుంటాము. మనకు ఇంకా జీవితం వుంది అన్నదే ఈ సన్నివేశం ద్వారా మనకు ఇవ్వబడిన సందేశం.

మరి చనిపోయింది ఎవరు? అంటే శరీరం. అంటే శరీరం కాలిపోయింది, వాడు పైకి (చని..) వెళ్ళాడు (పోయాడు). అందుకే "చనిపోయాడు" అంటారు. చనిపోయాడు అంటే పైకి వెళ్ళాడు అని అర్థం. అంతేకానీ ఇక లేడు అని కాదు.

దీనిని బట్టి మనకు చావు లేదు మనకు ఇంకా జన్మలు వున్నాయని

తెలుసుకోవాలి. మరి మనకు ఇంకా జీవితం వున్నప్పుడు ఆ జీవితం గురించి కూడా ఆలోచించాలి కదా? ఆ జీవితం కూడా బాగుండాలి కదా? ఆ జీవితం బాగుండడానికి ఏమి చెయ్యాలో ఆలోచించాలి కదా? మరి వీటన్నిటి గురించి ఆలోచిస్తున్నామా? లేదు. ఎందుచేత ఈ విషయం తెలియక అందుకే ఆ పండితులు ఈ పురాణం ద్వారా మనకు ఇంకా జీవితం వుంది అన్న సందేశం మనకు ఇచ్చారు.

అంతేకాదు. ఈ సృష్టిలో మనకు కనబడే భూలోకమే కాదు. కనిపించని లోకాలు అనేకం వున్నాయని చెప్పడమే ఈ సన్నివేశంలోని మరొక సందేశం. దీనిని బట్టి మనం ఈ శరీరంతో కొంతకాలం... కనిపించే ఈ లోకంలో వుంటాము. ఆ శరీరం వదలగానే కనిపించని రూపంతో కనిపించని లోకాలకు వెళతామని కూడా తెలుసుకోవచ్చు. అంతేకాదు. భూమి మీద మనం చేసిన కర్మలను బట్టి ఏ లోకానికి చేరుకోవాలో ఆ లోకానికి అదృశ్యరూపులైన మాష్టర్సు ఇద్దరు వచ్చి మనల్ని తీసుకు వెళతారని చెప్పడానికే యమభటులు వస్తారని చెప్పడంలోని అంతరార్థం. అంటే ఈ ఒక్క సన్నివేశంలో ఎంత అర్థం వుందో మనం తెలుసుకోవచ్చు. ఈ సన్నివేశం ద్వారా ఆ పండితులు ఎంత సందేశం ఇచ్చారో కూడా తెలుసుకోవచ్చు.

అలా **"యమభటులు చనిపోయిన వారిని యమలోకానికి తీసుకుని వెళ్ళి యముని ముందు నిలబెడతారు. అప్పుడు యముడు చిత్రగుప్తునితో వీడు చేసిన పాపాలేమిటి? అని అడుగుతాడు. అప్పుడు చిత్రగుప్తుడు తన దగ్గర వున్న పెద్ద పుస్తకం తిరగేసి వాడి ఖాతా తీస్తాడు".**

దీనిని బట్టి పాపాలు చేసిన వారు ఎవరైనా! ఎంతటి వారైనా సరే, తరువాత లెక్కలు చెప్పవలసి వస్తుందని తెలుసుకోవాలి. అందుచేత మనం చేసే పనులు అడిగేవారు లేరు అని అనుకోవద్దు. కచ్చితంగా మనం చేసే ప్రతీ పనికి మనం సమాధానం చెప్పవలసి వస్తుంది. అందుచేత చేసే ప్రతీ పని ఆలోచించి చెయ్యాలన్నదే దీనిలోని సందేశం. అంతేకాదు భూమి మీద ఎంతటి గొప్పవారైనా తప్పులు చేస్తే ఈ సృష్టిలో ఒకే న్యాయస్థానంలో సమానంగా దోషులుగా నిలబడవలసి వస్తుందని, మనం చేసిన తప్పులకు, పాపాలకు సమాధానం చెప్పుకోవలసి వస్తుందన్నదే ఈ సన్నివేశంలోని

మరొక సందేశం.

చిత్రగుప్తుని వద్ద చిఠా వుంది అంటే అర్థం ఈ సృష్టిలో ఎవరు ఏమి చేసినా? ఎలాంటి కర్మలు చేసినా అన్నీ రికార్డు చెయ్యబడతాయని తెలుసుకోవాలి. సాధారణంగా మనం తప్పులు, పాపాలు చేసేస్తూ అవి ఎవరూ చూడట్లేదని అనుకుంటాం. ఎవరికీ తెలియదని అనుకుంటాం. కానీ ఇక్కడ ఎవరూ చూడకపోయినా ఈ సృష్టిలో మనం చేసే ప్రతీ పని, ప్రతీక్షణం రికార్డు చేయబడుతుంది. ఆ పనిని మనం ఎంతమారుమూల ప్రదేశంలో చేసినా, గదిలో తలుపులన్నీ వేసి చేసినా, చీకటి గుహలో చేసినా! అన్నీ రికార్డు చేయబడతాయని తెలియచెప్పేదే చిత్రగుప్తుని చిట్టా. అంటే ఈ సృష్టిలో ప్రతి ఒక్కరికి ఒక ఖాతా వుంటుంది. మన కర్మలు రికార్డు చేయబడతాయని ఆ పండితులు ఈ సన్నివేశం ద్వారా మనకు సందేశాన్ని ఇచ్చారు. ఆధ్యాత్మిక పరిభాషలో చిత్రగుప్తుని చిఠానే "ఆకాశిక్ రికార్డ్సు" అంటారు.

తరువాత **"చిత్రగుప్తుడు వాడు చేసిన తప్పులు ఒక్కొక్కటి చదువుతాడు".**

అంటే వాడి జీవితంలో ఎన్ని కోళ్ళు తిన్నాడో! ఎన్ని మేకలను చంపాడో! ఎన్ని చేపలను వూసకు గుచ్చి నూనెలో వేయించాడో! చెపుతాడు. ఇంకా వాడు ఎంత మందిని మోసగించాడు, ఎంతమంది మీద దౌర్జన్యం చేసాడు, అవమానించాడు, నష్టపరిచాడు, కష్టాల పాలు చేసాడు అన్నవి కూడా చదువుతాడు. అంతేకాదు ఎవరు ఎవరి కాలు తీసినా, ఎవరి చేయి నరికినా, ఎవరిపై యాసిడ్ పోసినా, భార్యను శారీరకంగా హింసించినా, అంటే ఎవరు ఏమి చేస్తే అది, ఎన్ని చేస్తే అన్నీ చదువుతాడు అంటే అర్థం మనం చేసిన ప్రతీ పని, ప్రతి తప్పు, ప్రతీ పాపం పూసగుచ్చినట్టు రికార్డు చెయ్యబడతాయని తెలుసుకోవాలి. ఎవరూ చూడట్లేదని అనుకోకూడదనే దీనిలోని సందేశం.

మరి ఎప్పుడు అనుభవిస్తారు? ఎక్కడ అనుభవిస్తారు? ఎలా అనుభవిస్తారు? అంటే పాపం పండినప్పుడు భూమి మీద కష్టాల రూపంలో, రోగాల రూపంలో, ఏక్సిడెంట్ల రూపంలో కచ్చితంగా అనుభవిస్తారు.

అనుభవిస్తారు కాదు అనుభవిస్తున్నారు కూడా.

అప్పుడు **"యమధర్మరాజు వాడు చేసిన పాపాలకు తగ్గ శిక్ష విధిస్తాడు". అంటే కోడికాళ్ళు నరికాడు అంటే వీడి కాళ్ళు నరుకు. చేపలను నూనెలో వేయించాడు అంటే వీడిని కూడా నూనెలో వేయించు. వీడు భార్యను కొట్టాడు అంటే వాడిని కూడా కొరడాలతో కొట్టు అని యమభటులకు యమధర్మరాజు ఆజ్ఞాపిస్తాడు. అప్పుడు యమ కింకరులు శిక్షలు అమలు చేస్తారు".**

ఈ సన్నివేశం యొక్క అర్థమేమిటంటే అక్కడ యముడు శిక్షలు వేస్తాడు, యమభటులు శిక్షలు అమలు చేస్తారని కాదు. ఈ సృష్టిలో ఎవరైనా సరే చేసిన పాపాలకు శిక్ష అనుభవించవలసిందే. అంటే కష్టాల పాలు కావలసిందేనని చెప్పడమే ఈ సన్నివేశ సందేశం. అంతేకాదు ఎలాంటి పాపాలు చేస్తే అలాంటి శిక్ష అనుభవించవలసివస్తుంది. ఎంత చేస్తే అంత శిక్ష అనుభవించాలని తెలియ చెప్పడమే ఈ సన్నివేశ సందేశం.



అంతేకానీ మనం చేసిన పాపాలకు శిక్షలు పైన అనుభవించం. కష్టాల రూపంలో ఇక్కడే అనుభవిస్తాం. ఎందుచేతనంటే దేహంతో చేసిన పాపాలకు దేహానికే శిక్ష వెయ్యగలరు కానీ దేహం వదిలిన ఆత్మను ఎవరు

శిక్షించగలరు? ఆత్మను ఎవరు ఏమీ చేయలేరనేగా శ్రీ కృష్ణ భగవానుడు కూడా చెప్పింది. "ఆత్మను అగ్ని దహించలేదు, నీరు తడుపలేదు. శస్త్రం చేధించలేదు. వాయువు ఆర్పివేయను జాలదు" అని చెప్పలేదా?

అందుచేత ఆత్మను ఎవరూ ఏమీ చెయ్యలేరు. దేహంతో చేసిన పాపాలకు శిక్షలు దేహంతోనే అనుభవించాలి. అందుచేత మనం ఎలాంటి హింస చేస్తే అలాంటి హింస అనుభవిస్తామని, ఎలాంటి పాపాలు చేస్తే అలాంటి నరకం అనుభవిస్తామని ఎలాంటి తప్పులు చేస్తే అలాంటి శిక్షలు భూమి మీదే దేహంతో అనుభవిస్తామని ఆ పండితులు యమలోకం సన్నివేశం ద్వారా మనకు సందేశం ఇవ్వడం జరిగింది. అందుచేత ఇది గ్రహించి మనం తప్పులు చేయకూడదు. పాపాలు చెయ్యకూడదు. జీవహింస చెయ్యకూడదు. మాంసం తినకూడదని తెలుసుకోవాలి.

అంతేకానీ యమలోకం వుందా? లేదా? యముడు వున్నాడా? లేడా? అన్నది ముఖ్యం కాదు. ఈ పురాణం ద్వారా ఆ పండితులు లోకానికి ఏం సందేశం అందించారు అన్నదే ముఖ్యం. అందుచేత పురాణాలను సందేశాత్మకంగా చూస్తే మనం ఎంతో లాభం పొందుతాం. కానీ విమర్శనాత్మకంగా చూస్తే అంతా గందరగోళమే. అంతా నష్టమే.



## ఎలాంటి హింస చేస్తే అలాంటి హింస అనుభవించాలి!

## రామాయణంలో

దశరథ మహారాజు ఒకసారి వేటకు వెళ్ళడం జరిగింది. అడవిలో వుండగా ఎక్కడో దూరాన్నుంచి లేడి నీరు తాగుతున్న చప్పుడు వినిపించింది. దశరథుడు అటువైపు గురి చూసి బాణం వదిలాడు. కానీ ఆశ్చర్యమేమిటంటే లేడి అరుపు కాకుండా ఒక బాలుడి అరుపు వినిపించింది. దశరథుడు ఆశ్చర్యపోయి అటువైపుగా వెళ్ళాడు.



ఒక ముని బాలుడు బాణం దెబ్బకు చావు బ్రతుకుల మధ్య కొట్టు మిట్టాడుతున్నాడు. దశరథుని చూడగానే ఆ బాలుడు రాజా నీకు ఏమి అపకారం చేసాను. నన్ను ఇంత దారుణం గా వధించావు. నేను ఎవరికీ అపకారం తలపెట్టే వాణ్ణి కాదే, పైగా నేను వృద్ధులు, అంధులు అయిన తల్లిదండ్రులకు ఒక్కగా నొక్క కుమారుడను, వారికి నేనే ఆధారం. వారు దాహంగా వుందంటే నీరు తీసుకు వెళ్ళటానికి వచ్చాను. నువ్వు నన్ను దారుణంగా చంపడానికి చూసావు. నేను ఎంతోసేపు బ్రతకను. కనీసం ఈ నీరు తీసుకు వెళ్ళి నా తల్లిదండ్రులకు ఇచ్చి వారి దాహం తీర్చు, అని అంటూ ఆ ముని కుమారుడు అక్కడికక్కడే ప్రాణం వదిలాడు.

దశరథుడు ఆ నీరు తీసుకుని ఆ వృద్ధ తల్లిదండ్రులు వున్న ప్రాంతానికి వెళ్ళాడు. ఆ చప్పుడు విని ఆ తల్లిదండ్రులు ఎవరు నువ్వు అని అడిగారు. అప్పుడు దశరథుడు జరిగిన వృత్తాంతమంతా చెప్పాడు. తమ

కుమారుడు చనిపోయిన సంగతి వినగానే తల్లి దుఃఖం తట్టుకోలేక అక్కడికక్కడే మృతి చెందింది.

అంధుడైన ఆ ముసలి తండ్రి కూడా విపరీతమైన దుఃఖంతో రాజా మా ఒక్కగానొక్క ఆధారమైన మా కుమారుడిని పొట్టనబెట్టుకున్నావు. మాకు ఆధారం లేకుండా చేసావు. మా పుత్రుడు లేకుండా మేము జీవించలేము. మాకు మరణమే శరణ్యం అంటూ పుత్రశోకం తట్టుకోలేక ఆ తండ్రి ఇలా అన్నాడు. కొడుకు లేని కారణంగా ఏ శోకంతో మేము మరణించామో? నీవు కూడా అదే పుత్ర శోకంతో మరణిస్తావు అని శపించి ఆ వృద్ధ తండ్రి కూడా అక్కడికక్కడే మరణించాడు.

దశరధుడు పుత్ర శోకం కలిగించి వృద్ధ దంపతుల మరణానికి ఎలా కారణమయ్యాడో! అదే కారణంతో అంటే పుత్రశోకంతోనే మరణించాడు. అంటే ఎలాంటి కర్మ చేసాడో అలాంటి ఫలితం అనుభవించాడు.

## భక్తరామదాసు



భక్త రామదాసు చరిత్ర తీసుకున్నా మనకు ఈ విషయమే బోధపడుతుంది. ఆయన సరదా కోసం ఒక చిలుకను పెంచుకున్నాడు. దాన్ని పంజరంలో వుంచి ప్రేమతో జాగ్రత్తగా పెంచేవాడు. దానికి పళ్ళు, కాయలు పెట్టేవాడు.

ఆయన అనుకోకుండా ధనం అపహరించాడనే నెపంతో జైలులో బంధింపబడ్డాడు. చాలా కష్టాలు పడ్డాడు. ఏ తప్పు చేయకపోయినా శిక్ష అనుభవించాడు. ఆయన లోకుల లెక్కలో తప్పు చేయకపోయినా సృష్టి లెక్కలో పాపం చేసాడు. ఎంతో సంతోషంగా, స్వేచ్ఛగా విహరించవలసిన పక్షి అంటే చిలుకను పంజరంలో బంధించాడు. తన ఆనందం కోసం పక్షి యొక్క స్వేచ్ఛను హరించాడు. ఆయన ఆ పక్షిని

హింసించలేదు. చంపలేదు, దాని మాంసం తినలేదు. వూరికే పంజరంలో వుంచాడు. కానీ సృష్టి లెక్కలో బంధించాడు. చిలుకను ఎంత జాగ్రత్తగా చూసుకున్నా అది మాత్రం దాని స్వేచ్ఛను కోల్పోవలసి వచ్చింది.



సృష్టిలో ఎదుట వారి, లేక ఎదుట వాటి (జంతువులు, పక్షులు, జలచరాలు) స్వేచ్ఛను హరించినా పాపమే అవుతుంది. అలా రామదాసు తాను ఎలాంటి పాపం చేసాడో అలాంటి శిక్షను అనుభవించాడు. అక్కడ బంధించాడు. ఇక్కడ బంధింపబడ్డాడు.

దీని సందేశమేమిటంటే మనమైనా మన సరదా కోసం వేటి స్వేచ్ఛను హరించకూడదు. అక్కడ సరదా కోసం పెంచుతున్నామని అనుకుంటు న్నాము. కానీ సృష్టి లెక్కలో వాటి స్వేచ్ఛను హరిస్తున్నామని తెలుసుకోవట్లేదు.

రామదాసు చరిత్ర నుంచి మరొక సందేశం కూడా మనం తెలుసుకోవలసి వుంది. సహజంగా లోకంలో దేవుళ్ళను ఆరాధిస్తే, పూజిస్తే, ప్రార్థిస్తే వారు మనల్ని కాపాడతారు, రక్షిస్తారు, మన పాపాల్ని క్షమిస్తారు, పాపాలు చేసినా కష్టాలు లేకుండా చేస్తారు, ఆయన భక్తులను ఆదుకుంటాడనే బలమైన నమ్మకం లోకంలో వుంది. అందుకే అందరూ విచ్చలవిడిగా పాపాలు చేసేస్తున్నారు. మనం ఆరాధనలు చేస్తున్నాం కాబట్టి మనకేమీ కాదులే అని భావిస్తున్నారు. దేవుడు వున్నాడు కాబట్టి మనం ఏం చేసినా ఎలా ప్రవర్తించినా! ఎన్ని తప్పులు, పాపాలు చేసినా ఫరవాలేదని భావిస్తున్నారు.

కానీ రామదాసు చరిత్రను చూస్తే ఆయన గొప్ప రామభక్తుడు. ఒక రకంగా మనందరి భక్తి కంటే రామదాసు భక్తి చాలా గొప్పది. మరి అంతటి గొప్ప భక్తుడైన రామదాసును దేవుడైన శ్రీరాముడు ఎందుకు ఆదుకోలేదు? శిక్ష పడకుండా చూడలేదు? కష్టం రాకుండా చేయలేదు? చిన్న తప్పును అంటే పాపాన్ని ఎందుకు క్షమించలేదు? ఆలోచించండి?

దేవుళ్ళు పాపాలు క్షమిస్తారని అంటారు కదా? మరి రామదాసు పాపాన్ని ఎందుకు క్షమించలేదు?

అంటే దీని అర్థం ఏ దేవుడు ఎవరి పాపాలను క్షమించరు. పాపం చేసిన వారు అనుభవించవలసిందే తప్ప ఈ సృష్టిలో తప్పించుకోలేరని తెలుసుకోవాలి. దేవుడు కాపాడతాడనే అపోహ నుండి బయటపడాలి. పాపాలు చెయ్యకూడదు.

ఆలోచించండి "దేవుడు పాపాలు క్షమిస్తాడు, కాపాడతాడు అని పాపాలు చెయ్యడమెందుకు? అసలు పాపాలే చెయ్యకుండా వుంటే సరిపోతుంది కదా? ఆలోచించండి పాపాలు చెయ్యడమెందుకు? ప్రార్థనలు చెయ్యడమెందుకు? పాపాలే చెయ్యకపోతే ప్రార్థనలే చెయ్యనవసరం లేదు కదా?

అందుకే అంటారు. అడుసు తొక్కనేల కాళ్ళు కడగనేల? అడుసు తొక్కకపోతే కాళ్ళే కడగనక్కరలేదు కదా?

అందుచేత భక్త రామదాసు చరిత్ర నుంచి మనం గ్రహించవలసింది ఏమిటంటే? దేవుడు మీద ఆధారపడటం కాదు, పాపాలు చెయ్యకుండా వుండటం కోసం జాగ్రత్త పడాలి.

కొంచెం ఆలోచించండి. రామదాసు పక్షిని హింసించాడా? చంపాడా? భక్షించాడా? లేదే? వూరికే పంజరంలో పెట్టాడు. జాగ్రత్తగా చూసుకున్నాడు. అయినా అంతటి భక్తుడైన రామదాసుకు ఎంత శిక్ష పడిందో చూసారా? మరి మనం రామదాసు అంతటి భక్తులమా అంటే కాదు కదా? అటువంటిది మనం ఒక పక్షిని అంటే కోడిని హింసించి, చంపి, భక్షిస్తే ఎంత శిక్ష పడుతుందో? ఆలోచించండి.

అందుకే పత్రీజీ హింస చెయ్యవద్దు అంటారు. ముఖ్యంగా జీవ హింస చెయ్యవద్దు అంటారు. మాంసం తిని జీవహింసకు కారణం కావద్దు అంటారు. అందుచేత సృష్టిలోని కర్మ సిద్ధాంతం గురించి అవగాహన చేసుకోండి దానికి అనుగుణంగా జీవించండి జీవితాన్ని ఆనందమయం చేసుకోండి.

## కర్మ సిద్ధాంతం వల్ల లాభం పొందాలంటే?

సృష్టిలోని ఈ కర్మ సిద్ధాంతాన్ని అర్థం చేసుకున్న వారు జీవితంలో ఎంతో లాభం పొందగలరు. ఎందుచేతనంటే ఈ సృష్టిలో మనం ఏది కావాలన్నా పొందగలిగే అవకాశం వుంది. ముఖ్యంగా మనం చేసే పనులను బట్టే మన జీవితం వుంటుంది కాబట్టి పనుల విషయంలో కాస్త జాగ్రత్త పడితే సరిపోతుంది.

మొట్టమొదట నష్టం కలిగించే పనులు చేయకూడదు, లాభం కలిగించే పనులే చెయ్యాలి, అంటే సేవలు చెయ్యాలి. 'సేవ' అంటే ఏమీ ఆశించకుండా ఇతరులకు లాభం కలిగించే, ఆనందం కలిగించే పనులు, అంటే ఇవ్వడం! ఎప్పుడయితే సేవలు చేస్తామో మన భవిష్యత్తు, మన జీవితం ఎప్పుడూ లాభ కరకంగా, ఆనందదాయకంగా వుంటుంది. ఎంత ఎక్కువ సేవలు చేస్తే అంత ఎక్కువ లాభం పొందుతాం. అంటే ఎంత ఎక్కువ ఇస్తే అంత ఎక్కువగా పొందుతాం. ఎటువంటి సేవలు చేస్తే అటువంటి లాభాలు పొందుతాం.

ఉదాహరణకు మనం ధనవంతులు కావాలనుకుంటే అంటే ధనం ఎక్కువ రావాలంటే ధనాన్ని ఎక్కువ ఇవ్వాలి. ఎంత ఎక్కువ ఇస్తే అంత ఎక్కువ ధనం పొందుతాం. ఇక్కడ ఒక సందేహం వస్తుంది. ధనం ఎక్కువ ఇవ్వాలంటే! అది ధనం వున్నవాడికి సాధ్యమవుతుంది కానీ ధనం లేని వాడికి అది సాధ్యం కాదు కదా? మరి ధనం లేనివాడు అంటే పేదవారికి భవిష్యత్తులో ధనం పొందే అంటే ధనవంతులయ్యే అవకాశం లేదా? అనిపిస్తుంది. కానీ ఈ సృష్టిలో పేదవారు కూడా ధనవంతులు అయ్యే అవకాశం వుంది. ఎందుచేతనంటే ఈ సృష్టిలో అందరూ సమానమే! అందుచేత అందరికీ సమాన అవకాశాలు వున్నాయి. మరి ఎలా?

ఎలా అంటే? భూమి మీద ఎంత ఎక్కువ ఇచ్చారు? అన్నది చూస్తారు కానీ సృష్టిలో ఎంత ఎక్కువ శాతం ఇచ్చారు? అన్న దానికి ప్రాముఖ్యం ఇవ్వబడుతుంది. అంటే వున్నదాంట్లో ఎంత ఎక్కువ ఇచ్చాడు? అన్నదే చూడబడుతుంది, అంటే లెక్కించబడుతుంది.

ఉదాహరణకు కోట్లు వుండి లక్షలు దానం చేసిన వాడి కంటే వేలు వున్నవాడు వందలు దానం చేస్తే ఎక్కువ దానం చేసినట్టు, ఎక్కువ ఇచ్చినట్టు.

అంటే భవిష్యత్తులో వందలు ఇచ్చిన వాడే ఎక్కువ ధనం పొందే అవకాశం వుంటుంది, అంటే అర్హత సంపాదించుకున్న వాడవుతాడు.

అందుచేత ఎంత ఇచ్చాము? అన్నది చూడకండి వున్న దాంట్లో ఎంత ఇచ్చాము అన్నది చూసుకోండి. సృష్టిలో వున్న ఈ ధర్మసూక్ష్మం అర్థం కాక ధనం తక్కువ వున్నవారు నిరాశ చెందుతూ వుంటారు. తాము ఏమీ ఇవ్వలేకపోతున్నామని, ఇచ్చే అవకాశం తమకు లేదని, తాము ఇచ్చేది పెద్ద గొప్పది కాదనుకుంటూ ఇవ్వాలని వున్నా ఇవ్వడం మానేస్తారు. లక్షలు ఇచ్చే వారిని చూసి వారు గొప్పవారు కాబట్టే ఆ రకంగా ఇస్తున్నారు. గొప్ప దానం చేస్తున్నారు, అలా మేమెక్కడ ఇవ్వగలం? అని బాధపడుతూ వుంటారు.

ఇంకా కొంతమంది నాకు లేదు కానీ వుంటే అంతకన్నా ఎక్కువ ఇచ్చేవాడిని అని అంటారు. అలా అంటూ అసలు ఇవ్వడమే మానేస్తారు.

ఇంకా కొంతమంది సేవలు చెయ్యాలన్నా, గొప్ప గొప్ప దానాలు చెయ్యాలన్నా ధనం వుండాలి కదా? అనుకుంటూ ధనం సంపాదించడానికి ప్రయత్నిస్తారు. బాగా ధనం సంపాదిస్తే బాగా దానాలు చెయ్యవచ్చు. బాగా సేవా కార్యక్రమాలు చెయ్యవచ్చు అనుకుంటారు. అలా అనుకుంటూ కొద్దిగా కూడా దానం చెయ్యరు. పైగా ధనం సంపాదించటానికి తప్పులు చేస్తారు, పాపాలు చేస్తారు, అధర్మంగా వ్యవహరిస్తూంటారు. చివరకు వీరికి పుణ్యం మాట అటుంచి పాపమే వస్తుంది.

అందుచేత దానం చెయ్యటానికి సంపాదించనక్కరలేదు ఉన్న దాంట్లో ఇవ్వగలిగితే అదే గొప్ప దానం, అదే గొప్ప పుణ్యం అని తెలుసుకోండి.

ఏది ఏమైనా కర్మ సిద్ధాంతం గురించి బాగా అవగాహన చేసుకోండి. లాభం కలిగించే కర్మలు చెయ్యండి. నష్టం కలిగించే కర్మలు చెయ్యకండి.

ముఖ్యంగా ముక్తికర్మలు, అంటే ఆత్మ కర్మలు విశేషంగా చెయ్యండి. జ్ఞానం పొంది ముక్తిని సంపాదించుకోండి. జీవితాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోండి.

▲ ప్రజలు నీ పట్ల ఎలా ప్రవర్తిస్తే అది వారి కర్మ. దానికి నువ్వు ఎలా ప్రతిస్పందిస్తే అది నీ కర్మ.

– వేయన్ డియర్

# కర్మలు ఎలా విభజించవచ్చు?

కర్మలను రెండు రకాలుగా విభజించవచ్చు. (1) దేహకర్మలు, (2) ఆత్మకర్మలు.

దేహ కర్మలను మరల రెండు రకాలుగా విభజించవచ్చు. (1) పాప కర్మలు, (2) పుణ్య కర్మలు. అలాగే ఆత్మ కర్మలలో కూడా (1) పాప కర్మలు (2) పుణ్యకర్మలు వున్నాయి. ఒక రకంగా పాప కర్మలు నష్టాన్ని కలిగిస్తే పుణ్య కర్మలు లాభాన్ని కలిగిస్తాయి.

దేహం విషయానికి వస్తే అంటే ఇతరులను, ఇతర జీవులను హింసించడం, మోసగించడం, అవినీతి, అధర్మం, అబద్ధం, అత్యాచారం, అవమానం, విమర్శలు లాంటివన్నీ పాప కర్మలే వీటి వల్ల నష్టపోతారు. అంటే శారీరకంగా రోగాలు, భాధలు, కష్టాలు, సమస్యలు వస్తాయి.

అలాగే దేహపరమైన పుణ్యకర్మలు చేస్తే అంటే ఇతరులకు సేవలు చేస్తే, దానాలు చేస్తే, ధర్మకార్యాలు చేస్తే, ఆనందం కలిగిస్తే లాభం పొందుతారు. అంటే భోగం అనుభవిస్తారు. సంపదలు పొందుతారు. సుఖాలు అనుభవిస్తారు. అన్ని విషయాలలో కలిసి వస్తుంది, ఆనందంగా జీవిస్తారు.

ఒక రకంగా ఆత్మకర్మలు అంటే ధ్యానమనే చెప్పుకోవచ్చు. కారణం ధ్యానం ఒక్కటే ఆత్మకు సంబంధించినది.

అందుచేత ఆత్మ విషయంలో పాపాలు చేస్తే మోక్షానికి దూరం అవుతారు. పుణ్యం చేస్తే మోక్షానికి దగ్గర అవుతారు. మోక్షానికి దూరం అవుతే 'ఆత్మ'కు నష్టం. మోక్షానికి దగ్గర అవుతే 'ఆత్మ'కు లాభం.

మరి ఆత్మకు సంబంధించిన పాప కర్మలు ఏమిటి?

(1) అసత్యాన్ని సత్యమని చెప్పడం. సత్యమైన ఆత్మ విషయంలో తప్పుదోవ పట్టించడం.

(2) ధ్యానులకు అవరోధం కలిగించడం, అడ్డుపెట్టడం, ధ్యాన కార్యక్రమాలకు ఆటంకాలు కలిగించడం, చెడగొట్టడం.

(3) ధ్యానం చేసే వారికి అసౌకర్యం కలిగించడం అంటే ధ్యానం చేసేటపుడు సెల్‌ఫోన్స్ మ్రోగించడం, మధ్యలో చప్పుళ్ళు చెయ్యడం, గట్టిగా

మాట్లాడటం, చంటి పిల్లల్ని తీసుకు వచ్చి ఏడ్పించడం లాంటివి.

(4) ధ్యానులకు, ఆధ్యాత్మిక మార్గంలో వున్న వారికి తప్పుడు సలహాలు ఇచ్చి, తప్పుడు మార్గాలు బోధించి వారి ఆధ్యాత్మిక ఎదుగుదలకు అవరోధం కలిగించడం.

(5) ధ్యానం ద్వారా వారు సంపాదించుకున్న శక్తి కోల్పోయే సలహాలు ఇవ్వడం.

(6) సంకల్పాలతో ఇతరులు అనుభవించవలసిన కష్టాలు తన మీద వేసుకోవడం.

(7) పొందిన కొద్దిపాటి శక్తులను ప్రదర్శించడం, గొప్పలు చెప్పుకోవడం, వాటిని ప్రదర్శిస్తూ, లేనివి చెపుతూ ఇతరులను వశం చేసుకోవటానికి ప్రయత్నించడం

(8) ఆధ్యాత్మికతను తన స్వార్థానికి, స్వలాభానికి ఉపయోగించు కోవడం.

(9) ఆధ్యాత్మిక మార్గంలో ధనం సంపాదించడానికి ప్రయత్నించడం.

ఇవన్నీ ఆత్మ సంబంధమైన పాప కర్మలే. ఇటువంటి వారు మోక్షానికి దూరమైపోతారు. అంతేకాదు వీరి పాపాలు పరాకాష్టకు చేరితే అంటే పరిధి దాటితే వీరు ఈ ఆత్మమార్గం నుంచి తప్పించబడతారు. అంటే అర్హత కోల్పోతారు కూడా.

అందుకే పత్రీజీ "ఆధ్యాత్మిక మార్గంలో ఎంత మందిని తప్పుదోవ పట్టిస్తారో అంతకు అంతమందిని జ్ఞానులుగా చేసే వరకు మోక్షాన్ని పొందలేరు. జన్మలు తీసుకుంటూనే వుండాలి" అంటారు.

అలాగే ఆత్మకు సంబంధించిన పుణ్యకర్మలు.

1) ధ్యాన సాధన

2) జ్ఞానవంతమైన పుస్తకాలు చదవడం

3) జ్ఞానులతో సాంగత్యం చెయ్యడం

4) ఈ మార్గంలో సేవ

సేవ అంటే జ్ఞానాన్ని అందరికీ బోధించడం అందరినీ జ్ఞానవంతులుగా

చేయడానికి ప్రయత్నించడం. అంతేకాదు జ్ఞానులు కావడానికి కావలసిన ధ్యానం చెప్పడం, ధ్యానం చేయించడం, ధ్యాన కార్యక్రమాలు నిర్వహించడం, ధ్యానకార్యక్రమాలకు తనువు, మనస్సు, ధనంతో సహకరించడం, పాల్గొనడం, ప్రోత్సహించడం.

5) పిరమిడ్లు నిర్మించడం, ధ్యానకేంద్రాలు స్థాపించడం. అటువంటి కేంద్రాలకు ఆర్థిక సాయం అందించడం.

ఇవన్నీ ధ్యానానికి సంబంధించినవి. జ్ఞానం పొందటానికి ఉపకరించేవి. మానవులు ముక్తి పొందే మార్గాలు అంటే ఆత్మకు మోక్షాన్ని అందించేవి అంటే జన్మ లేకుండా చేసేవి. అందుకే ఆత్మ పుణ్యాలు అన్నాం. వీటినే ఆత్మకార్యాలు అని పెద్దలు పేర్కొన్నారు.

ఇటువంటి పుణ్యకర్మల వల్ల మోక్షానికి దగ్గర అవుతారు.

అందుచేత దేహ సంబంధమైన పాప కర్మల వల్ల దుఃఖంతో బాధపడతారు. పుణ్యకర్మల వల్ల భోగం అనుభవిస్తారు.


అలాగే ఆత్మ సంబంధమైన పాప కర్మల వల్ల మోక్షానికి దూరం అవుతారు. అంటే జన్మలు పెరుగుతాయి. పుణ్యకర్మల వల్ల మోక్షానికి దగ్గర అవుతారు. అంటే జన్మలు తగ్గిపోతాయి.

ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చిన వారు జన్మలు తగ్గించుకోవటానికి, జన్మలు లేకుండా చేసుకోవడానికే వస్తారు. కానీ ఈ మార్గంలోకి వచ్చి కూడా పాపాలు చేస్తే వారు అనుకున్నది సాధించకపోగా ఇంకా ఎక్కువ నష్టపోతారు. లక్ష్యానికి ఇంకా... ఇంకా దూరమైపోతారు.

ఒక రకంగా ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించాలంటే కత్తి మీద సాము చెయ్యడమే. అందుచేత ధ్యాన మార్గంలోకి వచ్చిన వారు చాలా చాలా జాగ్రత్తగా కర్మలు చెయ్యాలి. ఆలోచించి మరీ పనులు చెయ్యాలి. సత్యాన్నే చెప్పాలి. సరైన సలహాలు ఇవ్వాలి.

▲ నువ్వు ఏది ఇస్తావు అనుకోకుండా నీకు అదే వస్తుంది. అందుచేత ఏది వస్తే నీకు నష్టం లేదో అదే ఇవ్వు.

# “కర్మబద్ధుడు”



కర్మలు
చేసే తీరాలి!
అకర్ముడిగా ఎప్పుడూ వుండరాదు...
ఓడిపోతామని తెలిసినా సరే!

-----

మొదట్లో అపజయం కలిగినా ,
“అపజయం కూడా విజయ పరంపరలోని ఒక మెట్టే” అని గ్రహించాలి.

-----

కర్మలు చేసే తీరాలి!
ధర్మాధర్మాలు సరిగ్గా తెలియకపోయినా సరే!
కర్మబద్ధుడైనవాడికి
ధర్మాధర్మ జ్ఞానం క్రమక్రమంగా తప్పక కలుగుతుంది.

-----

ప్రతి ఒక్కడూ కర్మలు చేస్తూనే వుండాలి!
“మా తే సంగోస్త్వకర్మణి” అని కదా అన్నాడు గీతాకారుడు.

-----


సోమరిగా,తమోగుణిగా,
అకర్ముడిగా, ఎవ్వరూ, ఎప్పుడూ వుండరాదు!
‘రేపు’ అని ఎవ్వరూ, ఎప్పుడూ అనరాదు

-----

కర్మబద్ధుడు ఎప్పుడూ అగ్రజుడే!
అకర్ముడు ఎప్పుడూ చిట్టచివరివాడే!

– బ్రహ్మర్షి పత్రీజీ

# గతం ... అవగతం ... విగతం




"గతం" అంటే, మన "భూతకాల స్థితి"
పుట్టినప్పటి నుంచి ప్రస్తుతం వరకు చేసిన కార్యకలాపాల చిట్టా
ఇంకా వెనక్కిపోతే వెనకటి జన్మల గాథలు కూడా
"అవగతం" అంటే "అర్థం కావడం"
"అవ" అంటే "వెనక్కి రావడం" అని కూడా
ఉదాహరణకు పదాలు "అవరోహణం" .. "అవతారం"
"వెనక్కి రావడం" అంటే, "రివర్స్‌గేర్ వేయడం".. అన్నమాట
గతాన్ని "రివర్స్ గేర్"లో పరిలోకించినప్పుడే
ఆ గతం పూర్తిగా 'అవగతం' అయి ఇక 'విగతం' అవుతుంది
"విగతం" అంటే "మాయమైపోవడం"
'గతం' అన్నది 'అవగతం' అయి 'విగతం' అయినప్పుడే
వర్తమానం అన్నది భవిష్యత్తుకు బంగారుబాట కాగలదు
<u>గతం</u> అన్నది పూర్తిగా అవగతం కాకపోతే
ఆ గతమే పదే పదే మరి పునరావృతమవుతూ ఉంటుంది
చేసిన తప్పులు మళ్ళీ మళ్ళీ చేస్తూనే ఉండడం జరుగుతూ ఉంటుంది
మన జీవితం చర్విత చర్వమవుతూనే ఉంటుంది
కనుక, ఎప్పుడూ "ఫార్వర్డ్ గేర్"లోనే కాకుండా
అప్పుడప్పుడూ "రివర్స్ గేర్"లో కూడా జీవించాలి

– బ్రహ్మర్షి పత్రీజీ

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) గురుపౌర్ణమి విశిష్ఠత | - | రూ.60/- |
| 8) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 9) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 10)పంచకోశాలు | - | రూ.60/- |
| 11) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 12) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 13) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |

పుస్తకముల కొరకు : **తటవర్తి వీర రాఘవరావు**, తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్:9440309812,



# Tatavarthy Raghavarao Sir Books in English

| | | |
|---|---|---|
| 1. | Life Science (Part-I) | Rs.120 |
| 2. | Why is Guiding Not Meditation ? | Rs.100 |
| 3. | Die before death! | Rs.120 |
| 4. | The Law of Karma | Rs.100 |
| 5. | What is Meditation? | Rs.80 |
| 6. | True Path | Rs.80 |
| 7. | Why soul-knowledge ? | Rs.70 |
| 8. | What comes after death ? | Rs.70 |
| 9. | How to improve Financial Status ? | Rs.60 |
| 10. | Wisdom is attained only through Meditation | Rs.60 |
| 11. | What is Intention? | Rs.50 |
| 12. | Why is this life? | Rs.50 |
| 13. | Vegetarian Food Is Human Food | Rs.50 |
| 14. | Meditation for the Development of Students | Rs.40 |
| 15. | Non violence and vegetarianism | Rs.40 |

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం -రూ.160/-
9) మరణించకముందే మరణించాలి - రూ.130/-
10) జీవిత సూక్ష్మాలు - రూ.130/-
11) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
12) గీతాసందేశం - రూ.120/-
13) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు- రూ.100/-
18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన
మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? - రూ.100/-
19) కర్మ సిద్ధాంతం - రూ.80/-
20) ధ్యానమంటే ? - రూ.80/-
21) త్రివిధాలు - రూ.80/-
22) ఉత్తమ పురుషుడు - రూ.80/-
23) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
24) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
25) జ్ఞాన జ్యోతి - రూ.70/-
26) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
27) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
28) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
29) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య- రూ.70/-
30) బుద్ధుని సందేశాలు - రూ.70/-
31) భూతదయే దైవత్వం - రూ.70/-
32) ఆత్మహంతకులంటే ఎవరు?- రూ.70/-
33) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
34) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
35) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
36) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
37) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
38) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
39) అతీంద్రియ శక్తులు - రూ.60/-
40) ఆలోచించండి - రూ.60/-
41) నిర్వాణ మార్గం - రూ.60/-
42) ధ్యానులకు సూచనలు - రూ.60/-
43) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
44) సంకల్పమంటే? - రూ.50/-
45) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
46) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
47) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.40/-
48) ఛాంపియన్ అవ్వాలంటే? -రూ.40/-
49) బ్రహ్మం అంటే? -రూ.40/-
50) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం -రూ.40/-
51) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం -రూ.40/-
52) మహాత్ముల సందేశాలు - రూ.40/-
53) సత్యం - రూ.40/-
54) చక్రాలు - రూ.40/-
55) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
56) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/-
57) మౌన ధ్యానం - రూ.40/-
58) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? -రూ.20/-
59) శాకాహారమే మానవాహారం - రూ.15/-
60) అహింస మరియు శాఖాహారం- రూ.15/-

పుస్తకముల కొరకు : **తటవర్తి వీర రాఘవరావు**, తటవర్తివారి వీధి,
భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్: 9440309812,



శ్లో॥ కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన
మా కర్మఫలహేతుర్భూర్మాతే సఙ్గోస్త్వ కర్మణి

(భ.గీ.2-47)

తా:- అర్జునా! నీకు కర్మను చేయుట యందే అధికారము కలదు. కానీ కర్మ ఫలము ఆశించుటకు నీకు అధికారము లేదు. కర్మ ఫలమునకు నీవు కారణభూతుడవు కారాదు. అట్లని కర్మలు చేయుట మానరాదు.

రూ.80/-